
శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

శాసనసభల్లోనే కాదు.. ప్రభుత్వరంగ సంస్థల్లోనూ మహిళల వాటా ఏదీ?

కల్తీ మద్యం కలకలం
మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో 10 మంది మృతి

07

సంపుటి 09, సంచిక: 278 | సోమవారం | 07-09-2026 | ఖమ్మం
Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00

నేటి నుంచి అసెంబ్లీ

## వర్షాకాల సమావేశాలు

ఉదయం 10 గంటలకు ప్రశ్నోత్తరాలు

ప్రజాపక్షం/హైదరాబాద్



'వర్షకాల శాసనసభ సమావేశాలు' సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో ప్రశ్నోత్తరాలు, ఆ తర్వాత 'తెలంగాణ సమగ్ర శిక్ష(టిఎస్ఎస్) 2024–25 , పి ఎం స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా 2024–25, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ 2015–16, 2016–17, 2017–18 వార్షిక ఆడిట్ రిపోర్ట్‌ను సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ వర్షకాల సమావేశాలు ప్రధానంగా వెయ్యిరోజుల కాంగ్రెస్ పాలన,తొమ్మిదనరేళ్ల బిఆర్ఎస్ పాలనకు వేదిక కానున్నాయి. ప్రతిపక్ష పార్టీలు ప్రస్తావించే అంశాలకు ధీటుగా సమాధానం ఇవ్వాలని ప్రభుత్వం సిద్ధమైంది. సమావేశాల సందర్భంగా జరిగే చర్చలలో సభ్యులు ప్రస్తావించే అంశాలకు, ప్రశ్నలకు ప్రభుత్వం తరపున సమాధానం ఇవ్వాలని, అందుకు ఆయా శాఖలు పూర్తి సమాచారంతో సిద్ధమవ్వాలని ఇది వరకే రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. దీనికి సంబంధించిన శాఖల వారీగా ప్రత్యేకంగా అధికారులకు బాధ్యతలను అప్పగించినట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఎన్నికల హామీల అమలు, 22ఎ, ఫీజు రియంబర్స్‌మెంట్, నీటి ప్రాజెక్ట్‌లు, రైతు సమస్యలు, ఉద్యోగాల భర్తీ, ఉద్యోగుల సమస్యలు, అవినీతి ఆరోపణలు తదితర అంశాలపైన రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతిపక్ష పార్టీలు సన్నద్ధమవుతుండగా, అందుకు ధీటుగా సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వం కూడా సిద్ధమైంది. అయితే ఉద్యోగ, కార్మిక, గుడిసేవాసులకు ఇళ్ల పట్టాల పంపిణీ, ఫీజుల బకాయిల చెల్లింపు, ప్రజలకు మెరుగైన వైద్యం, అభివృద్ధి పనులు, సంక్షేమ తదితర అంశాలను సిపిఐ ప్రస్తావించనుంది. ఈ సారి జరిగే సమావేశాలు వాడివేడిగా జరగనున్న నేపథ్యంలో అధికార పార్టీ అప్రమత్తంగా ఉండాలని తమ సభ్యులకు సూచించగా, ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి ప్రధానప్రతిపక్ష బిఆర్ఎస్ సిద్ధమవుతోంది.




12

## లేబర్ కోడ్‌ల రద్దుకు కార్మికులు

# ఏకమై ప్రతిఘటించాలి

- స్వాతంత్ర్య పోరాటంలో ఎఐటియుసిది త్యాగాల చరిత్ర
- యావత్ ప్రపంచానికి మానవహక్కుల పాఠాన్ని నేర్పింది కార్మిక ఉద్యమమే
- ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్
- ప్రతి రంగంలో కార్మిక సంఘాలను బలోపేతం చేయాలి : కూనంనేని సాంబశివరావు
- కార్మిక హక్కుల సాధనకు రణభేరి మోగిస్తాం : చాడ వెంకట్‌రెడ్డి
- కరీంనగర్‌లో ఘనంగా ప్రారంభమైన ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు

ఇస్రో ప్రైవేటీకరణపై

## ఉద్యోగుల ఆందోళన

- అధికారిక సమాచారం ఇవ్వకుండా దొడ్డిదారి ప్రకటనలేమిటని నిలదీత
- ఖాళీల భర్తీ, నియామకాల క్యాలెండర్‌పై వివరణకు డిమాండ్

**ఛైర్మన్ నారాయణన్‌కు తొమ్మిది సంఘాల లేఖ**



**న్యూఢిల్లీ :** దేశ భద్రతకు అత్యంత కీలకమైన,ఎంతో ప్రతిష్టాత్మకమైన భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) ప్రభుత్వం చేతుల్లోంచి జారిపోయి ప్రైవేటురంగ భాగస్వామ్యంలోకి వెళుతోందన్న వార్తలు ఇస్రోలోని ఉద్యోగ సంఘాలకు తీవ్ర ఆందోళన,ఆవేదన కలిగిస్తున్నాయి. దీంతో ఇస్రోకు చెందిన తొమ్మిది ఉద్యోగ సంఘాలు వివరణ కోరుతూ ఛైర్మన్ వి.నారాయణన్‌కు గడచిన శుక్రవారం (సెప్టెంబరు 4) ఒక లేఖ రాశాయి. ఉద్యోగ సంఘాలతో సంప్రదింపులు చేయకుండా, వారి సలహాలు తీసుకోకుండా, వారికి కనీస సమాచారాన్ని అధికారికంగా చెప్పకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారని సంఘాలు ప్రశ్నించాయి. రాబోయేకాలంలో అంటే 2030 నాటికి ఇస్రో ఒక సంవత్సరానికి 50 ప్రయోగాలు చేయగలస్థాయికి చేరుకోవాలన్న లక్ష్య నిర్దేశం ఉందని,ఈ లక్ష్యాలు చేరుకోవాలంటే కేవలం ఇస్రోకు సాధ్యం కాదని, ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందని ఆదివారంనాడు ఎక్స్ వేదికగా ఇన్–స్పేస్ (ఇండియన్ స్పేస్ ప్రమోషన్–అథరైజేషన్ సెంటర్) ఛైర్‌పర్సన్ పవన్ గోయంకా ఒక పోస్టింగ్ పెట్టారు. ప్రైవేటు భాగస్వామ్యంతో తరువాయి 8లో



ప్రజాసమస్యలపై అసెంబ్లీలో గళమెత్తడంలో

# కెసిఆర్ విఫలం

- చేతకాకపోతే తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి
- కొడుకు, అల్లుడి ప్రయోజనాల కోసం ఫామ్‌హౌస్‌కే పరిమితం
- మహాధర్నాలో కాంగ్రెస్ నేతలు విమర్శ
- వెయ్యిరోజుల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధిని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ తన కొడుకు, అల్లుడి రాజకీయ ప్రయోజనాల కోసం ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని, అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడటంలో ఘోరంగా విఫలమయ్యారని పలువురు కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. కెసిఆర్ చేతకాకపోతే రాజీనామా చేసి తప్పుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజాపాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తరువాయి 8లో

**బూతులు తిడుతున్న వారితో చర్చలకు**

# అసెంబ్లీకి రావాలా?

- పాలన చేతకాకే బూతుపురాణం అందుకున్న సిఎం రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన ఒక డిజాస్టర్, అట్టర్‌ఫ్లాప్
- కాళేశ్వరం, పాలమూరు- రంగారెడ్డి విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా లక్షలాది మందితో ప్రత్యక్ష ఉద్యమం
- అసెంబ్లీలో జరిగే ప్రతీ చర్చలోనూ పాల్గొనాలి
- ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో జరిగిన బిఆర్ఎస్ఎల్‌పి సమావేశంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రతిపక్షనేత కెసిఆర్ దిశానిర్దేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన ఒక డిజాస్టర్, అట్టర్ ఫ్లాప్ అని బిఆర్ఎస్ అధ్యక్షుడు,ప్రధానప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మండిపడ్డారు. ప్రజా సమస్యలపైన శాసన మండలి, శాసన సభలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు సూచించారు. పాలన చేతకాకనే సీఎం రేవంత్ రెడ్డి అభ్యంతరకరంగా బూతుపురాణం అందుకున్నారని, అలాంటి వారితో చర్చలకు అసెంబ్లీకి రావాలా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి రెండు ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రాబోయే రోజుల్లో లక్షలాది మందితో ప్రత్యక్ష ఉద్యమానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కెసిఆర్ అధ్యక్షతన సిద్ది పేట జిల్లా ఎర్రవల్లిలో బిఆర్ఎస్ఎల్‌పి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు, శాసనమండలిలో ప్రధానప్రతిపక్ష నేత మదుసూదనచారి, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్, బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకులు తన్నీరు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు ఎల్.రమణ, పోచారం శ్రీనివాస్ రెడ్డితో పాటు మాజీ మంత్రులు జి.జగదీశ్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. శాసనసభ,శాసనమండలి వర్షకాల సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రస్తావించాల్సిన అంశాలు, అసెంబ్లీ బయట, లోపల వ్యవహారించాల్సిన తీరుపైన కెసిఆర్ దిశానిర్దేశం చేశారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం కెసిఆర్ పైవిధంగా స్పందించారు. తన చావు కోరుతూ పదేపదే తరువాయి 8లో



## విద్యార్థుల గొంతు వినండి

- లేదంటే 'ఛాత్రోం కీ గూంజ్' తీవ్రతరం
- వ్యవస్థపై వారికి విశ్వాసం సన్నగిల్లడమే నిరసనలకు కారణం: రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ :** మహారాష్ట్రలో వేలాది మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారని కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థుల సమస్యలకు కారణం కేవలం ఒక పరీక్ష లేదా నియామక ప్రక్రియ కాదని, మొత్తం వ్యవస్థపై వారికి నమ్మకం దెబ్బతినడమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం వారి గొంతు విని వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే 'ఛాత్రోం కీ గూంజ్' (విద్యార్థుల ప్రతిధ్వని) మరింత తీవ్రమవుతుందని ఆయన స్పష్టం చేశారు. కేంద్రమైన, రాష్ట్ర ప్రభుత్వమైనా ప్రతి విద్యార్థి బిజెపి పాలన వల్ల బాధించబడుతున్నారన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. 'పేపర్ లీక్‌లు, నిలిచిపోయిన నియామకాలు, భరించలేని విద్యా వ్యయం, హాస్టళ్లలో అమానవీయ పరిస్థితులు, తరువాయి 8లో

ఎల్‌నినో ఉన్నా జాన్తా నై..

# వరి సాగుకే సై

- ఈనెల 5 నాటికి 57.70 లక్షల ఎకరాల్లో నాట్లు
- గత ఏడాదితో పోల్చితే కేవలం 10 శాతమే తగ్గిన విస్తీర్ణం



ప్రజాపక్షం/హైదరాబాద్

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్ష భావ పరిస్థితులు నేపథ్యంలో ఈ ఏడాది వరి సాగుపై తీవ్ర ప్రభావం పడుతుందని అంతా భావించినప్పటికి రైతులు మాత్రం పెద్దగా లెక్కలోకి తీసుకోలేదు.. వర్ష కాలం ప్రారంభంలో వర్షాలు సకాలంలో కురువకపోవడంతో వరిసాగుపై తీవ్ర ప్రభావం చూపినప్పటికీ జూలై చివరి వారంతో పాటు అగస్టులో మొదటి రెండు వారాలు తర్వాత సెప్టెంబర్‌లో నెల ప్రారంభం నుంచి సైతం వర్షాలు తరువాయి 8లో



## ఉద్యోగుల భద్రతే ముఖ్యం

ఇహెచ్‌ఎస్ అమలులో రాజీ లేదు : డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

గత ప్రభుత్వాలు పదేళ్లుగా పట్టించుకోని ఉద్యోగుల ఆరోగ్య సమస్యకు తమ ప్రజాప్రభుత్వం పరిష్కారం చూపిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబాల తరువాయి 8లో

హోర్ముజ్‌లో తొమ్మిది నౌకలపై

## పరస్పర దాడులు

అమెరికా నేవీ డెస్ట్రాయర్‌పై ఐఆర్‌జిసి క్షిపణి దాడులు



**దుబాయ్ :** పశ్చిమాసియాలో నెలరోజులపాటు తుఫాను ముందరి ప్రశాంతత నెలకున్న తర్వాత వారం రోజుల క్రితం తీవ్రరూపం దాల్చిన సంఘర్షణ కొనసాగుతోంది. అమెరికా–ఇరాన్ మధ్య పరస్పర దాడులు జరిగాయి. ఈ సందర్భంగాఇరాన్ జలాల్లో లంగరు వేసి ఉన్న మూడు నౌకలపై అమెరికా దాడులు చేయగా,ఆరు నౌకలపై ఇరాన్ సైన్యాలు ప్రతీకార దాడులు చేశాయి.ఒమన్ గల్ఫ్ ప్రాంతంలో ఒక చమురు నౌకను పూర్తిగా ధ్వంసం చేశామని, మరో రెండు నౌకలను శాశ్వతంగా కదలకుండా చేశామని అమెరికా సైనికదళం సెంట్‌కామ్ వర్గాలు ప్రకటించాయి. దీంతో రగిలిపోయిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ సైన్యాలు హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ నిర్దేశించని అనధికార మార్గంలో ప్రయాణం చేసి వెళుతున్న మూడు నౌకలపై ప్రతీకార దాడులు చేశాయి. అమెరికాకు అనుబంధంగా ఉన్న మరో మూడు నౌకలపై కూడా దాడులు చేశాయి. అమెరికా యుద్ధ విమాన వాహకనౌకపైన,నౌకా విధ్వంసక వ్యవస్థపైనా ఆదివారం అనేక క్షిపణులతో దాడులు చేసినట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది. ఈ దాడులను రెండు దేశాలకు చెందిన మీడియా బృందాలు ధృవీకరించాయి. ఆరునెలలుగా కొనసాగుతున్న యుద్ధంలో ఎంతమాత్రం పురోగతి లేదని, ఇది చాలా చిన్న విషయమని ట్రంప్ చెప్పిన ఒక రోజు తర్వాత ఇరు దేశాల సైన్యాలు పరస్పర దాడులు చేసుకున్నాయి. ఇరాన్‌పై చాలా తీవ్రస్థాయిలో దాడులు చేసినట్లు గడచిన మంగళవారం ట్రంప్ ప్రకటించారు. తిరిగి మొదలైన యుద్ధం ఎక్కువ కాలం కొనసాగదన్నారు. ఐతే ఈ దాడులతో ఇరాన్ ఆగ్రహించి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్,బహ్రైన్,కువైట్,జోర్డాన్ సహా ఆ ప్రాంతంలో అమెరికా తరువాయి 12లో


# అనుకరణలో పుట్టే సాహిత్య సృజనాత్మకత 'పేరడీ'

సాహిత్యంలో ప్రతి ప్రక్రియకు తనదైన స్వరూపం ఉంటుంది. కొన్ని ప్రక్రియలు జీవితాన్ని యథాతథంగా చిత్రిస్తే, మరికొన్ని సమాజాన్ని ప్రశ్నిస్తాయి. ఇంకొన్ని నవ్వుల వెనుక గంభీరమైన విమర్శను దాచుకుంటాయి. అలాంటి విశిష్ట ప్రక్రియల్లో పేరడీ ఒకటి. సాధారణంగా పేరడీ అంటే హాస్యం కోసం చేసిన అనుకరణ అనే అభిప్రాయం ఉంది. కానీ సాహిత్య దృష్టిలో పేరడీ అంతకంటే విస్తృతమైన భావన. అది ఒక రచయిత శైలిని, ఒక ప్రసిద్ధ రచనను లేదా ఒక సాహిత్య ప్రక్రియను అనుకరిస్తూ, అందులోని లక్షణాలను ఉద్దేశపూర్వకంగా అతిశయోక్తితో చూపించే సృజనాత్మక ప్రక్రియ. ఆ అతిశయోక్తి పాఠకుడిలో నవ్వును పుట్టించడమే కాదు, అసలు రచనను కొత్త కోణంలో ఆలోచించేలా చేస్తుంది. పేరడీ విజయవంతం కావాలంటే రచయితకు మూల రచనపై లోతైన అవగాహన అవసరం. ఒక రచనలోని భాష, శైలి, వాక్య నిర్మాణం, పాత్రల స్వభావం, కథన పద్ధతి, భావ వ్యక్తీకరణ వంటి అంశాలను క్షుణ్ణంగా గ్రహించినప్పుడే వాటిని కళాత్మకంగా పునర్నిర్మించడం సాధ్యమవుతుంది. అందుకే పేరడీని కేవలం హాస్య రచనగా కాకుండా, విమర్శనాత్మక పునఃసృష్టిగా కూడా పరిగణిస్తారు. మంచి పేరడీ మూల రచనను తక్కువ చేయదు. అందుకు భిన్నంగా, దాని ప్రత్యేకతను మరింత స్పష్టంగా కనిపించేలా చేస్తుంది. పేరడీలో అనుకరణ ప్రధాన లక్షణం. అయితే అది యాంత్రికమైన అనుకరణ కాదు. అసలు రచనలోని శైలి, పదప్రయోగం, లయ, కథన నిర్మాణం వంటి లక్షణాలను నిలుపుకుంటూనే వాటిని కొద్దిగా విస్తరించి, కొన్నిసార్లు అతిశయోక్తిగా మలుస్తుంది. ఈ అతిశయోక్తే పేరడీకి హాస్యాన్ని అందిస్తుంది. ఒక రచయిత తరచూ ఉపయోగించే అలంకారాలు, భావోద్వేగాల తీవ్రత, లేదా ఒక ప్రక్రియలో పదేపదే కనిపించే మూసలను విస్తరించి చూపించడం ద్వారా పేరడీ తన లక్ష్యాన్ని సాధిస్తుంది. అయితే పేరడీ లక్ష్యం ఎప్పుడూ ఎగతాళి చేయడమే కాదని గుర్తించాలి. ఎందుకుంటే, అది కొన్నిసార్లు గౌరవప్రదమైన నివాళిగా కూడా నిలుస్తుంది. ఒక గొప్ప రచయిత ప్రభావం ఎంత బలంగా ఉందో తెలియజేయడానికి కూడా పేరడీ ఉపయోగపడుతుంది. అదే సమయంలో ఏదైనా సాహిత్య ప్రక్రియలో ఏర్పడిన అతిశయాలు, కృత్రిమత, పునరుక్తి, మూస ధోరణులను వెలుగులోకి తీసుకురావడానికి కూడా ఇది సమర్థమైన సాధనంగా పనిచేస్తుంది. అందువల్ల పేరడీని సాహిత్య విమర్శకు, సృజనాత్మకతకు మధ్య నిలిచే ప్రక్రియగా చెప్పవచ్చు. ప్రపంచ సాహిత్యంలో పేరడీకి చిరస్థాయి గుర్తింపు తెచ్చిన రచనల్లో జేన్ ఆస్టిన్ రాసిన 'నార్తేంగర్ ఎబ్బే' ఒకటి. ఆ కాలంలో విపరీత ఆదరణ పొందిన గోతిక్ నవలల్లో కనిపించే రహస్యాలు, భయానక వాతావరణం, అసంభవ సంఘటనలు, అతిగా నాటకీయతను ఆమె చమత్కారంగా పునర్నిర్మించింది. గోతిక్ సంప్రదాయాన్ని పూర్తిగా తిరస్కరించకుండా, అందులోని అతిశయాలను హాస్యంతో చూపించడం ద్వారా ఆ ప్రక్రియపై విమర్శనాత్మక దృష్టిని ఏర్పరిచింది. అలెగ్జాండర్ పోప్ రచించిన 'ది రేప్ ఆఫ్ ది లాక్' మరో విశిష్ట ఉదాహరణ. మహాకావ్యాలకు ఉండే గంభీరమైన శైలిని ఉపయోగించి, ఒక యువతి జుట్టు ముడిని కత్తిరించిన చిన్న సంఘటనను ఆయన అత్యంత వైభవంగా వర్ణించాడు. తుచ్ఛమైన సంఘటనను మహాకావ్య స్థాయికి తీసుకెళ్లడం ద్వారా సమాజంలోని కృత్రిమ గౌరవ భావనలను, ఉన్నత వర్గాల అలవాట్లను వ్యంగ్యంగా చిత్రించాడు. ఈ రచన పేరడీతో పాటు వ్యంగ్య రచనకు కూడా ఆదర్శంగా నిలిచింది. పేరడీని వ్యంగ్యంతో సమానంగా చూడడం సరైంది కాదు. వ్యంగ్యం ప్రధానంగా సమాజాన్ని, వ్యక్తులను లేదా ఆలోచనలను విమర్శిస్తుంది. పేరడీ మాత్రం ముందుగా ఒక నిర్దిష్ట రచన, రచయిత లేదా సాహిత్య శైలిని అనుకరిస్తుంది. ఆ అనుకరణలోనే హాస్యం, విమర్శ, ప్రశంస అనే మూడు అంశాలు సందర్భానుసారం కలిసిపోతాయి. అందువల్ల ప్రతి పేరడీలో వ్యంగ్య లక్షణాలు ఉండవచ్చు గానీ, ప్రతి వ్యంగ్య రచన పేరడీ కాదు. సాధారణంగా, సాహిత్యం నిరంతరం తనను తాను పరిశీలించుకుంటూ ముందుకు సాగుతుంది. ఆ ఆత్మపరిశీలనకు పేరడీ ఒక సమర్థమైన సాధనం. ఒక ప్రక్రియ తన పరిమితులను దాటినప్పుడు, ఒక శైలి మూసగా మారినప్పుడు, ఒక రచయిత ప్రభావం అతిగా పెరిగినప్పుడు పేరడీ వాటిని సున్నితమైన హాస్యంతో ప్రశ్నిస్తుంది. అదే సమయంలో గొప్ప రచనల ప్రత్యేకతను కొత్త తరాలకు పరిచయం చేసే వంతెనగానూ నిలుస్తుంది. అందుకే పేరడీని కేవలం నవ్వించే ప్రక్రియగా చూడలేం. అది పాఠకుడి సాహిత్య అవగాహనను పరీక్షించే ప్రక్రియ. మూల రచన తెలిసిన వారికే పేరడీలోని చమత్కారం పూర్తిగా అర్థమవుతుంది. అనుకరణను కళగా, హాస్యాన్ని విమర్శగా, విమర్శను సృజనాత్మకతగా మలిచే సాహిత్య ప్రక్రియగా పేరడీ నేటికీ తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకుంది.

### పేరడీ అవసరం ఏమిటి?

సాధారణంగా ఒక గంభీరమైన విషయాన్ని కూడా వ్యంగ్యంగా, హాస్యాత్మకంగా చెప్పడానికి 'పేరడీ'ని ఆశ్రయిస్తారు. అయితే, కొన్నిసార్లు ఒక రచయిత తన అభిప్రాయాలను నేరుగా వ్యక్తం చేస్తే తీవ్ర విమర్శలు లేదా దూషణలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అలాంటి సందర్భాల్లో పేరడీ ఒక సమర్థమైన సాహిత్య సాధనంగా మారుతుంది. ప్రత్యక్ష విమర్శకు బదులుగా హాస్యం, చమత్కారం, అనుకరణ ద్వారా తన భావాన్ని వ్యక్తీకరించే అవకాశం పేరడీ కల్పిస్తుంది. దీనివల్ల విమర్శ మరింత సున్నితంగా, కళాత్మకంగా పాఠకుడికి చేరుతుంది. పేరడీ ఎప్పుడూ అవమానపరచడానికి మాత్రమే ఉద్దేశించిన ప్రక్రియ కాదు. చాలాసార్లు అది మూల రచయిత పట్ల ఉన్న అభిమానానికి, గౌరవానికి కూడా సంకేతంగా ఉంటుంది. ఒక రచయిత శైలిని సమర్థంగా అనుకరించాలంటే ఆ రచనలపై లోతైన అవగాహన అవసరం. అందువల్ల మంచి పేరడీ వెనుక విమర్శతో పాటు ప్రశంస కూడా అంతర్లీనంగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో మహాకవుల రచనా శైలిని పైపైగా అనుకరిస్తూ వారి గొప్పతనాన్ని అర్థం చేసుకోలేని రచయితలను ఎద్దేవా చేయడానికి పేరడీని ఉపయోగిస్తారు. అలాగే కాలానుగుణత కోల్పోయిన సాహిత్య సంప్రదాయాలను ప్రశ్నించడానికి, పాత మూసలను విమర్శించడానికి కూడా ఇది సమర్థమైన ఆయుధంగా పనిచేస్తుంది. మరికొన్ని సందర్భాల్లో ఒక ప్రసిద్ధ రచయిత శైలిని ఆశ్రయించి, అసలు లక్ష్యంగా మరో వ్యక్తిని, ఆలోచనను లేదా సామాజిక పరిస్థితిని వ్యంగ్యంగా చిత్రించడానికి కూడా పేరడీని ఉపయోగిస్తారు. కాబట్టి పేరడీకి మూడు రకాల లక్ష్యాలు ఉంటాయని అనుకోవచ్చు. అంటే, అది మూల రచయితను విమర్శించవచ్చు, మూల రచనను విశ్లేషించవచ్చు లేదా ఆ రచన శైలిని మాధ్యమంగా చేసుకొని పూర్తిగా వేరే అంశాన్ని వ్యంగ్యంగా చిత్రించవచ్చు. పేరడీకి మరో ముఖ్యమైన ప్రయోజనం హాస్యమని ముందుగానే చెప్పుకున్నాం. హాస్యం మనసును తేలికపరుస్తుంది, ఒత్తిడిని తగ్గిస్తుంది, ఆలోచనకు దారితీస్తుంది. పేరడీ ఈ లక్షణాలన్నింటినీ కలగలిపి పాఠకుడికి వినోదంతో పాటు విమర్శనాత్మక దృష్టిని కూడా అందిస్తుంది. నవ్విస్తూ ఆలోచింపజేయడం, చమత్కారం ద్వారా సాహిత్యాన్ని కొత్త కోణంలో చూడేలా చేయడం పేరడీ ప్రక్రియ విశిష్టత. కూచిమంచి జగ్గకవి రచించిన 'చంద్రరేఖా విలాపం' వెనుక వ్యక్తిగత అసంతృప్తి ప్రధాన కారణంగా కనిపిస్తే, కందుకూరి వీరేశలింగం రచించిన 'అభాగ్యోపాఖ్యానం' పూర్తిగా సాహిత్య సంస్కరణ లక్ష్యంతో రూపుదిద్దుకుంది. రచన వెనుక ఉన్న ఉద్దేశాన్ని స్వయంగా కందుకూరి వివరించాడు. తెలుగు ప్రబంధ సాహిత్యం ఒకే తరహా శృంగార వర్ణనలతో నిండిపోయి, వైవిధ్యాన్ని కోల్పోయిందని ఆయన భావించాడు. అలాంటి ప్రబంధాలు సాహిత్యానికి మేలు కంటే కీడే ఎక్కువ చేస్తున్నాయనే అభిప్రాయానికి వచ్చిన తరువాత, ఆ ధోరణిని పరిహసించి సంస్కరించాలనే లక్ష్యంతో ఈ రచనను రూపొందించాడు. అందువల్ల ఇది వ్యక్తిగత దూషణ కోసం రాసిన రచన కాదని, సాహిత్య సంస్కరణ కోసం చేసిన సృజనాత్మక ప్రయత్నమని అర్థం చేసుకోవాలి. ఇక కూచిమంచి జగ్గకవి రచనల్లో కనిపించే వ్యక్తిగత ఆగ్రహం, పరుష వ్యాఖ్యలు వీరేశలింగం రచనలో ఉండవు. ఆయన విమర్శ వ్యక్తులపై కాదు, కాలం చెల్లిన సాహిత్య ధోరణులపై. వ్యాసం రాసి విమర్శించడానికి బదులుగా, ప్రబంధాల్లోని మూస పద్ధతులను అతిశయోక్తితో చిత్రించి, వాటి బలహీనతలను పాఠకుడి ముందుంచాడు. ఈ విధంగా పేరడీని సాహిత్య విమర్శకు సమర్థమైన సాధనంగా ఉపయోగించాడు. 'అభాగ్యోపాఖ్యానం'లో కథా నిర్మాణం, పద్యశైలి, వర్ణనలు, ఉపమానాలు అన్నీ అప్పటి ప్రబంధాల లక్షణాలను ఉద్దేశపూర్వకంగా అనుకరిస్తాయి. 'విజయవిలాసం', 'మనుచరిత్ర' వంటి ప్రసిద్ధ ప్రబంధాల శైలిని ప్రతిబింబించే అనేక సందర్భాలు ఇందులో కనిపిస్తాయి. అభాగ్యుడు అనే రాక్షసుడి కథ, అతని ప్రేమ, అన్వేషణ, చివరికి ఎదురయ్యే హాస్యాస్పద పరిణామాలు పాఠకుడికి నవ్వు పుట్టిస్తూనే, ప్రబంధ సాహిత్యంలో పేరుకుపోయిన కృత్రిమతను కూడా బహిర్గతం చేస్తాయి. ఈ కారణంగానే 'అభాగ్యోపాఖ్యానం' తెలుగు సాహిత్యంలో పేరడీకి ఒక ప్రామాణిక రచనగా గుర్తింపు పొందింది.

**విశ్వమిత్ర**




పేరడీ అనేది రూప పరంగా మాత్రమే కాకుండా, దాని అంతర్గత స్వభావం, లక్ష్యాల పరంగా కూడా సంక్లిష్టమైన సాహిత్య ప్రక్రియ. పేరడీకి ఇతర సాహిత్య ప్రక్రియలతో ఉన్న సంబంధాన్ని పరిశీలించడం ఈ సందర్భంలో ఎంతో అవసరం. పాస్టీష్, బర్లెస్క్, ట్రావెస్టీ, మాక్‌హీరోయిక్, సెటైర్, కారికేచర్, ఐరనీ, మిమిక్రీ వంటి ప్రక్రియలకు పేరడీతో దగ్గరి పోలికలు ఉన్నాయి. వీటిలో బర్లెస్క్, ట్రావెస్టీ అనే పదాలను ఆంగ్ల సాహిత్యంలో కొన్ని సందర్భాల్లో పేరడీకి సమానార్థకాలుగా కూడా ఉపయోగించిన ఉదాహరణలు కనిపిస్తాయి. సాహిత్యంలో పేరడీ, బర్లెస్క్, ట్రావెస్టీ వంటి ప్రక్రియలను చర్చించేటప్పుడు వాటి పేర్ల విషయంలో చాలా కఠినమైన విభజనలు చేయడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. ఎందుకంటే ఈ మూడు ప్రక్రియలూ అసంగతమైన అనుకరణను, తీవ్రమైన లేదా గంభీరమైన విషయాలను ఉద్దేశపూర్వకంగా తక్కువ స్థాయిలో చూపించే పద్ధతిని ఉపయోగిస్తాయి. వీటి ప్రధాన ఉద్దేశం వ్యంగ్య ప్రభావాన్ని సృష్టించడం. ఒక ఉన్నతమైన, గంభీరమైన అంశాన్ని సాధారణమైన లేదా తక్కువ స్థాయి శైలిలో వ్యక్తీకరిస్తే అది బర్లెస్క్‌గా మారుతుంది. దీనికి విరుద్ధంగా, సామాన్యమైన లేదా తక్కువ స్థాయి విషయాన్ని గొప్పదైన, గంభీరమైన శైలిలో చిత్రిస్తే అది మాక్‌హీరోయిక్ అవుతుంది. తెలుగు సాహిత్యంలో దీనికి వ్యాజస్తుతి అలంకారంతో కొంత పోలిక కనిపిస్తుంది. పాస్టీష్, బర్లెస్క్, ట్రావెస్టీ, ఐరనీ వంటి ప్రక్రియలు తెలుగులో ప్రత్యేక సాహిత్య రూపాలుగా పెద్దగా స్థిరపడలేదు. సెటైర్ మాత్రం తెలుగు సాహిత్యంలో కొంత ప్రాచుర్యం పొందింది. కారికేచర్ చిత్రకళలో కార్టూన్ రూపంలో, మిమిక్రీ ధ్వన్యనుకరణ కళారూపంగా తెలుగు సమాజంలో స్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నాయి.

### గ్రీకు మూలాలు!

సాధారణంగా 'పేరడీ'ని తెలుగు పదంగానే భావిస్తాం. కానీ, ఈ పదానికి మూలాలు ప్రాచీన గ్రీకు భాషలో ఉన్నాయి. అందులోని 'పరోయిడియా' ఈ పదానికి మూలం. దీనికి ఒక పాటను లేదా కవితను అనుకరిస్తూ, దానికి భిన్నమైన హాస్యాత్మక లేదా వ్యంగ్యాత్మక రూపాన్ని ఇవ్వడం అనే అర్థం ఉంది. ఈ పదం రెండు గ్రీకు పదాల కలయికతో ఏర్పడింది. 'పారా' అంటే 'పక్కన', 'సమాంతరంగా' లేదా 'ఎదురుగా' అని అర్థం. 'ఓయిడే' అంటే 'పాట', 'గీతం' లేదా 'ఓడ్'. ఈ రెండింటి కలయికగా పేరడీకి 'మూల రచనతో సమాంతరంగా సాగుతూ, దానిని కొత్త మలుపుతో అనుకరించే గీతం లేదా రచన' అనే భావం ఏర్పడింది. ప్రాచీన గ్రీసులో పేరడీని మొదట గంభీరమైన మహాకావ్యాలను అనుకరిస్తూ, వాటి శైలిలోనే హాస్యభరితమైన లేదా సాధారణ విషయాలను చెప్పే కవితల కోసం ఉపయోగించారు. తాత్వికుడు అరిస్టాటిల్ ప్రస్తావనలో క్రీ.పూ. ఐదో శతాబ్దానికి చెందిన రచయిత హెగెమోన్ ఆఫ్ థాసోస్ ఈ ప్రక్రియకు తొలి రూపకర్తల్లో ఒకరిగా గుర్తింపు పొందాడు. ఆయన ప్రసిద్ధ కవితల పదాలను మార్చి, గంభీరమైన విషయాలను హాస్యాస్పదంగా మార్చే రచనలు చేశాడు. తరువాత ఈ పదం లాటిన్ భాషలో 'పరోడియా'గా ప్రవేశించింది. అక్కడి నుంచి యూరోపియన్ భాషలకు వ్యాపించి, పదహారో శతాబ్దం చివరినాటికి ఆంగ్ల భాషలో స్థిరపడింది. ముఖ్యంగా ఆంగ్ల నాటకకర్త బెన్ జాన్సన్ కాలంలో ఈ పదానికి విస్తృత ప్రాచుర్యం లభించింది. నేడు పేరడీ సాహిత్యం, సంగీతం, నాటకం, సినిమా వంటి అనేక కళారూపాల్లో ఒక సృజనాత్మక ప్రక్రియగా గుర్తింపు పొందింది.

# పేరడీకి చిరునామా జరుక్ శాస్త్రి

**నేడు జరుక్ శాస్త్రి జయంతి**

పేరడీ అనే ప్రత్యేక హాస్య ప్రక్రియకు తెలుగులో పునాదులు వేసిన రచయిగా జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి (జరుక్ శాస్త్రి) పేరును ప్రస్తావించుకోవాలి. మొక్కపాటి నరసింహశాస్త్రి, చిలకమర్తి లక్ష్మీనరసింహం, పానుగంటి లక్ష్మీనరసింహారావు, భమిడిపాటి కామేశ్వరరావు వంటి రచయితలు తెలుగు సాహిత్యంలో హాస్యానికి ప్రత్యేక స్థానం కల్పించారు. సున్నితమైన హాస్యంతో పాఠకులను ఆకట్టుకున్నారు. అయితే, జరుక్ శాస్త్రి మాత్రం హాస్యాన్ని, వ్యంగ్యాన్ని పేరడీ రూపంలో అందించి, తన ప్రత్యేకతను చాటుకున్నాడు. వాస్తవానికి పేరడీ రాయడం అంత సులభమైన ప్రక్రియ కాదు. ఒక గొప్ప రచనలోని ప్రత్యేక లక్షణాన్ని గుర్తించి, దానిలోని అతిశయాన్ని సున్నితంగా ఎత్తిచూపుతూ, అసలు రచనను గుర్తు చేసే విధంగా హాస్యాన్ని పండించాలి. మూల రచనను అవమానపరచకుండా, దానిలోని ఒక కోణాన్ని వినోదాత్మకంగా చూపించాలి. ఈ నైపుణ్యంలో జరుక్ శాస్త్రి అసాధారణ ప్రతిభను ప్రదర్శించాడు. అందుకే తెలుగు పేరడీ సాహిత్యానికి ఆయనను ఆద్యుడిగా భావిస్తారు. మహాకవి శ్రీశ్రీ రచించిన 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనవుతాను' అనే ప్రసిద్ధ కవితను అనుకరిస్తూ, 'నేను సైతం కిళ్ళీకొట్లో పాతబాకీ లెగర గొట్టాను' వంటి పంక్తులతో సామాజిక వాస్తవాలను వినోదాత్మకంగా ప్రతిబింబించిన పేరడీ ఆయన ప్రతిభకు తార్కాణం. 1914 సెప్టెంబర్ 7న బందరులో జన్మించిన జరుక్ శాస్త్రి సంస్కృతం, తెలుగు భాషల్లో ప్రావీణ్యం సంపాదించాడు. కొంతకాలం ఆంధ్రపత్రిక ఉప సంపాదకుడిగా పనిచేశాడు. మద్రాసు, విజయవాడ ఆకాశవాణి కేంద్రాల్లో స్క్రిప్ట్ రచయితగా సేవలందించాడు. నవ్యాంధ్ర సాహిత్యోద్యమంలోనూ ఆయన కీలక పాత్ర పోషించాడు. తనలో తాను వంటి శీర్షికల ద్వారా తన ప్రత్యేక రచనా శైలిని పరిచయం చేశాడు. 'జరుక్ శాస్త్రి పేరడీలు', 'శరత్ పూర్ణిమ' వంటి సంకలనాలు ఆయన సాహిత్య ప్రతిభకు నిదర్శనాలు. అనేక పత్రికల్లో వ్యాసాలు రాసిన ఆయన, తన చమత్కార రచనలతో తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయాడు. 1968లో ఆయన కన్నుమూసినా, పేరడీ సాహిత్యంలో ఆయన వేసిన ముద్ర ఇప్పటికీ చెరిగిపోలేదు. తెలుగు సాహిత్యంలో పేరడీని ఒక స్వతంత్ర సాహిత్య ప్రక్రియగా స్థిరపరిచిన ప్రముఖుల్లో జరుక్ శాస్త్రి తర్వాత అంతటి పేరు సంపాదించుకున్న రచయిత మాచిరాజు దేవీప్రసాద్. ఆయన కేవలం పేరడీ కవితలకు మాత్రమే పరిమితం కాలేదు. గద్యరచనల్లోనూ ఈ ప్రక్రియకు విశిష్ట స్థానం కల్పించాడు.








శ్రీశ్రీ, వేదుల సత్యనారాయణ, విశ్వనాథ సత్యనారాయణ, శివశంకరశాస్త్రి, నాయని సుబ్బారావు వంటి ప్రముఖ రచయితల శైలులను దేవీప్రసాద్ అనుకరిస్తూ, వాటిలోని ప్రత్యేక లక్షణాలను చమత్కారంగా మలిచాడు. కార్యాలయ లేఖలు, పాఠకుల ఉత్తరాలు, అధికార భాష వంటి అంశాలపై కూడా పేరడీలు రచించి గద్య పేరడీకి కొత్త దిశ చూపించాడు. 1922లో జన్మించిన దేవీప్రసాద్ జీవితాన్ని కూడా హాస్య దృష్టితోనే చూశాడు. సాహిత్యంలో పేరుకుపోయిన మూస ధోరణులు, అతిశయ భావుకత, కృత్రిమ భాష, ప్రభుత్వ వ్యవస్థలోని లోపాలు ఆయన పేరడీల ప్రధాన లక్ష్యాలయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసిన రోజుల్లో అధికార వ్యవస్థలోని అవకతవకలను రచనల ద్వారా ఎండగట్టడంతో ఇబ్బందులు కూడా ఎదుర్కొన్నాడు. అయినప్పటికీ తన విమర్శనాత్మక దృష్టిని వదల్లేదు. ఆయన ప్రతిభకు చక్కని ఉదాహరణ 'భోజనశాల' అనే పేరడీ. ఇది వేదుల సత్యనారాయణ ప్రసిద్ధ గేయం 'రాధ'కు పేరడీ. మూల రచనలో శ్రీకృష్ణుడి కోసం విరహంతో వెదికే రాధ కనిపిస్తే, దేవీప్రసాద్ పేరడీలో ఆకలితో భోజనశాల కోసం వెదికే భోజనప్రియుడు కనిపిస్తాడు. మూల పద్యంలోని తొలి రెండు పాదాలను యథాతథంగా ఉంచి, తరువాతి పాదాల్లో చిన్న మార్పులతో పూర్తిగా భిన్నమైన హాస్యానుభూతిని సృష్టించాడు. ఈ విధానమే ఆంగ్ల సాహిత్యంలో 'వెర్బల్ పేరడీ'గా స్థిరపడింది. వేణుగాన మాధుర్యాన్ని వర్ణించిన మూల పద్యాన్ని, బుచ్చెమ్మ భోజనశాలలోని పచ్చిపులుసు రుచిని కీర్తించేలా మలచడం దేవీప్రసాద్ చమత్కారానికి నిదర్శనం. యమునా ప్రవాహం స్థానంలో నోరూరడం, ప్రేమ పరవశం స్థానంలో భోజనోత్సాహం వంటి మార్పులు పాఠకుడికి సహజమైన నవ్వును పంచుతాయి. మూల కవిత్వంలోని లయ, భాష, భావవ్యక్తీకరణను కాపాడుతూ, వస్తువును మాత్రమే మార్చి కొత్త అర్థాన్ని సృష్టించడం దేవీప్రసాద్ పేరడీల విశిష్టత. అందుకే తెలుగు సాహిత్యంలో కళాత్మకమైన పేరడీకి ఆయన రచనలు ఆదర్శంగా నిలిచాయి.

## చదవాల్సిన పుస్తకం

### చరిత్ర గమనాన్ని నిగ్గుతేల్చిన డాంగే

భారత దేశ చరిత్రను ఆదిమ కమ్యూనిజం నుంచి బానిస సమాజం వరకూ వివరించిన ఒక చారిత్రక, విశ్లేషణాత్మక పుస్తకం 'ఇండియా: ఫ్రమ్ ప్రిమిటివ్ కమ్యూనిజం టు స్లేవరీ'. శ్రీపాద అమృత డాంగే రచించిన ఈ పుస్తకాన్ని 'ఆదిమ కమ్యూనిజం నుండి బానిస సమాజము వరకు భారత దేశం... ప్రాచీన చరిత్రపై ఒక మార్క్సిస్టు పరిశీలన' అనే పేరుతో పులుపుల వెంకటశివయ్య తెలుగులోకి అనువదించారు. భారతీయ చరిత్రను మార్క్సిస్టు చారిత్రక భౌతికవాద దృక్పథంతో అర్థం చేసుకునే తొలి ప్రయత్నాలలో దీనిని ఒకటిగా పేర్కోవాలి. దీనిని






చరిత్రకు మాత్రమే పరిమితైన పుస్తకంలా కాకుండా, భారతీయ సమాజ పరిణామాన్ని వర్గపోరాటం, ఉత్పత్తి సంబంధాలు, ఆస్తి యాజమాన్యం వంటి అంశాల ఆధారంగా పునర్నిర్వచించాలన్న ఒక సిద్ధాంత గ్రంథంగా చూడాలి. తర్వాతి కాలంలో డిడి కోశాంబి, రొమిలా థాపర్, ఆర్ ఎస్ శర్మ వంటి చరిత్రకారులు మరింత ఆధారపూర్వక పరిశోధనలు చేసినప్పటికీ, డాంగే గ్రంథం భారతీయ మార్క్సిస్టు చరిత్ర రచనలో ఒక మైలురాయిగా మిగిలింది. భార త చరిత్రను పురాణాలు, రాజవంశాలు, మత విశ్వాసాల చట్రంలో కాకుం డా ఉత్పత్తి విధానాలు, ఆర్థిక సంబంధాలు, వర్గపోరాటాల దృష్టితో చూడాలంటే 'ఇండియా: ఫ్రమ్ ప్రిమిటివ్ కమ్యూనిజం టు స్లేవరీ' ప్రస్తావన తప్పకుండా వస్తుంది. భారత కమ్యూనిస్టు ఉద్యమానికి ప్రముఖ నాయకుడైన డాంగే, ఈ పుస్తకంలో కార్ల్ మార్క్స్, ఎంగెల్స్ ప్రతిపాదించిన చారిత్రక భౌతికవాదాన్ని భారతీయ సమాజానికి అన్వయించే ప్రయత్నం చేశారు. 1949లో వెలువడిన ఈ రచన, భారతదేశంలో మార్క్సిస్టు చరిత్ర రచనకు తొలి సమగ్ర రూపురేఖలను అందించింది. డాంగే ప్రధానంగా వేదాలు, బ్రాహ్మణ్యాలు, స్మృతులు, మహాభారతం, రామాయణం వంటి ప్రాచీన సాహిత్యాన్ని ఆధారంగా తీసుకుని భారత సమాజ పరిణామాన్ని విశ్లేషించారు. ఆయన దృష్టిలో ఆదిమ గిరిజన సమాజం వ్యక్తిగత ఆస్తి భావన లేని 'ప్రిమిటివ్ కమ్యూనిజం' దశలో జీవించింది. ఉత్పత్తి సాధనాలు అభివృద్ధి చెందడంతో మిగులు సంపద ఏర్పడింది. దాంతో వ్యక్తిగత యాజమాన్యం, సామాజిక అసమానతలు, చివరికి బానిస వ్యవస్థ రూపుదిద్దుకున్నాయని ఆయన వాదిస్తారు. ఈ పరిణామం సహజమైన సామాజికఆర్థిక మార్పుల ఫలితమే తప్ప కేవలం మతం లేదా రాజుల సంకల్పం వల్ల సంభవించలేదని ఆయన స్పష్టం చేస్తారు. మహాభారతంపై చేసిన పునర్వ్యాఖ్యానాన్ని ఈ పుస్తకంలో అత్యంత ఆసక్తికరమైన అంశంగా పేర్కోవాలి. డాంగే దృష్టి లో కురుక్షేత్ర యుద్ధం కేవలం పాండవులు, కౌరవుల మధ్య జరిగిన కు టుంబ కలహం కాదు. అది భూస్వామ్య హక్కులు, సంపద, అధికారాన్ని స్వాధీనం చేసుకోవడానికి పోటీపడిన వర్గాల మధ్య జరిగిన సామాజిక సం ఘర్షణకు ప్రతీక. ఈ వ్యాఖ్యానం సంప్రదాయ పురాణ పఠనానికి పూర్తిగా భిన్నమైనది. ఇదే కారణంగా ఈ గ్రంథం వెలువడినప్పుడు తీవ్రమైన చర్చ కు దారి తీసింది. మరో ముఖ్యమైన అధ్యాయం మాతృస్వామ్యం నుంచి పితృస్వామ్యానికి జరిగిన మార్పు. ఆదిమ తెగలలో స్త్రీకి ఉన్న సామాజిక ప్రా ధాన్యం, ఆస్తి కూడికతో పాటు కుటుంబ నిర్మాణంలో వచ్చిన మార్పుల వల్ల ఎలా క్షీణించిందో డాంగే విశ్లేషిస్తారు. పితృస్వామ్యం ఒక సాంస్కృతి క పరిణామం మాత్రమే కాదని, ఆర్థిక నిర్మాణంలో వచ్చిన మార్పుల ఫలితమని ఆయన అభిప్రాయపడతారు. భారత ప్రాచీన చరిత్రను వర్గ సంబంధాలు, ఉత్పత్తి విధానాలు, సామాజిక పరిణామాల క్రమంలో అర్థం చేసుకోవాలనే చర్చకు డాంగే పుస్తకం బలమైన పునాది వేసింది. తర్వాతి తరాల మార్క్సిస్టు చరిత్రకారులు డాంగే సిద్ధాంతాలను సవరించినా, విభేదిం చి నా, ఆయన లేవనెత్తిన ప్రశ్నలను మాత్రం విస్మరించలేదు. భారత సమాజంలో వర్గం, కులం, అధికారం, ఆస్తి మధ్య ఉన్న సంబంధాలపై జరిగిన అనేక పరిశోధనలకు ఈ గ్రంథం ఒక ఆరంభ బిందువుగా నిలిచింది. నేటి ప్రమాణాల ప్రకారం అన్ని వాదనలూ అంగీకారయోగ్యమైన గ్రంథం కా దు. కానీ భారతీయ చరిత్రను పురాణాల గౌరవభావంతో కాకుండా విమర్శనాత్మకంగా, సామాజిక శాస్త్ర దృష్టితో చదవాలని పాఠకుడిని ప్రేరేపించే అరుదైన రచన. అందువల్ల ఇది తుది సమాధానాలను ఇచ్చే పుస్తకం కంటే, కొత్త ప్రశ్నలను అడగడం నేర్పించే పుస్తకంగా ఎక్కువ విలువను సంపాదించింది.

**పుస్తకం పేరు**

ఆదిమ కమ్యూనిజం నుండి బానిస సమాజము వరకు భారత దేశం... ప్రాచీన చరిత్రపై ఒక మార్క్సిస్టు పరిశీలన

రచన : శ్రీపాద అమృత్ డాంగే
అనువాదం: పులుపుల వెంకటశివయ్య
వెల : రూ. 150.

**ప్రతులకు**

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

**ఈ వారం కవితలు**

## చైతన్య జ్వలిత

సమాజ కాన్వాస్‌పై భావాల ఉలితో చెక్కిన అందమైన
సరంగుల అక్షర చిత్రం
ప్రకృతి సమన్వయం ప్రగతి సృజనాత్మకం
అందుకే అది జనాత్మకం.. సజీవ కళాత్మకం..

రుతువుల క్రతువులో శిశిరం రాల్చిన శబ్దం
వసంతం సీమంతంలో వికసించిన పుష్పం
ఉషస్సు విరబూసిన కాంతుల సెలయేరు
సముద్రం లోతులలో ఉప్పొంగిన అలలు..

వర్షం ముద్దాడి పులకించిన నేల
అనుభవ సారం అంకురించిన విత్తనం
పైనబడే పులులను ప్రతిఘటించే లేళ్లు
సంధించిన స్వరాలు సంఘటిత భాస్వరాలు..

నిశీధి పోరులో నిగ్గుదేలిన ఉదయం
వేకువ విజయమై వికసించిన కిరణ
సంక్షోభ జఢత్వాల్లో చలించే జవసత్వాలు
నాగరికత శిథిలాల్లో నవీన ఆవిష్కరణలు..
కులాల నిచ్చెన మెట్లపై కూలని నీడలు
వరుసక్రమాల వేధన జాడలు
అడుగులు వేసినా అందని ఉట్లు
వైకుంఠపాళిలోని పాముల కాటు..
తల్లి స్తైన్యం అందని శిషువుల ఏడుపులు
చెరబట్టి దోచుకునే గద్దల కడుపులు
పంజరంలో పక్షి బయోనేట్ల మోతలు
రగిలే రణతంత్రాలు రక్తమోడే స్వేచ్ఛలు..

సత్యాలు నిత్యాలు సహజత్వ రాగాలు
చీకటికోణంలో దాగిన కారణ తత్వాలు
అన్నీ అక్షరాలుగా చెక్కిన అందమైన చిత్రం
అది భాష చెరగనిది భావం తరగనిది..
అందుకే అది నిద్రలేపే కవితనిత్య చైతన్య జ్వలిత
సకల జనాత్మకం.. సజీవ కళాత్మకం...

**– వేల్పుల నారాయణ, 9440433475**

## జలఖడ్గం

హిమానీ నదుల వలయం
వరద బురదల విలయం
యల్‌నినో గారి ప్రభావం
ప్రకృతి వికృత స్వరూపం

నేపాల్ అయోమయం
జన విలాపాల నిలయం
విగత జీవులతో కలకలం
కలుషిత గాలులే ప్రళయం

గ్రామ రూపు రేఖలు మటు మాయం
ప్రజలు ప్రవాహంలో కనుమరుగవడం
పెను విపత్తుల రుద్ర ప్రాంగణం
గృహాలను కబళించిన జలఖడ్గం

ఆచూకీ లేని పౌరులదృశ్యం
నోరుంది మాట పెగలక విషాద భరితం
సహాయ సేవకుల కన్నీటి వదనం



క ని విని ఎరుగని మరణ మృదంగం

మనుగడ సాగడమిక అబద్ధం
తోడు నీడలు కరువై కుమలడం
గుండెను బండగా మార్చలేం
నిండుగా జగతిలో బతకలేం

**నమిలకొండ నాగేశ్వర్ రావు**
**8688553470**

## జెల్ల పురుగు

జెల్ల పురుగు బొద్దింక, కాక్రోచ్
ఎప్పుడు అనుకొని ఉండదు
తన పేరు మార్మోగిపోతుందని
ఊహించి కూడా ఉండదు !

నిశాచర జెల్ల పురుగు
మురికిప్రదేశాలు చీకట్లో మునుగు
అన్నీ తినే సర్వభక్షకం
వ్యాధుల వ్యాప్తి మూలకం!

అది కొందరికి చీదరింపు
మరికొందరికి అసహింపు
ఇంకొందరికి ఒళ్ళు జలదరింపు
కడుగుకుంటే పోతుందా కంపు!

ఒక శోకంలో శ్లోకం పుట్టినట్లు
వెటకారం ను ప్రతీకారం గా
జెల్ల పురుగు సి.జే.పి. గా



నామకరణం చేసుకున్నది !
బారెడు మీసాలతో
భయపెట్టజూస్తున్నది .

అంటించుకున్న మకిలి
వదిలించుకోకుంటే..
ఎగురగలుగుతుందా...
నెగులగలుగుతుందా...!

**పట్లోళ్ల బక్కారెడ్డి**
**9705315250**

# అత్యంత వైభవంగా గోదావరి పుష్కరాలు

మంత్రి జూపల్లి కృష్ణారావు
రూ.20కోట్లతో పుష్కర ఘాట్ల
అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/నిర్మల్ :** తెలంగాణ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా వచ్చే ఏడాది జూన్ 27 నుంచి నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో విస్తృత ఏర్పాట్లు చేపడుతోందని రాష్ట్ర సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పుష్కరాలకు ఏడాది ముందుగానే మౌలిక వసతులు, పుష్కర ఘాట్లు, ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఆదివారం బాసరలో పర్యటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.20కోట్ల వ్యయంతో చేపట్టనున్న పుష్కర ఘాట్ల నిర్మాణం, విస్తరణ, మరమ్మతులు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గోదావరి నదీమాతకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతోపాటు భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తుల సౌకర్యం, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పుష్కర ఘాట్లను అవసరమైన మేరకు విస్తరించడంతో పాటు, కొత్త ఘాట్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టాలని అన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆలయ ఇఒ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గోదావరి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏడాది ముందుగానే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పుష్కరాల కోసం దాదాపు రూ.1,000 కోట్లతో వివిధ అభివృద్ధి, మౌలిక వసతుల పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.

పుష్కరాల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రజాభవన్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి జాప్యం లేకుండా పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. బాసరతో పాటు గోదావరి నదీ తీర జిల్లాల్లోని మొత్తం 12 ప్రాంతాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా బాసర గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, పుష్కర ఘాట్ల అభివృద్ధి, శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన మ్యాపులు, ప్రతిపాదనలు, పనుల పురోగతిని మంత్రి జూపల్లి కృష్ణారావుకు వివరించారు.

నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసి, పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, అదనపు కలెక్టర్ బి.వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఎఎస్పీ సాయికిరణ్, ఆలయ ఇఒ అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో 'సిలికాన్ ఫోటోనిక్స్'కు కొత్త ఊపు

శ్రీధర్‌బాబుతో నీతి ఆయోగ్ సభ్యుడు
వి.కె.సారస్వత్ భేటీ
వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌పై కీలక చర్చ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిలికాన్ ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి భవిష్యత్ సాంకేతిక రంగాల్లో తెలంగాణను దేశంలోనే కీలక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా 'తెలంగాణ సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్'కు దశలవారీ వ్యూహాత్మక రోడ్‌మ్యాప్ రూపొందించడంపై నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్. వి.కె.సారస్వత్, రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మధ్య ఆదివారం కీలక చర్చ జరిగింది. రాష్ట్ర సచివాలయంలో శ్రీధర్‌బాబుతో వి.కె సారస్వత్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఫోటోనిక్స్ వ్యాలీ కార్పొరేషన్ భవిష్యత్ కార్యాచరణతో పాటు 'ఇండియా సెమీకండక్టర్ మిషన్–2.0'తో తెలంగాణ సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్‌ను అనుసంధానించే అవకాశాలపై సమీక్షించారు.

రాష్ట్రంలో పరిశోధన నుంచి వాణిజ్య స్థాయి తయారీ వరకు సమగ్ర సిలికాన్ ఫోటోనిక్స్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడంపై సమావేశంలో ప్రధానంగా దృష్టిసారించారు. డిజైన్, పరిశోధన, తయారీ, ప్యాకేజింగ్, టెస్టింగ్, సరఫరా వ్యవస్థలను పరస్పరం అనుసంధానం చేసి సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరంపై అభిప్రాయాలు పంచుకున్నారు. పరిశోధనా ఫలితాలను వాణిజ్యపరమైన సాంకేతిక పరిష్కారాలు, ఉత్పత్తులుగా మలిచేలా పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై కూడా చర్చించారు.

**అధునాతన టెక్నాలజీకి కేంద్రంగా తెలంగాణ..**

రాబోయే రోజుల్లో అధునాతన ఫోటోనిక్ ప్యాకేజింగ్, కోప్యాకేజ్డ్ ఆప్టిక్స్ వంటి తదుపరి తరం సాంకేతికతలకు తెలంగాణను కీలక కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. నిపుణులు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలతో కలిసి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఇప్పటి నుంచే దృష్టి సారించినట్లు వివరించారు. త్వరలో ఏర్పాటు చేయనున్న 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ క్వాంటం కంప్యూటింగ్'లో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని సారస్వత్‌ను మంత్రి ఆహ్వానించారు. ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్‌పై ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న అడ్వైజరీ కౌన్సిల్‌కు నాయకత్వం వహించాలని కూడా కోరారు. తెలంగాణతో కలిసి ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని వీకే సారస్వత్ తెలిపారు. పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. సమావేశంలో ఐటిఇ అండ్ సి సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, ఫోటోనిక్స్ వ్యాలీ కార్పొరేషన్ సిఇఒ ఎఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్లలో టిపిసిసి అధ్యక్షుడిగా రెండేళ్లు పూర్తిచేసుకున్న మహేష్‌కుమార్ గౌడ్

పార్టీ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ..
ప్రభుత్వం–పార్టీ సమన్వయానికి పెద్దపీట



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో టిపిసిసి అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ రెండేళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్నారు. అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్‌కు రెండేళ్లలో సంస్థాగతంగా కొత్త ఊపునిచ్చే ప్రయత్నంతో ముందుకు సాగుతున్నారు. రాజకీయంగా అనేక సవాళ్లు ఎదురైనప్పటికీ పార్టీని కేవలం ఎన్నికల యంత్రాంగంగా కాకుండా గ్రామస్థాయి నుంచి పటిష్టమైన సంస్థగా తీర్చిదిద్దే దిశగా ఆయన ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. పార్టీ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణతో పాటు ప్రభుత్వం–పార్టీ సమన్వయానికి పెద్దపీట వేశారు. బిసి కులగణన, సామాజిక న్యాయం వంటి అంశాలను పార్టీ అజెండాలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు డిసిసి అధ్యక్షుల నియామకాల్లో సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యం ఇచ్చారు. సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా వికారాబాద్‌లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల డిసిసి అధ్యక్షుల శిక్షణ శిబిరాన్ని భారీ స్థాయిలో నిర్వహించడం సంస్థాగత నిర్మాణంలో కీలక కార్యక్రమంగా నిలిచింది. ఈ శిబిరానికి రాహుల్ గాంధీ, కెసి వేణుగోపాల్ హాజరుకావడం, మహేష్‌కుమార్ గౌడ్ పనితీరును రాహుల్ ప్రశంసించడం పార్టీ వర్గాల్లో అప్పట్లో చర్చనీయాంశమైంది. జిల్లాల్లో డిసిసి అధ్యక్షుల ఆధ్వర్యంలో జరిగే కార్యవర్గ సమావేశాలకు మహేష్‌కుమార్ గౌడ్ స్వయంగా హాజరై నియామక పత్రాలు అందజేయడం ద్వారా రాష్ట్ర–జిల్లా నాయకత్వాల మధ్య ప్రత్యక్ష అనుసంధానానికి ప్రాధాన్యం ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు క్షేత్రస్థాయి సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావడంపై దృష్టి సారించారు. మంత్రులతో ముఖాముఖి కార్యక్రమాలు, పాదయాత్రలు పార్టీకి ప్రజలతో అనుసంధానాన్ని పెంచే ప్రయత్నాలుగా నిలిచాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికలు, స్థానిక సంస్థల్లో సాధించిన ఫలితాలు కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని పెంచాయి. రానున్న రోజుల్లో ఈ ఎన్నికల విజయాలను సంస్థాగత బలంగా మలచడం, గ్రామస్థాయిలో కేడర్‌ను మరింత పటిష్టం చేయడంపై మహేష్‌కుమార్ గౌడ్ ఇప్పటి నుంచే దృష్టి సారించారు.

## కాంగ్రెస్‌లో క్రమశిక్షణ కొరడా..!

ఆరుగురికి షోకాజ్ నోటీసులు..
వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ వ్యవహరించారంటూ వచ్చిన ఫిర్యాదులపై తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ కొరడా ఝుళిపించింది. పార్టీ వ్యవహారాల్లో వివాదాస్పదంగా వ్యవహరించారన్న ఆరోపణలపై ఆరుగురు నాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌కు పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించారన్న ఫిర్యాదుపై నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి మధ్య చోటుచేసుకున్న వివాదానికి సంబంధించి సంజీవరెడ్డికి కూడా షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. నర్సారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఫిర్యాదుతో జూపల్లి మల్లారెడ్డికి నోటీసులు జారీ చేసినట్లు మల్లు రవి చెప్పారు. అలాగే ఎంపి వంశీ కారుపై దాడి చేశారన్న ఫిర్యాదుపై గజ్వేల్ నర్సారెడ్డికి షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయాలపై స్పందించిన మల్లు రవి.. పార్టీకి వ్యతిరేకంగా పనిచేయడం తన డిక్షనరీలోనే లేదని స్పష్టం చేశారు. తాను ఏదైనా తప్పు చేసి ఉంటే ఎఐసిసికి ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. తనకు టికెట్ రాకపోయినా పొత్తులో భాగంగా బిఆర్‌ఎస్ కోసం పనిచేసిన సందర్భం ఉందని గుర్తు చేశారు. తాను ఎవరికీ వ్యతిరేకం కాదని, కాంగ్రెస్‌కు అనుకూలంగా మాత్రమే ఉంటానని పేర్కొన్నారు. ఎవరిపైనా కక్షతో నివేదిక ఇవ్వలేదని, కొండా సురేఖ, చిన్నారెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని మల్లు రవి స్పష్టం చేశారు. వారంతా తనకు మిత్రులేనని తెలిపారు.

**రాజగోపాల్‌రెడ్డి రాక శుభ పరిణామం :** నకిరేకల్ సభకు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరు కావడం మంచి పరిణామమని మల్లు రవి అన్నారు. ఆయన సీనియర్ నాయకుడని, ఒకసారి బిజెపిలోకి వెళ్లి తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. ఏ సమస్యనైనా చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చనే విషయాన్ని ఆయన చూపించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన ధర్మబద్ధంగా సాగుతోందని మల్లు రవి అన్నారు. మహిళా మంత్రిగా కొండా సురేఖ సిఎంకు రాఖీ కట్టిన తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు ధర్మం ప్రకారమే జరిగాయని వ్యాఖ్యానించారు. అయితే వారిపై తనకు ప్రేమ, గౌరవం ఏమాత్రం తగ్గలేదన్నారు. పార్టీ క్రమశిక్షణ విషయంలో కఠినంగా ఉండాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించిందని తెలిపారు. పార్టీకి సంబంధించిన ఫిర్యాదులు, సమస్యలు ఉంటే గాంధీభవన్‌కు వచ్చి చెప్పుకోవాలని సూచించారు. ధర్నాలు, బహిరంగ నిరసనలకు దిగితే మాత్రం క్రమశిక్షణ చర్యలు తప్పవని మల్లు రవి హెచ్చరించారు.

## 23 ఏళ్లుగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

టూరిజం కార్పొరేషన్ ఎండికి
ఎఐటియుసి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్
ఉద్యోగుల యూనియన్ వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఏళ్ల తరబడి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి ఆధ్వర్యంలో శనివారం టూరిజం కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్పొరేషన్‌లో గత 23 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా సేవలందిస్తున్న వారిని క్రమబద్ధీకరించాలని యూనియన్ కోరింది. ప్రభుత్వ ఉద్యోగుల వయోపరిమితిని 61 సంవత్సరాలకు పెంచిన నేపథ్యంలో అదే ప్రయోజనాన్ని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని విజ్ఞప్తి చేసింది. టూరిజం ప్లాజాలో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు ఇతర ఉద్యోగులకు కూడా వేతనాలు పెంచాలని యూనియన్ కోరింది. ఉద్యోగులకు బస్సు పాస్ సౌకర్యం కల్పించడంతో పాటు తెలంగాణ ఇన్‌క్రిమెంట్లు వర్తింపజేయాలని డిమాండ్ చేసింది.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌తో పాటు టూరిజం శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరింది. ఏళ్ల తరబడి సంస్థలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పలు ప్రయోజనాలు అందడం లేదని యూనియన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఇతర ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న తమకు న్యాయం చేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అధికారులు సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**145 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు న్యాయం చేయాలి :**

తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌లో గత 23 సంవత్సరాలుగా పనిచేస్తున్న సుమారు 145 మంది ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, వయోపరిమితి పెంపు ప్రయోజనాన్ని 61 సంవత్సరాలకు వర్తింపజేయాలని యూనియన్ కోరింది. తమ డిమాండ్లపై ప్రభుత్వం, టూరిజం కార్పొరేషన్ యాజమాన్యం తక్షణమే స్పందించి ఉద్యోగులకు న్యాయం చేయాలని సబ్బు రాజమౌళి విజ్ఞప్తి చేశారు.

## బిసి కులగణనపై ప్రత్యక్ష పోరాటం

ఈనెల 11న ధర్మ పోరాట దీక్షలు..
20న హైదరాబాద్‌లో
జాతీయ సదస్సు
నవంబర్‌లో పార్లమెంట్ ముట్టడి
జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా చేపడుతున్న జనగణనలో ఓబిసి కాలమ్‌ను చేర్చాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కేంద్రం స్పందించే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని బిసి భవన్‌లో ఆదివారం జరిగిన బిసి సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11న అన్ని జిల్లా కేంద్రాల్లో బిసిల ధర్మ పోరాట దీక్షలు, 20న హైదరాబాద్‌లో 29 రాష్ట్రాల ఓబిసి ప్రతినిధులతో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. నవంబర్‌లో పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. ఓబిసి కాలమ్ లేకుండా రూపొందించిన జనాభా లెక్కల ప్రశ్నావళిని రద్దు చేసి, కులగణన ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని జాజుల డిమాండ్ చేశారు. అఖిలపక్ష పార్టీలు, సామాజిక నిపుణులతో కేంద్ర ప్రభుత్వం సమావేశం నిర్వహించిన అనంతరం కులగణనపై ముందుకు వెళ్లాలని కోరారు.

'బిసి కులగణన చేస్తారో.. గద్దె దిగుతారో బిజెపి తేల్చుకోవాలి' అని ఆయన వ్యాఖ్యానించారు. కులగణనపై కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన వంద రోజుల ప్రత్యక్ష పోరాట కార్యాచరణను స్వాగతిస్తున్నామని చెప్పారు. ఇదే విధంగా ఇతర రాజకీయ పార్టీలు కూడా కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి బిసిల ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం ఈనెల 20న హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ ఓబిసి సదస్సు బ్రోచర్‌ను బిసి సంఘాల నేతలు కుందారం గణేషాచారి, గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యాంకుర్మా, రావులకోల్ నరేష్ ప్రజాపతి, జాజుల లింగం గౌడ్, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ రమేష్, పానుగంటి విజయ్, గూడూరు భాస్కర్ మేరు, ఇంద్రమ్ రజక, బ్రహ్మచారి, వెంకటేష్ తదితరులతో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు.



కోదండరెడ్డి, కొండలరావు, కనకవ్వలకు పొన్నం సత్తయ్య

## జీవిత సాఫల్య పురస్కారాలు


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయం, సాహిత్యం, కళారంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న ముగ్గురిని పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారాలకు ఎంపిక చేశారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య స్మారకార్థం పొన్నం సత్తయ్య ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏటా ఈ పురస్కారాలను అందిస్తున్నారు. వ్యవసాయ రంగంలో విశేష కృషి చేస్తున్న రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, సాహిత్య రంగంలో వెలిచాల కొండలరావు, కళారంగంలో సేవలందిస్తున్న గొట్టే కనకవ్వలను అవార్డులకు ఎంపిక చేసినట్లు ట్రస్టు ఉపాధ్యక్షుడు పొన్నం అశోక్ గౌడ్ తెలిపారు. అవార్డుల జ్యూరీ కమిటీ కన్వీనర్ డాక్టర్ పొన్నం రవిచంద్ర ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ జరిగింది. జ్యూరీ సభ్యులు ఎంపిక చేసిన జాబితాను ఆదివారం ట్రస్టు చైర్మన్ పొన్నం ప్రభాకర్‌కు అందజేశారు.

**ఈనెల 13న రవీంద్రభారతిలో కార్యక్రమం..**

పొన్నం సత్తయ్య 16వ వర్ధంతి సందర్భంగా ఈనెల 13న మధ్యాహ్నం 2 గంటలకు రవీంద్రభారతిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. అవార్డులకు ఎంపికైన ముగ్గురికి రూ.50వేల నగదు పురస్కారంతో పాటు మెమెంటో, ప్రశంసాపత్రం అందజేయనున్నారు. పొన్నం సత్తయ్య ఆశయాలను కొనసాగిస్తూ వివిధ రంగాల్లో సమాజానికి సేవలందిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి సత్కరించడమే పురస్కారాల ప్రధాన ఉద్దేశమని పొన్నం అశోక్ గౌడ్ తెలిపారు.

## జిఒ నెం.33ను మంత్రివర్గం ఆమోదించొద్దు

కె. నారాయణ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కిడ్నీ మార్పిడిలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జిఒ నెం.33ను తక్షణమే ఉపసంహరించుకోవాలని, దీనిని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించవద్దని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ డిమాండ్ చేశారు. గతంలో కిడ్నీ మార్పిడిల పేరుతో అనేక అక్రమ దందాలు జరిగాయని, కోట్లాది రూపాయల వ్యాపారం సాగిందని నారాయణ అన్నారు. కొత్త జిఓ అమలులోకి వస్తే పేదలు, సామాన్య ప్రజలు మోసపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కిడ్నీ మార్పిడికి రక్త సంబంధీకులకు మాత్రమే అవకాశం కల్పించేలా నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కోరారు. జిఓ నెం.33 ద్వారా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు మరింత అవకాశం కల్పించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. దీనివల్ల అవయవ మార్పిడి వైద్యం వ్యాపారంగా మారి పేద ప్రజలే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. సామాన్యులకు ప్రయోజనం కల్పించకుండా కార్పొరేట్ వైద్య రంగానికి మేలు చేసే విధానాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. తెలంగాణ కేబినెట్ సమావేశంలో జిఒ నెం.33కు ఆమోదం తెలిపే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించాలని నారాయణ సూచించారు.

## మెట్రో, ఆర్‌టిసి ఉమ్మడి పాస్‌లను వెంటనే ప్రవేశ పెట్టాలి

అధికారులను ఆదేశించిన ప్రభుత్వ ప్రధాన
కార్యదర్శి సంజయ్ జాజు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో మెట్రోరైల్, ఆర్‌టిసి బస్సు ప్రయాణానికి ఉమ్మడి పాస్‌ను వెంటనే ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ప్రజలకు సౌలభ్యంగా ఉండేలా నెలవారీ, రోజువారీ పాస్‌లను జారీ చేయడానికి ఏర్పాట్లు చేయాల్సిందిగా మెట్రో, ఆర్‌టిసి అధికారులకు సూచించారు. బేగంపేట్ మెట్రోరైల్ భవన్‌లో ఆదివారం మెట్రోరైల్, టిజిఎస్ ఆర్‌టిసి, విద్యుత్, జలమండలి శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎం.డి. సర్ఫరాజ్ అహ్మద్, అడిషనల్ ఎంపి అజిత్ రెడ్డి, జాయింట్ ఎండి శివేంద్ర ప్రతాప్‌లు మెట్రోరైల్ మొదటి, రెండవ దశలకు సంబంధించిన పనుల వివరాలను సిఎస్‌కు వివరించారు. నగర ప్రజలకు మెరుగైన, సమర్థవంతమైన, సురక్షితమైన ప్రజా రవాణా సేవలు అందించేందుకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాలకు అనుగుణంగా మెట్రో రైలు వ్యవస్థను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడం, ప్రజలకు మెరుగైన కనెక్టివిటీ కల్పించడం, ప్రయాణికుల సౌకర్యాలను మరింత విస్తరించడంపై అధికారులతో చర్చించారు.

పాతనగరంలో 7.5 కిలోమీటర్ల మెట్రో కారిడార్ కోసం రహదారుల విస్తరణ పనులు, తాజా స్థితిగతులను ఆయన అడిగి తెలుసుకున్నారు. జనరల్ కన్సల్టెన్సీ నియామకానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ప్రస్తుత స్థితిని అధికారులు ఆయనకు వివరించారు. విస్తరణ పనులు వేగవంతం చేయాలని, త్వరితగతిన మెట్రో పనులు ప్రారంభం కావాలని సిఎస్ ఆదేశించారు. మెట్రో, ఆర్‌టిసి ప్రయాణికులకు ఉమ్మడి పాస్ జారీ చేయడానికి సాంకేతిక పరంగా సిద్ధంగా ఉన్నామని, ఏ రోజైనా అమలు చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎల్ అండ్ టి, మెట్రోరైల్, ఆర్‌టిసి అధికారులు తెలిపారు. ఉమ్మడి చార్జీలను త్వరితగతిన ఖరారు చేసి, వెంటనే పాస్‌ల విధానాన్ని అమలు చేయాలని సిఎస్ ఆదేశించారు.



**మెట్రో సేవలపై సిఎస్ సంజయ్ జాజు సంతృప్తి**

వేగవంతమైన, సురక్షితమైన, పర్యావరణహిత ప్రజా రవాణా అందించడంలో మెట్రో రైలు కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. బేగంపేట్ మెట్రో స్టేషన్ నుంచి ప్యారడైజ్ మెట్రో స్టేషన్ వరకు సాధారణ ప్రయాణికుడిలా ప్రయాణించారు. మెట్రోరైల్‌లో సేవలు, స్టేషన్‌లలోని ప్రయాణికుల సౌకర్యాలు, నిర్వహణ వ్యవస్థను పరిశీలించారు. ప్రయాణ సమయంలో రైళ్ల నిర్వహణ, ప్రయాణికుల రద్దీ, స్టేషన్‌లలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, సేవల నాణ్యత వంటి అంశాలను తనిఖీ చేశారు. సేవల నాణ్యతను నిరంతరం మెరుగుపరిచే దిశగా చర్యలు కొనసాగించాలని అధికారులకు సూచించారు. సాధారణ ప్రయాణికుడిగా ప్రయాణించడం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను, వారి అనుభవాలను నేరుగా తెలుసుకోవడానికి వీలు కలిగిందని తెలిపారు.

పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా మెట్రో సేవలను మరింత సమర్థవంతంగా విస్తరించాలని, సేవల నాణ్యతను నిరంతరం పెంచేలా చర్యలు తీసుకోవాలని సిఎస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జలమండలి ఎండి అశోక్ రెడ్డి, హెచ్‌ఎంఆర్ చీఫ్ ఎలక్ట్రికల్ ఆఫీసర్ డివిఎస్ రాజు, సిఎస్‌టిఈ స్వప్న కుమార్ దాస్, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్, చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి, జిఎం(ఫైనాన్స్) సూర్యప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించిన కడియం



**ప్రజాపక్షం/జనగామ:** స్టేషన్‌ఘనపూర్ మండలం రాఘవాపురం గ్రామంలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన స్థలాన్ని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం సందర్శించారు. ప్రమాదవశాత్తు జరిగిన ఈ సంఘటనలో పిల్లల విద్యా సర్టిఫికెట్లు, బట్టలు, నిత్యావసర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. దీనితో స్పందించిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, 50 సిమెంట్ బస్తాలు వెంటనే ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అసంపూర్తిగా ఉన్న ఎస్సీ మాల కమ్యూనిటి హాల్ నిర్మాణానికి 15 రోజుల్లో నిధులు మంజూరు చేయిస్తానని, 3 నెల్లో నిర్మాణం పూర్తి చేసే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘనపూర్ మున్సిపల్ ఛైర్మన్ తాటికొండ వినయ్‌కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు జులూకుంట్ల శిరీష్‌రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రామీణ సమస్యలు పరిష్కరించాలి: సిపిఐ





**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** గ్రామంలో పేరుకుపోయిన స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ మండల కార్యవర్గ సభ్యులు, గ్రామ కార్యదర్శి వడ్లకొండ సుధాకర్ ప్రభుత్వ అధికారులను, ప్రజా ప్రతినిధులను డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తమ్మడపల్లి జి గ్రామంలో పార్టీ కార్యకర్తల సమావేశం ఎండీ యాకూబ్ పాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్లకొండ సుధాకర్ మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం లోపించిందన్నారు. గ్రామంలో వెంటనే పారిశుధ్య పనులు చేపట్టి అంతర్గత రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి దోమల మందును పిచికారి చేసి దోమలను నివారించి ప్రజలను సీజన్ వ్యాధుల నుండి, విష పురుగుల నుండి కాపాడాలని కోరారు. కొద్దిపాటి వర్షానికే అంతర్గత రోడ్లో వర్షపు నీరు నిలిచి కుంటలను తలపించే విధంగా మారుతున్నాయన్నారు. నీరు బయటకు వెళ్లే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో ఎలేసీ పేరుతో విద్యుత్ కోతలు ఇష్టం వచ్చినట్లుగా విధిస్తున్నారని ఉన్నతాధికారులు స్పందించి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చూడాలన్నారు. లేదంటే ప్రజలను సమీకరించి ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు అజయ్, విష్ణు, పెద రాములు, చంద్రమౌళి, బిక్షపతి, ఎల్లమ్మ, నూర్నసా, శోభ, సజ్జన్, సుశీల, పాల్గొన్నారు.

# వినూత్న ఉత్పత్తులతో స్వయం ఉపాధికి అవకాశాలు



**ప్రజాపక్షం/హనుమకొండ:** మిల్లెట్ ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంతోపాటు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు.ఆదివారం హనుమకొండ గోపాల్ పూర్ జవహర్ కాలనీలో ఐఐఎంఆర్ న్యూట్రి హబ్ ప్రోత్సాహంతో ఉజ్వల చంద్రగిరి అనే యువతి ఎంటర్ప్రెన్యూషిప్ లో భాగంగా నెలకొల్పిన అరిస్సా గ్రోత్ ఫార్మ్స్ మిల్లెట్ పన్నీరు మాన్యూఫ్యాక్చరింగ్ ప్రాసెసింగ్ యూనిట్ ను జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఉత్పత్తి యూనిట్ కు సంబంధించిన వివరాలను ఎంటర్‌ప్రెన్యూరర్ ఉజ్వలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. హనుమకొండలో దేశంలోనే తొలిసారిగా ప్లాంట్ బేస్డ్ మిల్లెట్ పన్నీర్ తయారీ యూనిట్ ఇది అని, ఈ యూనిట్‌లో పాల ఉత్పత్తులతో కాకుండా మొక్కల నుంచి లభించే ప్రోటీన్‌ను ఉపయోగించి నాన్‌డెయిరీ మిల్లెట్ పన్నీర్, మిల్లెట్ బాసుంది తయారు చేస్తామని తెలిపారు. ఆరోగ్యకరమైన, పోషక విలువలతో కూడిన ప్రత్యామ్నాయ ఆహార ఉత్పత్తుల తయారీకి ఈ యూనిట్ దోహదపడుతుందన్నారు.ఈ పరిశ్రమ ఏర్పాటుకు హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ (ఐఐఎంఆర్) ఆర్కేవీవై రాఫ్తార్ కార్యక్రమం ద్వారా స్థాపించినట్లు పరిశ్రమ నిర్వాహకురాలు ఉజ్వల కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ మిల్లెట్ ఆధారిత ఉత్పత్తుల తయారీలో ఐఐఎంఆర్ వంటి సంస్థల సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని కొత్త ఉత్పత్తులను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ ప్రోత్సాహకాలు, పథకాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ న్యూట్రి హబ్ కు చెందిన డాక్టర్ జె.స్టాన్లే , జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, న్యూట్రిహబ్ బృందం, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయ్యండి



**ప్రజాపక్షం/నల్లబెల్లి :** గ్రామాభివృద్ధి కోసం నిధులు మంజూరి చేసి చేయూతను అందించాలని నర్సంపేట ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వేడుకున్నారు . ఆదివారం హన్మకొండలోని స్వగృహంలో ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డిని నల్లబెల్లి కాంగ్రెస్ గ్రామ పార్టీ ఆధ్వర్యంలో కలిసి గ్రామంలో ప్రదాన రోడ్డు సెంటర్ లైటింగ్ ,సిసి రోడ్ల నిర్మాణం ,సైడ్ కాల్వల పనులు చేపట్టుటకు నిధులు మంజూరి చేయ్యాలని గ్రామ పార్టీ అధ్యక్షుడు బత్తిని మహేష్ కోరారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ పార్టీ నాయకలు మాసనపెల్లి ప్రభాకర్ ,కొండి అశోక్ ,గాజు బిక్షపతి ,పోడేటి కిషోర్ ,కన్నెబోయిన సురేష్ ,మాసనపెల్లి పవన్ తదితరులు పాల్గోన్నారు .

# సిఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సిరెడ్డి, మండల అధ్యక్షుడు దామెర అనిల్ కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని కామారెడ్డి గూడెం గ్రామానికి చెందిన పంగా యాదగిరి కుటుంబానికి రూ.57వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్స్ నాగేష్, అశోక్, ఉమేష్, రవీందర్, సత్తయ్య, జాకీర్, సురేష్; నర్సిరెడ్డి, ఉపేందర్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రూ.40 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నా

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 54వ డివిజన్ పోచమ్మకుంటలో రూ.40 లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. పోచమ్మ బోనాల సందర్భంగా పోచమ్మ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. ఎన్నికల ముందు పాదయాత్రలు, ప్రజలతో సమావేశాల సందర్భంగా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుండటం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు.పోచమ్మకుంట తనకు ప్రత్యేకమైన ప్రాంతమని, తన ఇల్లు కూడా ఇదే డివిజన్‌లో ఉండటంతో ఈ ప్రాంత అభివృద్ధిపై మరింత శ్రద్ధ వహిస్తున్నానని చెప్పారు. ప్రజలు తమకు అవసరమైన అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు అందిస్తే వాటిని ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.పోచమ్మకుంటలో కమ్యూనిటీ భవన్ నిర్మాణం, పోచమ్మ దేవాలయ అభివృద్ధి, అంతర్గత రోడ్ల నిర్మాణం తదితర పనులకు నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రోడ్లకు సంబంధించిన పనులను త్వరలోనే పరిశీలించి, ఏయే ప్రాంతాల్లో రోడ్లు అవసరమో గుర్తించి పనులు చేపడతామని చెప్పారు.అదేవిధంగా పోచమ్మకుంట శ్మశానవాటికను ఆధునికంగా, సుందరంగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. గార్డెన్ తరహాలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు అవసరమైన గదులు, ఇతర మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, అభివృద్ధి పనుల విషయంలో తాను ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీస్ శాఖల సమన్వయంతో అవసరమైన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.పోచమ్మకుంట ప్రజలు రాజకీయ పార్టీలకు అతీతంగా గత పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని బేరీజు వేసుకుని నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కులం, పార్టీ పేరుతో కాకుండా ప్రజలకు ఎవరు అభివృద్ధి చేస్తారో వారిని ఆదరించాలని కోరారు.ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లతో పాటు ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న కొత్త గృహ నిర్మాణ పథకాల ద్వారా ప్రయోజనం కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నాయిని తెలిపారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పోచమ్మకుంటను ప్రత్యేకంగా దత్తత తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తానని ఎమ్మెల్యే నాయిని పునరుద్ఘాటించారు.

**సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ**

పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన 123 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.32,40,000 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. అనారోగ్యంతో చికిత్స పొందిన కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.పేద కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారకుండా ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, నియోజకవర్గ ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు.

# ఎనుమాముల ఇవిఎం గోదాం కలెక్టర్ తనిఖీ




**ప్రజాపక్షం/వరంగల్ :** త్రైమాసిక తనిఖీలో భాగంగా ఆదివారం ఎనుమాముల మార్కెట్ యార్డులోని ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాంలో అమలులో ఉన్న భద్రతా చర్యలు, నిర్వహణ ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. తనిఖీ లో డియార్వో విజయలక్ష్మి , వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు

# ప్రశాంతంగా జనగామ మున్సిపల్ తాత్కాలిక ఉద్యోగుల రాత పరీక్ష



**ప్రజాపక్షం/జనగామ:** జనగామ మున్సిపాల్టీ తాత్కాలిక ఉద్యోగుల రాత పరీక్ష ఆదివారం జిల్లా కలెక్టరేట్‌ని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. అన్‌స్కిల్డ్ శానిటేషన్ వర్కర్ పోస్టులు 30 కాగా 45 ధరఖాస్తులు వచ్చాయని, 34 మంది అబ్యర్థులు పరీక్షలు హాజరైనట్లు తెలిపారు. ఎలక్ట్రిషియన్ పోస్టులు 4 కాగా ఇందుకు గాను 34 ధరఖాస్తులు రాగీఆ 32 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారన్నారు. హెవి వెహికిల్ డ్రైవర్ పోస్టులు 20 కాగా ఇందుకు గాను 47 మంది ధరఖాస్తు చేసుకోగా 44 మంది అబ్యర్థులు హాజరై పరీక్షలు రాశారన్నారు. మొత్తం 54 పోస్టులకు 126 మంది ధరఖాస్తు చేసుకోగా 110 మంది అభ్యర్థులు పరీక్షలు రాసినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, జనగామ మున్సిపల్ కమీషణర్ రాజశేఖర్‌రెడ్డి, ఉపాధి కల్పన అధికారి కుమారస్వామి పాల్గొన్నారు.

# వాతావరణ మార్పులపై సరిహద్దులు దాటి పోరాడాలి

## భూటాన్‌లో సౌత్ ఏషియా పార్లమెంటరీ సదస్సులో ఎంపి డాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/హనుమకొండ:** వాతావరణ మార్పులు ప్రపంచానికి పెను సవాలుగా మారుతున్న నేపథ్యంలో.. దక్షిణాసియా దేశాలు సరిహద్దులను దాటి సమష్టి కార్యాచరణతో ముందుకు సాగాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను ఎదుర్కోవడం ఒక్క దేశం బాధ్యత కాదని.. భవిష్యత్ తరాల కోసం ప్రాంతీయ సహకారంతో సమగ్ర పరిష్కారాలను సాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.
భూటాన్‌లో జరుగుతున్న సౌత్ ఏషియా పార్లమెంటరీ డైలాగ్ ఆన్ ఎన్విరాన్‌మెంట్, క్లైమేట్ అండ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. దక్షిణాసియా దేశాలకు చెందిన పార్లమెంటేరియన్లు, విధాన నిర్ణేతలు, నిపుణులు ఒకే వేదికపైకి వచ్చి పర్యావరణం, వాతావరణ మార్పులు, సుస్థిర అభివృద్ధిపై ఈ సదస్సులో చర్చించడం జరిగింది. ఈ సదస్సులో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వాతావరణ మార్పుల ప్రభావం ఇప్పటికే ప్రజల జీవన విధానంపై స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అధిక ఉష్ణోగ్రతలు, అనియంత్రిత వర్షాలు, వరదలు, కరువులు, నీటి కొరత వంటి పరిణామాలు వ్యవసాయం, జీవనోపాధి, ప్రజారోగ్యం, ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. "వాతావరణ మార్పులకు సరిహద్దులు లేవు. కాబట్టి పరిష్కారాలకు కూడా సరిహద్దులు ఉండకూడదు. దక్షిణాసియా దేశాలు పరస్పర సహకారంతో పనిచేసినప్పుడే వాతావరణ సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కోగలం" అని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని ప్రత్యక్షంగా ఎదుర్కొంటున్న రైతులు, మహిళలు, యువత, పేదలు, అట్టడుగు వర్గాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని విధానాలు రూపొందించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతులు, నీటి నిర్వహణ, విపత్తుల ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భూటాన్ వేదికగా జరుగుతున్న ఈ పార్లమెంటరీ డైలాగ్ దక్షిణాసియా దేశాల మధ్య పర్యావరణ, వాతావరణ విధానాలపై సమన్వయానికి కీలక వేదికగా నిలుస్తోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు.

# వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** వయోవృద్ధుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం లోని హనుమాన్‌నగర్‌లో ప్రణమ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను ఎమ్మెల్యే గండ్ర ముఖ్యాతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి మల్లీశ్వరి తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద వయోవృద్ధుల సంరక్షణ కోసం డే కేర్ సెంటర్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. డే కేర్ సెంటర్లో వృద్ధులకు టివి, క్యారం బోర్డ్ లాంటి కాలక్షేపం కోసం ఆటలు ఉంటాయని అని అన్నారు. అనంతరం మధ్యాహ్నం భోజనం వసతి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన వయో వృద్ధులను గుర్తించి అన్ని వసతులు కల్పించాలన్నారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ డే కేర్ సెంటర్ నిర్వహిస్తారని అన్నారు. భూపాలపల్లి జిల్లాలో రెడ్ క్రాస్ బిల్డింగ్ వెంటనే నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని రెడ్ క్రాస్ అధ్యక్షుడు శ్రీనివాస్ ను అదేసించారు. ఇప్పటికే రెడ్ క్రాస్ బిల్డింగ్ కు కోటి రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. అవసరమైతే ఇంకా కోటి రూపాయలు ఇస్తానని అన్నారు.
వెంటనే బిల్డింగ్ పూర్తి చేసి రెడ్ క్రాస్ సేవలు ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు డాక్టర్ కె.ఎస్.కిరణ్, డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్, కౌన్సిలర్లు అరుణ్ రావు, డి.శారద, కో ఆప్షన్ సభ్యురాలు చల్ల రేణుక, పృధ్వి, నాయకులు పిప్పాల రాజేందర్, నగునూరి రజినీకాంత్, డే కేర్ సెంటర్ సూపర్వైజర్ సంజీవరావు, రెడ్ క్రాస్ కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాల నిర్వహణపై కలెక్టర్ అసంతృప్తి



**ప్రజాపక్షం/నెక్కొండ:** ఆశ్రమ పాఠశాలల నిర్వహణలో అలసత్వాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్ సత్యశారద స్పష్టం చేశారు. ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె పాఠశాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ స్థానికంగా అందుబాటులో ఉంటూ విద్యార్థుల విద్య, ఆరోగ్యం, భద్రతపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా బాలికల పాఠశాల కావడంతో వారి భద్రత, సంరక్షణ విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత, మెనూ అమలు, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. పాఠశాలలో గుర్తించిన లోపాలను తక్షణమే సరిదిద్ది, విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన భోజనం అందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తనిఖీ సందర్భంగా నర్సంపేట ఆర్‌డిఓ ఉమాదేవి, డిడబ్ల్యూఓ, తహసీల్దారు వేముల రాజ్‌కుమార్, ఎంపిడిఓ యాసం లావణ్య, ఖానాపురం ఎంపిడిఓతో పాటు సంబంధిత అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ ఉద్యోగ అభ్యర్థులకు శారీరక, రాత పరీక్షలు

## అర్హత సాధించిన అభ్యర్థులకు 70 రోజుల శిక్షణ

## అందివచ్చిన అవకాశాన్ని జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలి: ఎస్పి సిరిశెట్టి సంకీర్త్




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** అందివచ్చిన అవకాశాన్ని జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో అభ్యర్థులకు అధికారులు శారీరక పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 350 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. అనంతరం సింగరేణి హైస్కూల్‌లో రాత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సింగరేణి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన రాత పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్షా కేంద్రం లోని ఏర్పాట్లను పరిశీలించి, పరీక్షలు రాస్తున్న అభ్యర్థులతో మాట్లాడి వారి సన్నద్ధతను, పరీక్షకు సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి, తమకు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ మాట్లాడుతూ, శారీరక మరియు రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఉచిత డేస్ స్కాలర్ క్లాసులతో పాటు గ్రౌండ్ కోచింగ్‌ను 70 రోజుల పాటు అందించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు ఈ శిక్షణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కష్టపడి చదవడంతో పాటు శారీరకంగా కూడా సిద్ధం కావాలని సూచించారు. భూపాలపల్లి జిల్లా నిరుద్యోగ యువతకు అందుబాటులోకి వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలీస్ ఉద్యోగం సాధించే దిశగా కృషి చేయాలని, తమ బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవడంతో పాటు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి టౌన్ సీఐ శ్రీనివాస్, ఆర్ఐలు రత్నం, సంతోష్ కుమార్, కాశీరాం, ఆర్‌ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# ప్రజల జీవితంలో ఆనందమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ఆత్మకూరు:** పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమనీ పరకాల ఎమ్మెల్యే రేవూరు ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఆదివారం రోజున పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆత్మకూరు మండలంలోని నూతన ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమాలలో పాల్గొన్నారు.ఆత్మకూరు మండలం లింగమడుగు పల్లి, కామారం,గుడెప్పాడ్ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి గృహ ప్రారంభోత్సవం చేసి, లబ్ధిదారులను శాలువాతో సన్మానించి, లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ....ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందని,పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని,ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు లేవని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మాజీ రమేష్, కకెర్ల రాజు, బోరిగం స్వామి, లక్కర్సు రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాల పిల్లలకు సహాయక ఉపకరణాలు

**ప్రజాపక్షం/ములుగు:** ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు (సిడబ్ల్యూఎస్ఎన్) అవసరమైన సహాయక ఉపకరణాల గుర్తింపు, అంచనా కోసం ఈ నెల 8న ములుగు భవిత కేంద్రంలో ఏఎల్ఐఎంసిఓ శిభిరం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి ఏ సిద్దార్థ రెడ్డి తెలిపారు. ఉదయం 10గంటలకు శిభిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని మండల విద్యాధికారులు, కాంప్లెక్స్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలో సహాయక ఉపకరణాలు అవసరమైన గుర్తించబడిన సిడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులకు సంబంధిత ఐఈఆర్‌పిలతో కలిసి శిభిరానికి తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని సూచించారు. శిభిరానికి వచ్చే విద్యార్థులు రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్య ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం లేదా రేషన్ కార్డు, ఆధార్‌కార్డు తీసుకురావాలని తెలిపారు. ధృవీకరణ పత్రం లేని విద్యార్థులు ప్రభుత్వ వైద్యుడి ధృవీకరణతో పాటు ప్రధానోపాధ్యాయుడు లేదా ఎంఈఓ ధృవీకరణ సమర్పించవచ్చన్నారు. శిభిరం ఏర్పాట్లను సమగ్ర శిక్ష సమ్మిళిత విద్యా సమన్వయకర్త గుళ్లపెల్లి సాంబయ్య, ఏఎల్ఐఎంసిఓ బృందం పర్యవేక్షిస్తున్నట్లు డిఈఓ తెలిపారు.

# భద్రాద్రి విమానాశ్రయం దిశగా మరో ముందడుగు

**ఆరు ప్రతిపాదిత ప్రాంతాల్లో ఎఎఐ బృందం పరిశీలన**

**నేడు, రేపు ప్రీ ఫీజిబిలిటీ అధ్యయనం**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాకు గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టు సాధించే దిశగా మరో కీలక ముందడుగు పడింది. జిల్లాలో గుర్తించిన ఆరు ప్రతిపాదిత ప్రాంతాలను పరిశీలించేందుకు భారత విమానాశ్రయ అధికారిక సంస్థ (ఎఎఐ)కి చెందిన పలు విభాగాల బృందం 7,8 తేదీల్లో అనుకూలతపై క్షేత్రస్థాయి పరిశీలన చేయనుంది. దీంతో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన కృషి సత్ఫలితాల దిశగా అడుగులు పడుతున్నాయి. జిల్లా కలెక్టర్ ఇప్పటికే స్థానిక సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బృందానికి అవసరమైన సమన్వయం సహకారం అందించాలని రెవెన్యూ అటవీ నీటి పారుదల సర్వేగనులు భూగర్భజలాలు,భూగర్భశాస్త్రం, ఆర్అండ్‌బి, విద్యుత్ శాఖలను ఆదేశించారు. గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం కోసం గుర్తించిన ప్రతిపాదిత ప్రాంతాల్లో సీతంపేట, సుజాతనగర్, దమ్ముగూడెం, చాపరాళ్లపల్లి, పాల్వంచ , దమ్ముపేట ఉన్నాయి. వీటికి సంబంధించిన భౌగోళిక కో ఆర్డినేటర్లు భూమి వివరాలు సరిహద్దులు తదితర సమాచారాన్ని అధికారులు సిద్ధం చేశారు. ప్రతిపాదన ప్రాంతాల్లో భూమి స్వరూపం పరిస్థితులు ఇతర వనరులతో పాటు అవసరమైన సాంకేతిక అంశాలను బృందం పరిశీలించి సాధ్యాసాధ్యాలపై నివేదికలు సిద్ధం చేయనుంది. ఇప్పటికే నిర్వహించిన అధ్యయనాల్లో సీతంపేట, సుజాతనగర్ ప్రాంతాలు అనువైన ప్రాంతాలుగా ఉన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ రెండు ప్రాంతాల్లో సుమారు 667 ఎకరాల భూమి విమానాశ్రయ అవసరాలకు అందుబాటులో ఉన్నట్లు జూలైలో వెల్లడించిన నివేదికల్లో పేర్కొన్నారు. ఎఎఐ బృందం క్షేత్రస్థాయిలో ప్రతిపాదిత ప్రాంతాలను పరిశీలించనుండటంతో విమానాశ్రయం ఏర్పాటుపై ఆశలు మరింత బలపడుతున్నాయి. ఈ పరిశీలనలో వెలువడే సాంకేతిక నివేదికే గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ఏర్పాటు నిర్ణయాలకు కీలకంగా మారనుంది.

## మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ట్రయల్ రన్



**ప్రజాపక్షం/అశ్వాపురం:** తుమ్మలచెరువు ఆయకట్టు రైతుల చిరకాల స్వప్నమైన మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో పంపుల ట్రయల్ రన్ విజయవంతమైంది. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కొబ్బరికాయ కొట్టి ట్రయల్ రన్‌ను ప్రారంభించగా, ఇసుకవాగులో గోదావరి జలాలు కలిసే డిశ్చార్జ్ పాయింట్ వద్ద పూజలు నిర్వహించారు. ప్రాజెక్టు కోసం ఎమ్మెల్యే పాయం చేసిన కృషి ఫలించిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందుబాటులోకి వస్తే తుమ్మలచెరువు ఆయకట్టు భూములకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ మహేశ్వరరావు, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాసరావు, మెగా సంస్థ ఇంజనీర్లు, ఆపరేషన్ సిబ్బంది, మడంల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఊసా అనిల్‌కుమార్, వేములపల్లి రమేష్, బరాజు సంపత్, తుక్కాని మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పలు రహదారుల అభివృద్ధికి నిధులు

**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని మండలంలో ఆర్అండ్‌బీ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. వెంకటాయపాలెం–చింతకాని నాలుగు లైన్ల రహదారికి రూ.60 కోట్లు, రామకృష్ణాపురం– పెద్దగోపతి డబుల్ రోడ్డు అభివృద్ధికి రూ. 50 కోట్లు, ప్రొద్దుటూరు –గొల్లపూడి డబుల్ రోడ్డు అభివృద్ధి పనులకు రూ.33 కోట్లు, చింతకాని–నాగులవంచ డబుల్ రోడ్డుకు రూ.31 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. నిధులు మంజూరు చేసినందుకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వాలు విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించాలి

డిసిసిబి వైఎస్ చైర్మన్ ఉమ్మినేని కోటయ్య



**ప్రజాపక్షం/బోనకల్:** ప్రభుత్వాలు ఉచితాలు, ఆకర్షణ పథకాల కంటే నాణ్యమైన విద్య వైద్యాన్ని ఉచితంగా అందించాలని డిసిసిబి వైఎస్ చైర్మన్ ఉమ్మినేని కోటయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ప్రకాశరావు భవన్‌లో 72వ ప్రత్యేక బిపి, షుగర్ క్యాంపు విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు సీనియర్ నాయకులు రావెళ్ల జానకీరామయ్య, తమ్మారపు గోవిందు, తూము ప్రకాశరావు, కొంగర అప్పయ్య, ఏడునూతల కృష్ణమూర్తి, చుందూరు నరసింహరావు, తమ్మారపు మస్తాన్, తమ్మారపు భద్రయ్య, నల్లమోతు పిక్చయ్య, వెంపటి సాంబయ్య, వాసిరెడ్డి వెంకటపతి, కొంగర రామయ్యలతో కలిసి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో కలిసి పనిచేశారన్నారు. నేటి మధిర ప్రాంత అభివృద్ధి వెనుక ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమాల త్యాగగాథ దాగి ఉందన్నారు. కమ్యూనిస్టుల ఐక్యమత్యంతో అనేక విజయాలు సాధించిన ఘనత ఉందని పేర్కొన్నారు. తూము ప్రకాశరావు జీవితం ప్రజా ఉద్యమాలకు ఆదర్శమని కొనియాడారు. తూము ప్రకాశరావు అమరత్వానికి 43 సంవత్సరాలు పూర్తవుతున్న ప్రజల గుండెల్లో ఆయనకు చెరగని స్థానం ఉండటం ఆయన చేసిన సేవలకు నిదర్శమని అన్నారు. భవిష్యత్ తరాలు ఎదగాలంటే విద్య కావాలి, ప్రస్తుత తరం నడవాలంటే వైద్యం కావాలని అటు వైపుగా ప్రభుత్వాలు ఉచితాలు ఇచ్చేలా రాజకీయ పార్టీలు పోరాడాలన్నారు. మనం ఏ రాజకీయ పార్టీలో పనిచేసిన ప్రభుత్వాలు ప్రజలకు కల్పించాల్సిన మౌలిక విషయాలు ఏం ఉన్నాయో అవి సాధించుకునేందుకు పోరాటాలు చేయాలని కోరారు. రోగులు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సామాజిక స్పృహతో పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్న చారిటబుల్ ట్రస్ట్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు ఆకెన పవన్, మాతంగి శ్రీనివాసరావు, యంగల గిరి, జానకీపురం మాజీ సర్పంచ్ చిలకా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నిరంతర సాధనలో లక్ష్యాన్ని చేరుకోవచ్చు: ఎస్‌పి రోహిత్‌రాజ్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** పట్టుదల కృషి నిరంతర సాధన ఉంటే లక్ష్యాన్ని చేరుకోవచ్చని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ ఎస్ఐ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించాలనే తపన ఉన్న నిరుద్యోగ యువత కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని, ఇందు కోసం ఆదివారం నిర్వహించిన స్క్రీనింగ్ టెస్టుకు 1030 మంది హాజరయ్యారని ఎస్‌పి రోహిత్ రాజ్ తెలిపారు. మొత్తం 1216 మంది దరఖాస్తులు చేసుకోగా 1030 మంది హాజరయ్యారని చెప్పారు. అభ్యర్థుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రం వద్ద అని ఏర్పాట్లు చేశామని జిల్లాలోని ఐదు సబ్ డివిజన్ల పరిధిలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొత్తగూడెంకు సింగరేణి ఉమెన్స్ కాలేజీ, పాల్వంచ సబ్ డివిజన్‌కు అనుబోస్ కాలేజీ, ఇల్లెందుకు గవర్నమెంట్ హైస్కూల్, మణుగూరుకు చైతన్య టెక్నోహై స్కూల్, భద్రాచలం సబ్ డివిజన్‌కు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. యువతకు సరైన మార్గదర్శకం, నాణ్యమైన శిక్షణను అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. స్క్రీనింగ్ పరీక్షలో అర్హత సాధించిన వారికి రాత పరీక్ష శరీర ధారుఢ్య పరీక్షలో మెరుగైన ప్రతిభ కనబరిచే విధంగా సమగ్ర శిక్షణ అందిస్తామన్నారు. జిల్లా కేంద్రంలోని సింగరేణి ఉమెన్స్ కాలేజీలో నిర్వహించిన పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. స్క్రీనింగ్ టెస్టు నిర్వహణలో సబ్ డివిజన్ పోలీస్ అధికారులు ఇన్‌స్పెక్టర్లు ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొని పరీక్షను సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు.

## ప్రజావాణికి సకాలంలో హాజరు కావాలి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఐడిఒసిలో నిర్వహించే ప్రజావాణి, భద్రాచలంలో ఐటిడిఎ ఆధ్వర్యంలో జరిగే గిరిజన దర్బారుకు సంబంధిత శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని అధికారులు తెలిపారు. ప్రజలు వారి సమస్యలను విన్నవించుకునేందుకు అధికారులపై ఉన్న నమ్మకంతో ఇక్కడి దాకావచ్చి దరఖాస్తులు సమర్పిస్తుంటారని, వ్యయ ప్రయాసలకు ఓర్చి వచ్చేవారి నమ్మకాన్ని వమ్ముచేయరాదని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరించే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని స్పష్టం చేశారు.

## మహిళలు కోటీశ్వరులుగా ఎదగటమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే మట్టా రాగమయి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** మహిళ లు కోటీశ్వర్లుగా ఎదగటమే ప్రభుత్వ లక్ష్యమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. పెనుబల్లి మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి, స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యుల కోసం సెర్ప్, ఎస్ బిఐ, ఉషా కిరణాలు మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జ్యూట్ బ్యాగ్ తయారీ శిక్షణ కేంద్రాన్ని ఆదివారం సత్తుపల్లి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయమని అన్నారు. మహిళా సంఘాల ద్వారా సున్నా వడ్డీ రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం, పెట్రోల్ బంకుల ఏర్పాటు వంటి పలు కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. జ్యూట్ బ్యాగ్ తయారీ వంటి నైపుణ్య శిక్షణలను సద్వినియోగం చేసుకొని మహిళలు స్వయం ఉపాధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం సంపత్ కుమార్, ఇన్‌చార్జ్ ఎంపిడిఒ వీరాస్వామి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, రాజబోయన కోటేశ్వరావు, కీసర శ్రీనివాసరెడ్డి సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు రాధాకృష్ణ, పసుమర్తి విశ్వనాదం, సర్పంచ్‌లు మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బల్లి మనీషా, ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు సిపిఐ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ములకపల్లి మండలం కౌటిగూడెం గ్రామానికి చెందిన గిరిజన యువతి శిరీష హత్య అత్యాచారం ఘటనపై రాజకీయ ప్రజా సామాజిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సిపిఐ కార్యాలయం శేషగిరిభవన్‌లో ఉదయం 11.30 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి ఉద్యోగం చేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్న ఆదివాసీ బిడ్డను అత్యంత కిరాతకంగా హతమార్చడం హేయమైన చర్యని, మానవ సమాజానికి మచ్చ అని, ఇలాంటి దారుణాలపై ప్రతొక్కరూ స్పందించాలన్నారు. కార్యాచరణ రూపొందించి బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. రాజకీయ పక్షాలు, ప్రజా సామాజిక సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని పాషా కోరారు.

## ఎల్లంకి కమలమ్మ మరణం బాధాకరం

తుది శ్వాస విడిచే వరకూ ఎర్రజెండాతోనే కమలమ్మ ప్రయాణం

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** సిపిఐ జిల్లా సమితి సభ్యుడు ఎల్లంకి మధు మాతృమూర్తి, సిపిఐ సీనియర్ నాయకురాలు ఎల్లంకి కమలమ్మ ఆదివారం అనారోగ్యంతో మరణించారు. వారి పార్థివ దేహానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పూలమాల వేసే నివాళులర్పించారు. వారి కుటుంబం పార్టీకి పేద ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని పార్టీ సిద్ధాంతాన్ని కట్టుబడి ముందుకు నడిపించిన చరిత్ర వారి కుటుంబానికి ఉందని పార్టీలో తారతమ్యం లేకుండా అందరితో మంచిగా ఉండేవారని ఎల్లప్పుడూ ప్రజల పక్షాన అండగా ఉండేవారని పార్టీలకు అతీతంగా అందరితో కలిసి ఉండేవారని, ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, వారి మరణం ఈ ప్రాంత వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటని వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపం తెలియజేశారు. కమలమ్మ పార్థివ దేహానికి నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు దొండపాటి రమేష్. చంద్ర నరేంద్ర కుమార్, సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, చుంచుపల్లి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి కుమారి, హనుమంతరావు, ఎస్ కె. నాగుల్ మీరా, సామేలు, వెంకటేశ్వర్లు, తూము కోటయ్య, వెంకటప్పయ్య, చెరుకుమల రాజేశ్వరరావు, తాత నరసింహారావు, తదితర పార్టీ శ్రేణులు ఉన్నారు.

## పాల్వంచ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్

మేయర్ మూడ్ గణేష్



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. ఆదివారం ఇందిరా కాలనీ నుండి నవభారత్ వరకు పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారికి ఇరువైపులా పేరుకు పోయిన చెత్తను, వ్యర్థాలను తొలగించి డివైడర్ శుభ్రం చేశారు. జరుగుతున్న పనులను డిప్యూటి మేయర్ సిరిపురపు లలిత కుమారితో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో పాల్వంచ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకొందామని చెప్పారు. గత మూడు దశాబ్దాల పాటు పాల్వంచలో ఎన్నికలు లేకపోవటంతో అభివృద్ధి అనుకున్నంత మేర జరగలేదని అన్నారు. పాల్వంచను అన్ని రంగాలలో అభివృద్ధి చేయటానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఎన్నికలు జరిపించటానికి ఎమ్మెల్యే కృషి మరువలేనిదని చెప్పారు. పాల్వంచకు ఎన్నికలు తెచ్చిన ఘనత ఎమ్మెల్యే కూనంనేనికి దక్కుతుందని స్పష్టం చేశారు. ఇంటి యాజమానులు వ్యర్థాలను చెత్త వాహనాలకు అందించాలని సూచించారు. పాల్వంచ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచటానికి, పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు చేపడుతున్న ప్రత్యేక డ్రైవ్‌కు ప్రజలు మున్సిపాలిటీ అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపాలిటి శానిటేషన్ అధికారి అశోక్ చౌహాన్ పాల్గొన్నారు.

## ప్రమాదాలకు నిలయంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి



**ప్రజాపక్షం/బోనకల్:** మండల కేంద్రంలోని జగ్గయ్యపేట–వైరా ప్రధాన రహదారిపై ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం భారీగా వాహనాల రాకపోకలు సాగుతున్న ఈ బ్రిడ్జిపై రహదారి తరుచూ దెబ్బతిని గుంతలు ఏర్పడుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గుంతలను తప్పించే క్రమంలో అదుపుతప్పి ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల రద్దీ కారణంగా బ్రిడ్జిపై రహదారి తరుచూ డ్యామేజికి గురవుతుండగా, అర్అండ్‌బి అధికారులు పలు మార్లు మరమ్మతులు చేపట్టిన కొద్దికాలానికే మళ్లీ గుంతలు ఏర్పడుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. తాత్కాలిక మరమ్మత్తులతో సమస్య పరిష్కారం కావడంల లేదని, నాణ్యతా ప్రమాణాలతో శాశ్వత మరమ్మత్తులు చేపట్టి వాహనదారులకు భద్రత కల్పించాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## అసెంబ్లీకి రాని కెసిఆర్.. తక్షణమే రాజీనామా చేయాలి

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావించకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమైన మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ తన పదవికి రాజీనామా చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కెసిఆర్ వైఖరిని నిరసిస్తూ ఆదివారం మణుగూరులో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. క్యాంప్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం మణుగూరు అంబేద్కర్ సెంటర్‌లో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి కెసిఆర్ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన పదవి ఫామ్‌హౌస్‌లో కూర్చోవడానికి కాదని అన్నారు. ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి హాజరై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సభలో ప్రస్తావించి, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన బాధ్యత కెసిఆర్‌పై ఉందన్నారు. అసెంబ్లీకి రాకుండా ప్రజల గొంతుక ఎలా అవుతారు? అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఫామ్‌హౌస్ రాజకీయాలతో ప్రజల సమస్యలు పరిష్కారం కావని, ప్రజల మధ్యకు వచ్చి వారి కష్టాలను తెలుసుకుని వాటిని అసెంబ్లీలో ప్రస్తావించాలని సూచించారు. టిఆర్ఎస్ నాయకులు తమకు ప్రతిపక్ష పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం అంటే అసెంబ్లీలో ఉండి ప్రజల సమస్యలపై ప్రశ్నించడం, ప్రభుత్వాన్ని నిలదీయడం అని స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పును కెసిఆర్ గౌరవించి ఆత్మపరిశీలన చేసుకోవాలని, ప్రజల మధ్యకు వచ్చి పనిచేయాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీ, రాస్తారోకో కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో పాటు స్థానిక సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, మండల అధ్యక్షులు, మండల కార్యదర్శులు, టౌన్ అధ్యక్షులు, యూత్ అధ్యక్షులు, మహిళా నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలనపై సంబరాలు



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణలో ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా వైరా రింగు రోడ్డు వద్ద ఆదివారం కేక్ కటింగ్ నిర్వహించారు. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావుతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్య, వైద్యం, పేదల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. వైరా నియోజకవర్గంలో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, సాగునీరు, పట్టణాభివృద్ధి తదితర రంగాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల సహకారంతో వైరా నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళతామని అన్నారు. 1000 రోజుల ప్రజాపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రివర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రాష్ట్ర ప్రజలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ బోళ్ల గంగారావు, ఆత్మ చైర్మన్ మట్టూరు వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, వీరంశెట్టి సీతారాములు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షులు డాక్టర్ మురళీకృష్ణ, కౌన్సిలర్లు ఫణితి సైదులు, బత్తుల సుమతి, వుంద్రు శ్యామ్‌బాబు, దార్న రాజశేఖర్, మచ్చా బుజ్జి, హరినాథ్, కిరణ్, వీరయ్య, మేడూరి రామారావు, బిడికె.రత్నం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యాన్ని గాలికి వదిలేసిన చరిత్ర బిఆర్ఎస్‌దే

కాంగ్రెస్ చేసే అభివృద్ధి పనులు చూడలేక కమల్‌రాజు నిందలు

మున్సిపల్ చైర్‌పర్సన్ సుజాత



**ప్రజాపక్షం/మధిర:** అధికారం కోల్పోయి రాజకీయ ఉనికి కాపాడుకునే తాపత్రయంతో బిఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇంచార్జ్ లింగాల కమల్‌రాజు తీవ్ర అసత్యాలు మాట్లాడుతున్నారని మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత అన్నారు. ఆదివారం బిఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలకు ఆమె ఘాటుగా స్పందించారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికై ప్రజల ఆదరణ పొందుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై, రాత్రింబవళ్లు నియోజకవర్గ అభివృద్ధికి శ్రమిస్తున్న ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కపై ఆధారాల్లేని నిందలు వేయడమే ధ్యేయంగా కమల్‌రాజు రాజకీయ నాటకాలాడుతున్నారని మండిపడ్డారు. బిఆర్ఎస్ పదేళ్ల హయాంలో మధిర పట్టణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసి, పారిశుద్ధ్యాన్ని గాలికి వదిలేసిన నల్లటి చరిత్ర కమల్‌రాజుదే అని సుజాత విమర్శించారు. కెటిఆర్ హయాంలో నెలనెలా నిధులిచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న ఆయన ఆ నిధులు ఏ అభివృద్ధికి వెచ్చించారో ప్రజల ముందు శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క ఒక విజన్‌తో మధిరను రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు వేల కోట్ల రూపాయలతో శాశ్వత అభివృద్ధి పనులు చేపడుతుంటే కమల్‌రాజు ఓర్వలేకపోతున్నారు అన్నారు. ఎక్కడా సీజనల్ వ్యాధులు విజృంభించకుండా ముందస్తు చర్యలు చేపడుతూ ప్రజారోగ్యాన్ని కాపాడుతున్నామని చెప్పారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహారావు, మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరెడ్డి, మిర్యాల వెంకటరమణ, వైస్ చైర్మన్ కోన ధనికుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సూరంశెట్టి కిషోర్, పులిబండ్ల చిట్టిబాబు, కౌన్సిలర్ శ్రీపాలశెట్టి వెంకట్రావు, నాయకులు లక్ష్మారెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శిరీషకు న్యాయం చేయాలంటూ కొవ్వొత్తుల ర్యాలీ



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఆదివాసీ యువతి శిరీషకు న్యాయం చేయాలని, ఆమెపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శ్రీ వెంకట సాయి నగర్‌లో ఆదివాసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి న్యాయం, భరోసా కల్పించాలని కోరారు. ర్యాలీలో ఆదివాసీ నాయకులు జోగ రామారావు, ఈసం భాస్కర్, సమ్మయ్య, శంకర్, వెంకన్న, ప్రవీణ్, రవి, సునీల్, కృష్ణకాంత్, మహిళలు రమాదేవి, లక్ష్మి, ఈశ్వరి, అన్నపూర్ణ, రమణ, అనూష, మమత తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్ కుటుంబానికి మంత్రి పరామర్శ



**ప్రజాపక్షం/పెనుబల్లి:** మండల పరిధిలోని యడ్ల బంజర పంచాయతీ ఉప సర్పంచ్ యడ్ల సుబ్బారావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సుబ్బారావు కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు సోమరాజు సీతారామారావు, పసుమర్తి విశ్వానందం,చెక్కిలాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

## వ్యవసాయ బావిలోపడి రైతు మృతి

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** కరీంనగర్ రూరల్ మండలంలోని చామన్‌పల్లి గ్రామ శివారులో వ్యవసాయ పనులు చేసుకుంటున్న ఓ రైతు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. కరీంనగర్ రూరల్ సిఐ ఎ.నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చామన్‌పల్లి గ్రామానికి చెందిన బొజ్జ అచ్చయ్య (55) తన వ్యవసాయ భూమిలోని బావి వద్ద వ్యవసాయ పనులు చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు జారి బావిలో పడిపోయాడు. ఈ క్రమంలో బావిలో ఉన్న రాళ్లపై పడడంతో తలకు, శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం నీటిలో పడిపోవడంతో మునిగిపోయారు. అచ్చయ్య సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు అతని కోసం వెతకగా బావి సమీపంలో అతని వస్తువులు ఫోన్ కనిపించాయి. దీంతో బావిలో పడిపోయి ఉండవచ్చనే అనుమానంతో బావిలో పరిశీలించగా నీటిలో అచ్చయ్య కనిపించాడు. వెంటనే అతడిని బావిలో నుంచి బయటకు తీసి చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య బొజ్జ రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పని చేయాలి

**ప్రజాపక్షం/బెజ్జంకి:** అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం పార్టీలు ప్రతిపక్ష దుషణలు దిజిచిప్పుకు ర్యాలీలతో ప్రజలను అయోమయానికి గురి చేయకుండా ప్రజా సమస్యలు అభివృద్ధిపై చర్చించాలని సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ అన్నారు.ఆదివారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ ప్రజలు తమ ఓట్లతో ప్రభుత్వాన్ని ఎన్నుకున్నది ప్రజా సంక్షేమం,అభివృద్ధి కోసమని అంతే అధికారం,ప్రతిపక్ష పార్టీలు వ్యక్తిగత దుషణలు చేసుకోవడానికి కాదని అన్నారు.వ్యక్తిగత దూషణలు రాజకీయ కక్ష సాధింపు చర్యలు భారత రాజ్యాంగ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తాయని అన్నారు.ఇప్పటికైనా పరస్పర దుషణలను దూరంగా ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం దృష్టి సారించాలని కోరారు.

## ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు 420 హామీలు ప్రజలకు ఇచ్చి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలను నెరవేరుస్తామని మోసపూరిత మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 1000 రోజులు గడుస్తున్న ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని సిరిసిల్ల పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు జిందం చక్రపాణి విమర్శించారు. ఆదివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని మూడవ వార్డులో ఇంటింటికి కాంగ్రెస్ బాకీ కార్డులను పంపకపు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజలకు బాకీ పడిన కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను తెలియపరచేలా ఇంటింటికి కాంగ్రెస్ ప్రభుత్వ బాకీ కార్డుల పంపిణీ చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు దూస రాజేశం, బండారి శివ, వేముల హరికృష్ణ, లక్ష్మీ నారాయణ, సయ్యద్ షౌకాత్, జిందం అనిల్, దూస ఈశ్వరి,చిలుక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో క్రిక్కిరిసిన భీమేశ్వరాలయం



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ భక్తులతో కిక్కిరిసిన భీమేశ్వరాలయం శ్రావణ మాసం ముగింపు దశకు చేరుకోవడం, ఆదివారం సెలవు దినం కావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ డిప్యూటీ ఇఒ ప్రతాప నవీన్ ఆలయంలో పర్యటించి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. క్యూలైన్లలో కలియదిరిగిన డిఇఒ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, కోడె మొక్కుల క్యూలైన్లు, ఉచిత దర్శనం, శీఘ్ర దర్శనం, అతి శీఘ్ర దర్శన మార్గాలను తనిఖీ చేశారు. ఆలయ ప్రాంగణంలో రద్దీ నియంత్రణ, భద్రతకు సంబంధించి ఎస్‌పిఎఫ్ సిబ్బంది, హోంగార్డులకు డిఇఒ పలు కీలక సూచనలు చేశారు. వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలతో వచ్చే భక్తులకు ప్రాధాన్యతనిస్తూ ఎలాంటి తోపులాటలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆలయ ఎఇఒ జయకుమారి, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ శివసాయి, రాజేందర్, నరేందర్, జూనియర్ అసిస్టెంట్ తిరుపతితో పాటు ఆలయ రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఎస్‌పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో 18న రైతు సదస్సు!

**ప్రజాపక్షం/గోదావరిఖని :** తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు ముదిమడుగుల మల్లన్న ఆధ్వర్యంలో ఈనెల 18న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెద్దపల్లి కమాన్ పొద్దులోని ఎం.బి.గార్డెన్స్‌లో రైతు సదస్సు నిర్వహించనున్నట్లు సమితి సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్కల్ దుర్గం నగేష్ తెలిపారు. సదస్సుకు ప్రొఫెసర్ కోదండరాం, జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్‌లు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు. రైతుల జీవితాలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయని, పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. 'భూమి సరుకు కాదు, అమ్మడం, కొనడం ఉండకూడదు' అనే నినాదంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, కార్మికులు, మేధావులు, విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు అందరూ హాజరై రైతు సదస్సును జయప్రదం చేయాలని, అందరికి మధ్యాహ్న భోజన వసతిని ఏర్పాటు చేసినట్లు నగేష్ తెలిపారు.

## నిర్మాణం పూర్తి..ప్రారంభం ఎప్పుడు?



**ప్రజాపక్షం/రామగుండం :** రామగుండం నగరపాలక 28వ డివిజన్ విలేజ్ రామగుండంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కన ఎన్‌టిపిసి సిఎస్ఆర్ నిధులు రూ.6 లక్షలతో తాగునీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మించి ఏడాది కావస్తున్నా నేటికి ప్రారంభం కాలేదు. గ్రామ ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడ్తున్నారు. వర్షకాలంలో కలుషిత నీటితో ఆరోగ్యాల బారిన పడ్తున్నారు. శుద్ధి చేసిన మంచినీటిని అందించాలని, వాటర్ ప్లాంట్‌ను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులను విలేజ్ రామగుండం గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# ఆర్యవైశ్యులకు ప్రభుత్వం అండ

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి :** ఆర్యవైశ్యుల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.ఆదివారం ధర్మపురి పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహ గార్డెన్స్‌లో నిర్వహించిన ధర్మపురి మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ధర్మపురిమండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సాయిని శ్రీనివాస్,పట్టణ అధ్యక్షుడిగా పిన్న శ్రీనివాస్ పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఎక్కడ ఉన్నా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు.ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన మాజీ ముఖ్యమంత్రి రోశయ్యకు కాంగ్రెస్ ఆర్థిక మంత్రి, ముఖ్యమంత్రి పదవులు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆర్యవైశ్యులు కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, ఆర్యవైశ్యుల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

# మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట

### చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం / రామడుగు :** రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తూ పెద్దపీట వేస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం అన్నారు. ఆదివారం మండలంలోని దేశరాజుపల్లి, రామడుగు మండల కేంద్రంలోన పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ కాపీలను, ఆడబిడ్డ తల్లిదండ్రులకు కల్యాణ లక్ష్మీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తొందరలోనే గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధితో రవాణా సౌకర్యాలు మెరుగుపడుతాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని మహిళల ఆర్థిక ఎదుగుదల కోసం స్వశక్తి సంఘాలను బలోపేతం చేస్తూ ప్రత్యేక రుణాలను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపిడిఒరాజేశ్వరి, తహసీల్దార్ రాజమల్లయ్య, ఎఎంసి చైర్మన్ బొమ్మరవేణి తిరుపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జవ్వాజి హరీష్, సింగిల్ విండో చైర్మన్ కోల రమేశ్, సర్పంచ్‌లు , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిండి సత్యం, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాడే శంకర్, పంజాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ ప్రజలను గాలికొదిలేసిన కెసిఆర్

### 22 ఎ పేరుతో పేదల భూములపై కాంగ్రెస్ కన్ను: ఎంపి రఘునందన్ రావు



**ప్రజాపక్షం/గజ్వేల్:** తెలంగాణ జాతిపిత, తొలి ముఖ్యమంత్రి అంటూ గొప్పలు చెప్పుకునే మాజీ సిఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్‌తన నియోజకవర్గాన్నే పట్టించుకోవడం లేదని మెదక్ ఎంపి రఘునందన్‌రావు మండిపడ్డారు. ఆదివారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండున్నరేళ్లుగా ఎమ్మెల్యేగా కొనసాగుతున్న కెసిఆర్ గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల్లో ఒక్కరోజు కూడా పాల్గొనలేదని, ప్రజా సమస్యలను పట్టించుకున్న దాఖలాలు లేవని ధ్వజమెత్తారు. ప్రతిపక్షంలో ఉన్నా కూడా ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధి నియోజకవర్గ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని అన్నారు. ఇక్కడి ప్రజల ఓట్లతో గెలిచి ప్రజలకు దూరంగా ఉండటం ఏ ప్రజాస్వామ్యానికి నిదర్శనమని ప్రశ్నించారు. రాష్ట్రంలో దాదాపు రూ.26 లక్షల కోట్ల విలువైన భూములు 22ఎ జాబితాలో చేరాయని, అందులో సుమారు రూ.లక్ష కోట్ల విలువైన పేదల భూములు ఉన్నట్లు ఆరోపించారు. ఐదు, పది గుంటల భూములు కలిగిన నిరుపేదల భూములను సైతం 22ఎలో చేర్చి వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. పేదల భూముల విషయంలో బిజెపి చూస్తూ ఊరుకోబోదని, అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యేలోపే 22ఎ భూముల వ్యవహారంపై సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# ధర్మపురి ఆలయ పునర్నిర్మాణం

### రూ.10 కోట్లు వ్యయం
### చారిత్రక ఘట్టం



**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం,దక్షిణ కాశీగా పేరుగాంచిన ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రంలో మరో చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుట్టనున్నారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన అనుబంధ దేవాలయం శ్రీ ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయించింది. సోమవారం తెల్లవారుజామున 2.58 నిమిషాలకు వేద పండితులు నిర్ణయించిన ముహూర్తంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శంకుస్థాపన నిర్వహించనున్నారు.ప్రముఖ స్తపతుల ఆధ్వర్యంలో ఆగమ శాస్త్ర ప్రకారం పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నారు. భవిష్యత్‌లో పెరుగునున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాన్ని తీర్చిదిద్దనున్నారు. ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణంతో క్షేత్రానికి మరింత శోభ చేకూరనుందని భక్తులు,అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శంకుస్థాపనకార్యక్రమానికి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరుకానున్నారు.

# జగిత్యాలను పచ్చని పట్టణంగా తీర్చిదిద్దుతాం

### ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల పట్టణాన్ని పచ్చదనం,పరిశుభ్రతతో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. వన మహోత్సవం సందర్భంగా జగిత్యాల పురపాలక సంఘం ఆధ్వర్యంలో 14వ వార్డులో నిర్వహించిన ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ఫిల్టర్ బెడ్ వద్ద రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రీన్ షెడ్‌కు శంకుస్థాపన చేసి, 15 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు.ప్రతి ఇంటి ముందు ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని ఎమ్మెల్యే సూచించారు. ధర్మసముద్రం వద్ద 15 లక్షల లీటర్ల సామర్థ్యంతో, కొత్త బస్టాండ్, ఎస్‌కెఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల, సరస్వతిగుట్ట ప్రాంతాల్లో 16 లక్షల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్,కమిషనర్ సత్య ప్రణవ్,డిసిసిఅధ్యక్షుడు గజంగి నందయ్య, కౌన్సిలర్లులు, నాయకులు,మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ప్రాంగణంలో ప్రభుత్వ విప్ కార్యాలయం

### వేద పండితుల మధ్య విప్ విజయరమణా రావుకు ప్రముఖుల శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా ని యామకమైన పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణ రావుకు ప్రభుత్వం తరుపున తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో అధికారిక కార్యాలయం కేటాయించడం జరిగింది.ఆ కార్యాలయం ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణ రావు వేద పండితులు మధ్య ఆదివారం రోజున మంత్రోత్సవాలతో ప్రారంభం చేయడం జరిగింది.ప్రభుత్వ విప్ కార్యాలయం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు , రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి , రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ , మనకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ,ఎమ్మెల్సీ తానిపత్రి భాను ప్రసాద్ రావు,పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు కి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఎఐటియుసి రాష్ట్ర మహాసభలకు తరలిన బెజ్జంకి కార్మికులు



**ప్రజాపక్షం/బెజ్జంకి:** ఎఐ టియుసి 4వ రాష్ట్ర మహసభలు కరీంనగర్ జిల్లాలో జరుగున్న సందర్భంగా ఆదివారం మండల కేంద్రం నుండి ఎఐటియు సికార్మికులు తరలివెళ్లగా సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ జె ండా ఊపి ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ ఈ మహసభ లో కార్మికుల హక్కులు,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల పై భవిష్యత కార్యచరణ రూపొందించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలోఎఐటియుసి జిల్లా సహయ కార్యదర్శి పండుగ పర్శరాములు,కుంబం రాములు,ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేని మహేష్,బోనగిరిశ్రావణ్,రాజు,శివ,తిరుపతి,కొమురయ్య,సమ్మయ్య,చంద్రయ్య,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆర్ఐ అడ్మిన్ కిరణ్ కుమార్ సస్పెన్షన్

### డ్యూటీల కేటాయింపులో నిర్లక్ష్యం..
### అవినీతి ఆరోపణల నేపథ్యంలో
### ఉన్నతాధికారుల చర్యలు



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ అడ్మిన్ కిరణ్ కుమార్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేయడం పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. సిబ్బందికి డ్యూటీల కేటాయింపు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు,విధుల కేటాయింపులో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఆయనపై వచ్చిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.గత కొంతకాలంగా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో సిబ్బందికి డ్యూటీల కేటాయింపు వ్యవహారంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.కొంతమంది సిబ్బందికి డ్యూటీలు కేటాయించకుండా ఇబ్బందులకు గురిచేశారనే ఆరోపణలు ఉండగా, మరికొందరి నుంచి డ్యూటీల కేటాయింపు పేరుతో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు కూడా తెరపైకి వచ్చినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై కొంతమంది సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి ఫిర్యాదులు తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఫిర్యాదుల నేపథ్యంలో ఉన్నతాధికారులు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని సంబంధిత వ్యవహారంపై విచారణ చేపట్టినట్లు సమాచారం. విచారణలో వచ్చిన అంశాలను పరిశీలించిన అనంతరం కిరణ్ కుమార్‌పై శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆర్ఐ అడ్మిన్ కిరణ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. డ్యూటీల కేటాయింపు విషయంలో పారదర్శకత పాటించాల్సిన బాధ్యత కలిగిన అధికారిపై అవినీతి ఆరోపణలు రావడం, వాటిపై విచారణ అనంతరం సస్పెన్షన్ చర్యలు తీసుకోవడం జగిత్యాల జిల్లా పోలీస్ శాఖలో చర్చకు దారితీసింది. అయితే, కిరణ్ కుమార్‌పై వచ్చిన ఆరోపణలపై పూర్తిస్థాయి శాఖాపరమైన విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఉన్నతాధికారుల చర్యలతో పోలీస్ సిబ్బందిలో డ్యూటీల కేటాయింపు, పరిపాలనా వ్యవహారాల్లో పారదర్శకతపై మరోసారి చర్చ మొదలైంది.

# నాడు మోసం.. నేడు మొసలి కన్నీరా ?

### అసెంబ్లీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగులు, విద్యార్థులను పట్టించుకోకుండా నాడు మోసం చేసి నేడు మొసలి కన్నీరు కారుస్తున్నారని బిఆర్ఎస్‌ని ప్రజలు ఎప్పుడో భర్తరఫ్ చేశారని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వెలిచాల రాజేందర్ రావు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కరీంనగర్‌లో బిఆర్ఎస్ నిర్వహించిన యువ సమరభేరి సభ అట్టర్‌ఫ్లాప్ అయిందని , యువత బిఆర్ఎస్ ను ఎప్పుడో తిరస్కరించారని విమర్శించారు. ఆదివారం మీడియాతో రాజేందర్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే నైతిక అర్హత కెటిఆర్‌కు లేదన్నారు. రేవంత్ రెడ్డి ఎవరి వారసత్వంతోనో రాజకీయాల్లోకి వచ్చి పదవులు పొందిన నాయకుడు కాదని జెడ్‌పిటిసి స్థాయి నుంచి స్వయం కృషి, పట్టుదల, కమిట్‌మెంట్‌తో ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన నేత అని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి కాళ్ల కోటికి కూడా కెటిఆర్ సరిపోరని పిచ్చిపిచ్చి వేషాలు వేస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని మరోసారి రేవంత్‌రెడ్డినివిమర్శిస్తేచూస్తూఊరుకునేదీలేదనిహెచ్చరించారు.

### దమ్ముంటే కెసిఆర్‌తో రాజీనామా చేయించాలి

కెటిఆర్‌కు నిజంగా దమ్ముంటే తన తండ్రి కెసిఆర్‌తో ప్రతిపక్ష నేత పదవికీ రాజీనామా చేయించాలని రాజేందర్ రావు సవాల్ విసిరారు. ఆ పదవిని బిసి లేదా ఎస్‌సిఎమ్మెల్యేకు ఇవ్వాలని ఆ సాహసం చేసే దమ్ముందా కెటిఆర్ సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చురుగ్గా పోరాడాల్సిన ప్రతిపక్ష నేత కెసిఆర్ సభకు సరిగా హాజరు కాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమవుతున్నారని విమర్శించారు. ప్రజల కోసం పనిచేసే బిసి, ఎస్‌సి ఎమ్మెల్యేలకు ఆ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు దాదాపు కోటి 20 లక్షల వేతనం తీసుకొని ఫామ్ హౌస్‌లో పడుకున్నారని మండిపడ్డారు. అసెంబ్లీకి రాకుండా ఫామ్ హౌస్‌కే పరిమితమయిన నేతగా కెసిఆర్ రికార్డు సృష్టించారని ఎద్దేవా చేశారు. కెసిఆర్ తన తండ్రి కెసిఆర్ పేరు చెప్పుకొని రాజకీయాల్లోకి వచ్చారని తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేసిన నాయకులను పక్కన పెట్టి కుటుంబానికి, అనుచరులకు పెద్దపీట వేసిన చరిత్ర బిఆర్ఎస్‌దేనని విమర్శించారు.

### నిరుద్యోగుల విషయంలో కెటిఆర్ సమాధానం చెప్పాలి

బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో నిరుద్యోగులు, విద్యార్థులు ఎదుర్కొన్న సమస్యలకు కెటిఆర్ ముందుగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీలు, నిరుద్యోగ భృతి, ఉద్యోగ నియామకాలు, 317 జివో, స్వయం ఉపాధి పథకాలపై యువతకు కెటిఆర్ ఏంసమాధానం చెబుతారని ప్రశ్నించారు.

### 70 వేల ఉద్యోగాలు కనిపించడం లేదా..?

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 70 వేల ప్రభుతఉవ ఉద్యోగాలను భర్తీ చేసిందని రాజేందర్ రావు పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు.

# దళిత విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దు

### ఫీజులు చెల్లించకుంటే చలో కలెక్టరేట్, చలో ప్రజాభవన్



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ ఫీజు బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించి,నిరుపేద దళిత విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య,జిల్లా ఉపాధ్యక్షుడు,సుద్దల మాజీ ఎంపిటిసి సంకనపల్లి లక్ష్మయ్య, ఆదిజంబవ అరుంధతీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి పాపయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో దివంగత మర్రి చెన్నారెడ్డి హయాంలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఎంతోమంది దళిత విద్యార్థులు కార్పొరేట్ స్థాయి విద్యనభ్యసించి ఐఎఎస్,ఐపిఎస్, ఇంజనీర్లుగా ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని గుర్తుచేశారు.ఈ పథకం కింద డేస్కాలర్ విద్యార్థులకు ఏటా రూ,28 వేలు,5వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు విద్య,హాస్టల్ సదుపాయాలతో కలిపి రూ.48 వేల చొప్పున ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. తీవ్ర మనస్తాపానికి గురైన ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఇకపై తమ వల్ల కాదంటూ విద్యార్థులను పంపవద్దని జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించే దుస్థితి దాపురించిందని ధ్వజమెత్తారు. బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించామని చెప్తున్న ప్రభుత్వం,ఎస్‌సి సంక్షేమ శాఖకు చెందిన నిధుల నుండి బెస్ట్ అవైలబుల్ పథకానికి తక్షణమే బకాయిలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర ఎస్‌సిసంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి అసెంబ్లీ వేదికగా లేదా ప్రత్యేక బడ్జెట్ ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. రాబోయే 15 రోజుల్లోగా ఫీజు బకాయిలు చెల్లించకపోతే ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం,ఆదిజంబవ,అరుంధతీ సంఘాలు, దళిత ఐక్య వేదికల ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. మొదటి విడత గా చలో కలెక్టరేట్ ఆ తర్వాత చలో ధర్మపురి అనంతరం చలో ప్రజాభవన్ కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

### శాసనసభల్లోనే కాదు..

# ప్రభుత్వరంగ సంస్థల్లోనూ మహిళల వాటా ఏదీ?

**న్యూఢిల్లీ :** మహిళలకు సరైనా వాటా కల్పించే విషయంలో అన్ని ప్రభుత్వాలు మాటలకే పరిమితం అవుతున్నాయి. ప్రజాప్రతినిధుల 'మహిళా శ్రేయస్సు' నినాదం 'మాటలగారడీని' తలపిస్తోంది. శాసనసభల్లో మహిళలకు మూడవ వంతు కోటాను అమలు చేయడంలో జాప్యంపై రాజకీయ నిందారోపణలు కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వరంగ సంస్థలలో మహిళా ఉద్యోగుల నిష్పత్తి అత్యంత తక్కువగా ఉండటం అనే మరో అడ్డంకి చెక్కుచెదరకుండా ఉందని నిపుణులు, విధానరూపకర్తలు విచారం వ్యక్తం చేస్తున్నారు. అందుబాటులో ఉన్న తాజా ప్రభుత్వ గణాంకాల ప్రకారం, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ (సిపిఎస్ఇ)లలో శ్రామిక శక్తిలో మహిళల వాటా 10శాతం కంటే తక్కువగా ఉంది. అయితే, బాధాకరమైన విషయం ఏమిటంటే ప్రతీ 10మందిలో ఒక్కరు కూడా పర్యవేక్షక స్థాయికి చేరుకోలేకపోతున్నారు. తగినంత ప్రాతినిథ్యానికి ఇంకా చాలా దూరంలో ఉన్నప్పటికీ, ప్రైవేట్ రంగంలో దాదాపు 4వ వంతు మహిళలు నిర్వాహక పదవులను కలిగి ఉన్నారు. వివిధ సర్వేల ప్రకారం ప్రవేశస్థాయి ఉద్యోగాల విషయానికి వస్తే వారి నిష్పత్తి సుమారు మూడవ వంతుకు పెరుగుతోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, దేశంలో మొత్తం



మీద కార్మికశక్తి భాగస్వామ్య రేటు (ఎల్ఎఫ్పిఆర్) 34శాతానికి పైగా ఉంది. అయితే, ఇది 2024–25 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 40శాతం పడిపోయింది. తాజాగా ప్రభుత్వ రంగసంస్థల సర్వే ప్రకారం, 2024–25 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలోని మొత్తం ఉద్యోగులలో మహిళల వాటా 9.8శాతంగా ఉంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 77,625గా ఉన్న ఈ సంఖ్య 2024–25 ఆర్థిక సంవత్సరంలో 76,685కు తగ్గింది. గత కొన్ని సంవత్సరాలుగా ఈ సంఖ్య 10శాతం కంటే తక్కువగానే ఉంది. ప్రభుత్వం విడుదల చేసిన సర్వే ప్రకారం, సిపిఎస్ఇలలోని మొత్తం మహిళల్లో 32.4 శాతం మంది మేనేజీరియల్ /ఎగ్జిక్యూటివ్ స్థా యిలో ఉండగా, కేవలం 8.7 శాతం మం ది మాత్రమే పర్యవేక్షక స్థాయిలో 58.9 శాతం మంది కార్మిక వర్గాలలో ఉన్నారు. పర్యవేక్షక స్థాయిలో మహిళల ప్రాతినిథ్యం 2022–23లో 10.08 శాతం నుంచి 2023–24నాటికి 9శాతానికి పడిపోయింది. ప్రభుత్వరంగ సంస్థలలో మహిళల ప్రాతినిథ్యం తక్కువగా ఉండటం ఒక సమస్య అని వైఎస్ఆర్సిపి ఎంపి డాక్టర్ గుమ్మ తనూజ రాణి అన్నారు. ముఖ్యంగా పార్లమెంట్, శాసనసభలలో మహిళల ప్రాతినిథ్యంపై రాజకీయ చర్చ కొనసాగుతోన్న తరుణంలో ఇది ఆందోళన కలిగిస్తోంది. ఈ దేశంలో మహిళలు పార్లమెంట్లో సీటు కోసం, పనిప్రదేశంలో తమ గళం వినిపించడం కోసం చాలాకాలంగా ఎదురు చూస్తున్నారు' అని తనూజ రాణి 'పిటిఐ'కి చెప్పారు. రాష్ట్ర శాసనసభలలో మ హిళలకు 33శాతం రిజర్వేషన్ అమలు చేయడ ంలో జాప్యంపై ప్రభుత్వం, ప్రతిపక్షాలు పరస్పరం నిందలు వేసుకుంటున్నాయి. లోక్సభలో మహిళల ప్రాతినిథ్యం మొదటి లోక్సభలో 10శాతం ఉండగా, ప్రస్తుత లోక్సభలో అది 15శాతానికి పెరిగింది. అంతేకాకుండా, ఏ రాష్ట్ర శాసనసభలోనూ మహిళల ప్రాతినిథ్యం 20శాతానికి మించలేకపోవడం గమనార్హం. హిమాచల్ప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాలలో కేవలం ఒకే ఒక్క శాసనసభ్యురాలు ఉండటం ఆశ్చర్యపోయే విషయం.'అసలైన దిగ్భ్రాంతికరమైన విషయం మన సొంత ప్రభుత్వరంగంలోనే ఉంది. అక్కడ మహిళల వాటా 10శాతం కంటే తక్కువగా ఉంది. పర్యవేక్షక పదవుల్లో గత పదేళ్లుగా ఈ సంఖ్యలో ఎలాంటి మార్పులేదు. హక్కుల కార్యకర్త రంజనా కుమారి 'పిటిఐ'తో మాట్లాడుతూ సిపిఎస్ఇలలో మహిళల తక్కువ ప్రాతినిథ్యాన్ని , విస్తృత ఆర్థిక వ్యవస్థలో మహిళలు చేస్తున్న ఉద్యోగా ల పరిపక్వతతోపాటుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు. ట్రాన్స్ఫార్మర్ రూరల్ ఇండియా (టిఆర్ఐ) లో లింగ నిపుణురాలైన డాక్టర్ సీమా భాస్కరన్ మాట్లాడుతూ, భారతదేశంలోని పితృస్వామ్య వ్యవస్థ బాలికలు, మహిళలకు నాణ్యమైన, సాంకేతిక విద్యకు పరిమిత ప్రాప్యత, వృత్తి పరమైన పురోగతి లేకపోవడం, కుటుంబ సభ్యులపై ఆర్థిక, భావోద్వేగ ఆధారపడటం, అలాగే ప్రస్తుత సామాజిక నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలనే సామాజికి ఒత్తిడి వంటి నిర్మాణాత్మక అడ్డంకులను సృష్టిస్తుందని పేర్కొన్నారు.

# కల్తీ మద్యం కలకలం

**● మధ్యప్రదేశ్లోని సాగర్ జిల్లాలో 11 మంది మృతి**

**సాగర్:** మధ్యప్రదేశ్లో కల్తీమద్యం కలకలక రేపింది. సాగర్ జిల్లాలో కల్తీ మద్యం సేవించి పది మంది మత్యువాత పడ్డారు. మరికొందరు అస్వస్థతకు గురయ్యారు. అయితే, స్థానిక బిజెపి ఎమ్మెల్యే మాత్రం కల్తీ మద్యం సేవించడం వల్ల 11 మంది మరణించారని తెలిపారు. మద్యం తయారీ, అమ్మకం, వినియోగంపై



నిషేధం ఉన్న 'డ్రై స్టేట్' (మద్యపాన నిషేధిత రాష్ట్రం) అయిన గుజరాత్లోని భావ్నగర్ జిల్లాలో గత నెలలో కల్తీ మద్యం సేవించి 13 మంది మరణించిన ఘటన తర్వాత మధ్యప్రదేశ్లో ఈ విషాదం చోటుచేసుకుంది. జిల్లా కేంద్రానికి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న బండా తహసీల్లోని రెండు గ్రామాల్లో అక్రమ కల్తీ మద్యం సేవించి పది మంది మరణించారని అని ప్రభావిత ప్రాంతాలను సందర్శిస్తున్న సాగర్ కలెక్టర్ ప్రతిభా పాల్ పిటిఐతో ఫోన్లో చెప్పారు. అస్వస్థతకు గురైన వారి సంఖ్య గురించి అడిగినప్పుడు, ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం తనిఖీలు (స్క్రీనింగ్) జరుగుతున్నాయని, జ్వరం, తలనొప్పితో బాధపడుతున్న వారిని ప్రభుత్వ ఆధ్వర్యంలోని బుందేల్ఖండ్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ (బిఎంసిహెచ్)కు తరలిస్తున్నామని తెలిపారు. అలాంటి ముగ్గురు వ్యక్తులను బిఎంసిహెచ్కు పంపారు. వారిలో ఎవరి పరిస్థితి కూడా విషమంగా లేదు అని ఆ అధికారి పేర్కొన్నారు. బండా బిజెపి ఎమ్మెల్యే వీరేంద్ర లోధిని సంప్రదించగా, 'నాకు తెలిసినంత వరకు, కల్తీ మద్యం సేవించి 11 మంది మరణించారు. మెరుగైన వైద్యం కోసం సుమారు 25 మందిని బండా సివిల్ ఆసుపత్రి నుండి ఇతర ఆసుపత్రులకు తరలించారు' అని చెప్పారు. ఆదివారం తెల్లవారుజామున మొదటి మరణం నమోదైందని పాల్ తెలిపారు. ప్రాథమిక పోస్ట్మార్టం నివేదికలు ఇంకా అందలేదని ఆమె పేర్కొన్నారు.

# 2029 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశమే లక్ష్యం

**కేంద్ర హోంమంత్రి అమిత్ షా**

**పనాజి:** డ్రగ్స్ రహిత భారత్తోనే 'వికసిత్ భారత్' కల సాకరమవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. 2029 నాటికి దేశాన్ని పూర్తిగా డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కేంద్రం స్పష్టమైన రోడ్ మ్యాప్ను సిద్ధం చేసిందని వెల్లడించారు. గోవా పర్యటనలో భాగంగా ఆ రాష్ట్ర సిఎం ప్రమోద్ సావంత్తో అమిత్ షా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడిన అమిత్ షా, నక్సలిజాన్ని దేశం నుంచి ఏ విధంగా నిర్మూలించామో, అదే రీతిలో మత్తుపదార్థాల ముప్పును కూడా పూర్తిగా తుడిచిపెడతామన్నారు. '2047 నాటికి మాదకద్రవ్యాలు లేని యువశక్తి వికసిత్ భారత్ను ముందుకు నడిపించాలనేది ప్రధాని మోదీ లక్ష్యం. 2014 కంటే ముందు, నార్కోటిక్స్ (మాదక ద్రవ్యాల)పై పోరాటం చాలా



వరకు చిన్న చిన్న విభాగాలుగా, ఒంటరిగానే సాగింది. అప్పట్లో ఏజెన్సీలు చిన్న చిన్న నిందితులను పట్టుకోవడంతోనే సరిపెట్టుకునేవి. కానీ మా ప్రభుత్వం ఈ పోరాటాన్ని జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశంగా తీసుకుంది' అని అమిత్ షా అన్నారు.

**పక్కా ప్లాన్తో డ్రగ్స్ నివారణ**

2029 నాటికి మాదకద్రవ్య రహిత భారతే మా లక్ష్యం. అందుకే డ్రగ్స్ అక్రమ రవాణా, నిధుల సమీకరణ నుంచి పునరావాసం వరకు మొత్తం మాదక ద్రవ్యాల నెట్వర్క్ను నిర్మూలించడానికి కేంద్రం ఒక పక్కా వ్యూహాన్ని అవలంబిస్తోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక మాదక ద్రవ్యాల నిరోధక టాస్క్ఫోర్స్లను (ఎఎన్టిఎఫ్) ఏర్పాటు చేశాం. స్థానిక పోలీసులను జాతీయ వ్యూహంతో అనుసంధానించాం. అంతే కాదు మాదక ద్రవ్యాల నియంత్రణ బ్యూరో కేడర్ను పునర్వ్యవస్థీకరించి, దాని సిబ్బందిని, కార్యాచరణ సామర్థ్యాలను పెంచడం ద్వారా బలోపేతం చేశామని అమిత్ షా చెప్పారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్ముకశ్మీర్లో వేర్పాటువాద భావనలు తగ్గాయని ఆయన అన్నారు. దేశ అంతర్గత భద్రతను మరింత మెరుగుపర్చడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

**నక్సలిజం ఇప్పుడు గతమైపోయింది!**

ఐదు దశాబ్దాలుగా దేశాన్ని పీడించిన నక్సలిజం ఇప్పుడు గతంగా మారిపోయిందని అమిత్ షా అన్నారు. 'తిరుపతి నుంచి పశుపతినాథ్ వరకు రెడ్ (మావోయిస్టు) కారిడార్' నిర్మించాలని కలలు కన్నవారు, నేడు ఆయుధాలు వీడి ప్రధాన స్రవంతిలో చేరారు. ఈశాన్య రాష్ట్రాలు కూడా ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నాయి. అక్కడ 11వేల మందికి పైగా యువకులు ఆయుధాలు విడిచిపెట్టారు. మేము కన్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. మాదక ద్రవ్యాల ముప్పును కూడా అదే పద్ధతిలో ఎదుర్కొంటాం' అని అమిత్ షా చెప్పుకొచ్చారు.

# జార్ఖండ్ మంత్రి సుదివ్య హఠాన్మరణం

**రాంచీ:** జార్ఖండ్ ప్రభుత్వంలో విషాద ఛాయలు అలముకున్నాయి. రాష్ట్ర ఉన్నత, సాంకేతిక విద్యాశాఖ మంత్రి సుదివ్య కుమార్ (56) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. తన స్వస్థలమైన గిరిడిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో చేరగా, ఉదయం 4 గంటల సమయంలో వైద్యులు ఆయన మరణాన్ని ధృవీకరించారని అధికారులు పేర్కొన్నారు. జెఎంఎం శాసనసభ్యుడైన సుదివ్య పట్టణాభివృద్ధి, పర్యాటకం, కళలు, సంస్కృతి, క్రీడలు, యువజన వ్యవహారాల శాఖల బాధ్యతలను కూడా నిర్వహించారు. ఆయనకు భార్య శ్వేతా శర్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్కు అత్యంత సన్నిహితుడైన ఆయన, జెఎంఎం నేతృత్వంలోని ప్రభుత్వం ఎదుర్కొన్న అనేక రాజకీయ



సంక్షోభాలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించారు. ఇందులో గత నెలలో రాంచీలో జరిగిన విద్యార్థుల నిరసనలు కూడా ఉన్నాయి. కుమార్ మరణం పట్ల ముఖ్యమంత్రి సోరెన్, అసెంబ్లీ స్పీకర్ రవీంద్ర నాథ్ మహతో, కాంగ్రెస్ నాయకుడు రాజేష్ ఠాకూర్ సంతాపం తెలిపారు. 'సోను భయ్యా మరణం నా జీవితంలో మాటల్లో చెప్పలేని శూన్యతను మిగిల్చింది' అని ముఖ్యమంత్రి సోషల్ మీడియా పోస్ట్లో పేర్కొన్నారు. కుమార్ కేవలం ఒక సీనియర్ సహచరుడు లేదా రాజకీయ మిత్రుడు మాత్రమే కాదని, ప్రతి కష్ట సమయంలోనూ ఆప్యాయతతో, మార్గదర్శకత్వంతో నా పక్కనే నిలిచిన అన్నయ్య లాంటి వారని ఆయన అన్నారు. సుదివ్య కుమార్ అకాల మరణం పట్ల జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) కుటుంబం దిగ్భ్రాంతికి, తీవ్ర వేదనకు గురైంది అని పార్టీ సోషల్ మీడియా పోస్ట్లో పేర్కొంది. కుమార్ 2019లో గిరిడిహ్ నియోజకవర్గం నుంచి తొలిసారిగా జార్ఖండ్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2014లో భూ కుంభకోణం, మనీలాండరింగ్ ఆరోపణలకు సంబంధించి ముఖ్యమంత్రి అరెస్టు తర్వాత తలెత్తిన సంక్షోభాన్ని చక్కదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. గత నెలలో రాష్ట్రంలో జరిగిన విద్యార్థుల ఆందోళన సమయంలో కూడా ఆయన ప్రముఖ పాత్ర పోషించారు. నిరసనకారులతో పలు దఫాలుగా చర్చలు జరిపిన ప్యానెల్కు ఆయన నేతృత్వం వహించారు. రాష్ట్రంలో పర్యాటక మౌలిక సదుపాయాల నిర్వహణను మెరుగుపరిచే మార్గాలను అన్వేషించడానికి జార్ఖండ్ ప్రభుత్వ ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించిన ఆయన, ఈ వారం కర్ణాటక నుంచి తిరిగి వచ్చారు. ఈ పర్యటన సందర్భంగా, ఆయన కర్ణాటక పర్యాటక శాఖ మంత్రి కె.జె. జార్జ్ను కలిసి, పర్యాటకం, అటవీ నిర్వహణ రంగాలలో ఇరు రాష్ట్రాల మధ్య సహకారంపై చర్చించారు.

### జెన్ జీ ఉద్యమం

# రాజకీయ పార్టీలు హైజాక్

**బిఎస్పి అధినేత్రి మాయావతి**

**లక్నో :** జెన్ జీ యువత, నిరుద్యోగుల సమస్యలపై కేంద్రీకృతమైన ఉద్యమాలను రాజకీయ పార్టీలు హైజాక్ చేస్తున్నాయని బిఎస్పి అధినేత్రి మాయావతి అన్నారు. ఇది యువత, విద్యార్థులలో తీవ్ర అనుమానాలను రేకెత్తించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె ఎక్స్లో పోస్టు చేస్తూ యువత, విద్యార్థులు, నిరుద్యోగుల తీవ్ర సమస్యలకు సంబంధించి సిజెపి చేపట్టిన జెన్ జీ ఉద్యమం స్వతంత్రంగా ఉండకుండా, క్రమంగా రాజకీయమయం అవుతోందన్న నమ్మకానికి దేశంలో అనేక ఉదాహరణలు ఉన్నాయన్నారు. జంతర్ మంతర్ ఉద్యమ సమయంలో గొప్ప కలలు చూసిన యువత, విద్యార్థులు ఇప్పుడు తీవ్ర అనుమానాలను ఎదుర్కొంటున్నారని, ఎందుకంటే వివిధ రాజకీయ పార్టీలు అటువంటి ఉద్యమాలను తమ చేతుల్లోకి తీసుకున్నాయని ఆమె ఆరోపించారు. అయితే, జెన్జీ జెన్ ఆల్ఫా యువత న్యాయబద్ధమైన డిమాండ్ల పట్ల బిఎస్పి ఎల్లప్పుడూ సానుభూతితో, ఆందోళనతో ఉందని మాయావతి అన్నారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలకు శాంతియుత పరిష్కారం లభించేలా సహాయం చేయడానికి సిద్ధంగా ఉండాలని, తమతమ రాష్ట్రాలు, ప్రాంతాల్లోని సంబంధిత అధికారులను కలవాలని అన్ని బిఎస్పి రాష్ట్ర విభాగాలకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. అదే సమయంలో, పార్టీ క్రమశిక్షణకు అనుగుణంగా బిఎస్పి కార్యకర్తలు ధర్నాలు, ప్రదర్శనలు లేదా ఆందోళనలలో పాల్గొనకూడదని, బదులుగా



తమ శారీరక, మానసిక, ఆర్థిక బలాన్ని, శక్తిని ఎన్నికల కోసం కాపాడుకోవాలని మాయావతి అన్నారు. 'సర్వజన హితాయ్, సర్వజన సుఖాయ్ (అందరికీ సంక్షేమం, సంతోషం)' అనే సూత్రం ఆధారంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, జెన్ జీ జెన్ఆల్ఫా, సమాజంలోని అన్ని వర్గాల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు అందించడమే బిఎస్పి లక్ష్యమని ఆమె అన్నారు. ఉత్తరప్రదేశ్లో తమ నాలుగు పర్యాయాల అధికార కాలంలో పార్టీ దీనిని నిరూపించిందని బిఎస్పి అధినేత్రి పేర్కొన్నారు. జంతర్ మంతర్ వద్ద జెన్ జీ ఉద్యమం సందర్భంగా సంజయ్ ఆజాద్పై జరిగిన దాడిని ప్రస్తావిస్తూ, పోలీసులు సకాలంలో సరైన చర్యలు తీసుకుని ఉంటే ఈ తీవ్రమైన సంఘటనను నివారించగలిగేదని మాయావతి అన్నారు. ఈ కేసులో నిందితులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అవసరమైతే ఇటువంటి విషయాలలో గళం విప్పడంలో బిఎస్పి వెనుకాడదని అన్నారు.

# ఢిల్లీలో కూలిన ఐదంతస్తుల భవనం

**● ముగ్గురు మృతి, ఐదుగురి పరిస్థితి విషమం**
**● శిథిలాల కింద పలువురు బాధితులు**

**న్యూఢిల్లీ/కాన్పూర్/బుదౌన్ :** దేశ రాజధాని ఢిల్లీ, పొరుగున ఉన్న ఉత్తరప్రదేశ్లో ఓ భవనం, ఇల్లు కుప్పకూలాయి. ఈ రెండు ఘటనల్లో మొత్తం తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు శిథిలాల కింద చిక్కుకుపోయారు. దక్షిణ ఢిల్లీలోని సత్య నికేతన్ ప్రాంతంలో బాలుర పిజి ఉన్న ఓ ఐదు అంతస్తుల భవనం ఆదివారం మధ్యాహ్నం కూలిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గుకు విద్యార్థులు మృతి చెందగా, పలువురు భవన శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాంతం ఢిల్లీ విశ్వవిద్యాలయం సౌత్ క్యాంపస్కు సమీపంలో ఉంది. ఇక్కడ విద్యార్థుల హాస్టళ్లు, భోజనశాలలతో రద్దీగా ఉండే సందులు ఉన్నాయి. ఈ భవనం దాదాపు 20 ఏళ్ల నాటిదని, మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగినప్పుడు బేస్మెంట్లో నిర్మాణ పనులు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. ప్రమాదం అనంతరం సహాయక సిబ్బంది శిథిలాల నుంచి 8 మందిని వెలికి తీసి ఆసుపత్రికి తరలించగా, అందులో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని, ఎయిమ్స్ వర్గాలు తెలిపాయి. స్థానిక పోలీసు సిబ్బంది, అగ్నిమాపక దళం, క్యాట్ అంబులెన్స్, ఇతర అత్యవసర సేవల బృందాలు ఘటనా స్థలంలో ముమ్మరంగా చర్యలు చేపట్టాయి. ఎన్డిఆర్ఎఫ్ బృందం కూడా చేరుకుందని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఒక పోలీసు అధికారి తెలిపారు. నానక్పురా గురుద్వారా సమీపంలో భవనం కూలిపోయినట్లు మధ్యాహ్నం 1.34 గంటలకు సౌత్ క్యాంపస్ పోలీస్ స్టేషన్కు పిసిఆర్ కాల్ అందిందని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. శిథిలాల్లో చిక్కుకున్న/గాయపడిన వారి కచ్చితమైన సంఖ్య ప్రస్తుతం తెలియదని, ఇప్పటివరకు కొంతమందిని రక్షించారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. భవనం యజమానిని గుర్తించి, అతని ఆచూకీ కనుగొనేందుకు బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. అధికారుల ప్రకారం, కూలిపోయిన భవనాన్ని 'హాస్టల్ డేజ్' అని పిలుస్తారు. ఘటనా స్థలంలోని ప్రత్యక్ష సాక్షుల అంచనా ప్రకారం, శిథిలాల కింద 20 మందికి పైగా చిక్కుకుని ఉండవచ్చు, కానీ ఈ సంఖ్య ఇంకా అధికారికంగా ధృవీకరించబడలేదు.



### ఉత్తరప్రదేశ్లోనూ ఘటన

ఉత్తరప్రదేశ్లోని కాన్పూర్ జిల్లాలో ఆదివారం కురిసిన వర్షాలకు ఒక ఇల్లు కూలిపోవడంతో, ఒక వ్యక్తి, అతని ముగ్గురు మైనర్ కు మార్తెలు మరణించగా, మరో కుమార్తె తీవ్రంగా గాయపడ్డారని పో లీసులు తెలిపారు. బుదౌన్ జిల్లాలో రాత్రి కురిసిన భారీ వర్షాలకు ఇంటి గోడ కూలిపోవడంతో, శిథిలాల కింద చిక్కుకున్న ఒక రైతు అక్కడికక్కడే మరణించగా, అతని భార్య తీవ్రంగా గాయపడ్డారని వారు పేర్కొన్నారు.దయం మట్టి గోడ కూలి పడటంతో ఆరేళ్ల బాలిక మరణించిందని పోలీసులు తెలిపారు. కాన్పూర్ పోలీస్ కమిషనర్ రఘుబీర్ లాల్ పిటిఐతో మాట్లాడుతూ, హిర్ని గ్రామంలో ఉదయం 11 గంటల సమయంలో ఒక 'కచ్చా' (మట్టి/తాత్కాలిక) ఇల్లు కూలిపోవడంతో ఒక కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులు శిథిలాల కింద చిక్కుకుపోయారని చెప్పారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు ఆ కుటుంబ సభ్యులను రక్షించి పటారాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్సి)కు తరలించగా, అక్కడ నలుగురు మరణించినట్లు నిర్ధారించారు. మరణించిన వారిని ముఖేష్ కుమార్, అతని కుమార్తెలు మాయ (17), నీతూ (ఏడు), పల్లవి (ఐదు)గా గుర్తించారు. కుమార్ మరో



కుమార్తె కాజల్ ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి కాన్పూర్లోని లాలా లజపత్ రాయ్ ఆసుపత్రి (ఎల్ఎల్ఆర్)లో చికిత్స పొందుతోందని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలానికి రక్షణ పరికరాలతో కూడిన మూడు అగ్నిమాపక వాహనాలు, విపత్తు నిర్వహణ వాహనాన్ని పంపారు. ఆ 'కచ్చా' ఇంటి ముందు భాగం పూర్తిగా ధ్వంసమవ్వగా, వెనుక భాగంలో ఉన్న గది వంటి నిర్మాణం పాక్షికంగా దెబ్బతిన్నదని పోలీసులు పేర్కొన్నారు. ఇల్లు కూలిన తర్వాత కుటుంబ సభ్యులు సాద్ పోలీస్ స్టేషన్కు పదేపదే ఫోన్ చేసినప్పటికీ, మొదట్లో ఎవరూ స్పందించలేదని, ఇది పోలీసుల నిర్లక్ష్యమేనని కుమార్ బంధువు తేజ్ బహదూర్ సింగ్ ఆరోపించారు. బాధితులను పటారా సిహెచ్సికి తీసుకెళ్లినప్పుడు అక్కడ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో చికిత్స ఆలస్యమైందని కూడా ఆ కుటుంబం ఆరోపించింది. ఈ లోపాలపై నిష్పాక్షిక విచారణ జరపాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# మణిపూర్లో ఇద్దరు మిలిటెంట్లు హతం

**ఇంఫాల్/చురన్చాంద్పూర్:** మణిపూర్లోని చురన్చాంద్పూర్ జిల్లాలో ఆర్మీ, అస్సాం రైఫిల్స్ జరిపిన సంయుక్త కాల్పుల్లో ఇద్దరు యుకెఎన్ఎ మిలిటెంట్లు మరణించగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. నిఘా సమాచారం ఆధారంగా భద్రతా బలగాలు ఆగస్టు 29న రాత్రి హెంగ్లెప్ సబ్ డివిజన్లోని ఫైబాంగ్ గ్రామంలో ఆపరేషన్ నిర్వహించాయని వారు పేర్కొన్నారు. భద్రతా బలగాలు సెప్టెంబరు 2న తెల్లవారుజామున 5 గంటలకు యుకెఎన్ఎ క్యాంప్ను చుట్టుముట్టాయన్నారు. యుకెఎన్ఎ మిలిటెంట్లు విచక్షణారహితంగా కాల్పులు జరిపారని, తాము జరిపిన ప్రతి దాడుల్లో ఇద్దరు మిలిటెంట్లు హతమయ్యారని, మరో ఇద్దరు గాయపడ్డట్లు అస్సాం రైఫిల్స్ శనివారం తమ సోషల్మీడియా ఖాతాలో పోస్ట్ చేసింది. అనంతరం ఘటన స్థలంలో జరిపిన సోదాల్లో రెండు ఎంఎ రైఫిల్స్, ఎకె 56 రైఫిల్, ఒక లాథోడ్ గన్, ఏడు లాథోడ్ గ్రనేడ్లు, 15 ఎకె మ్యాగజైన్లు, 371 ఎకె–56 రౌండ్లు, 601 ఎంఎ రైఫిల్ రౌండ్స్, 172 ఎస్ఎల్ఆర్ రౌండ్లు, 15 కాంబాట్ యూనిఫాంలు, ఏడు సంచులు మందుగుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్నట్లు అస్సాం రైఫిల్స్ తెలిపింది.

# 17 నగరాల్లో 4 వేల టన్నుల బఫర్ ఉల్లిగడ్డ విక్రయం

**న్యూఢిల్లీ:** వంటింటి రారాజు అయిన ఉల్లిగడ్డ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అయితే ధరలను అరికట్టే లక్ష్యంతో చేపట్టిన రాయితీ అమ్మకాల మొదటి పది రోజుల్లోనే, 17 నగరాల్లో సుమారు 4,000 టన్నుల బఫర్ ఉల్లిపాయలను ప్రభుత్వం విక్రయించిందని వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే ఆదివారం తెలిపారు. కేంద్రం, తన ఏజెన్సీలైన ఎన్సిసిఎఫ్, నాఫెడ్ ద్వారా, 2026 సంవత్సరానికి సరిపడా 1.21 లక్షల టన్నుల ఉల్లిపాయల బఫర్ నిల్వను కలిగి ఉంది. ధరలను అదుపులో ఉంచే లక్ష్యంతో చేపట్టిన రిటైల్ చర్యలో భాగంగా, ఈ ఏజెన్సీలు నిల్వ ఉంచిన ఉల్లిపాయలను ఉత్పత్తి చేసే రాష్ట్రాల నుండి వినియోగ కేంద్రాలకు 'కందా ఎక్స్ప్రెస్' అని పేరు పెట్టిన ప్రత్యేక రైలు బోగీల ద్వారా గానీ లేదా ట్రక్కుల ద్వారా గానీ పెద్దమొత్తంలో రవాణా చేస్తున్నాయి. ధరల పట్ల సున్నితంగా ఉండే ఎంపిక చేసిన నగరాల్లో ఉల్లిపాయలను కిలోకు రూ. 35 రాయితీ ధరకు విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు 17 నగరాల్లో సుమారు 4,000 టన్నుల బఫర్ ఉల్లిపాయలు అమ్ముడయ్యాయి అని ఖరే పిటిఐకి తెలిపారు. కాండా ఎక్స్ప్రెస్ ద్వారా భారీ సరుకులు ఇప్పటికే ఢిల్లీ, చెన్నైకి చేరుకున్నాయని, రానున్న రోజుల్లో గౌహతికి పంపించేందుకు



మూడో రేక్ను ఇప్పుడు లోడ్ చేస్తున్నారని ఆమె తెలిపారు. బఫర్ ఉల్లిపాయల పంపిణీ వినియోగదారులకు కొంత ఉపశమనం కలిగించిందని, ధరలు కొద్దిగా తగ్గాయని ఖరే అన్నారు. ఎన్సిసిఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ అనిస్ జోసెఫ్ చంద్ర మాట్లాడుతూ, ఫెడరేషన్ ఒక్కటే ఇప్పటివరకు 1,500 టన్నుల బఫర్ ఉల్లిపాయలను విక్రయించిందని చెప్పారు. 'ఇప్పటివరకు, మేము దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో 1,500 టన్నుల బఫర్ ఉల్లిపాయలను విక్రయించాము. రిటైల్ అమ్మకాలపై, కిలోకు రూ. 35 చొప్పున విక్రయించడంపై దృష్టి సారించాము' అని ఆమె అన్నారు. సహకార సంఘాలు, ఇతర వేదికల ద్వారా అమ్మకాలు జరిపేందుకు ఎన్సిసిఎఫ్ కొన్ని రాష్ట్రాలతో ఒప్పందాలు కుదుర్చుకుందని ఆమె అన్నారు. ప్రస్తుతం ఢిల్లీ–ఎన్సిఆర్ ప్రాంతం, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, కేరళ, రాజస్థాన్, పంజాబ్, ఒడిశా, మరికొన్ని రాష్ట్రాలలో ఎన్సిసిఎఫ్ రిటైల్ జోక్యం కొనసాగుతోంది. ఈ రాష్ట్రాలకు బఫర్ ఉల్లిపాయల వర్గీకరణ, గ్రేడింగ్, ప్యాకింగ్, రవాణాను నోడల్ సెంట్రల్ వేర్హౌసింగ్ కార్పొరేషన్ (సిడబ్ల్యుసి) నిర్వహిస్తోంది. చంద్రా తెలిపిన వివరాల ప్రకారం, రాయితీ ధరపై విక్రయాలు చేపట్టడం వల్ల ఉల్లి ధరలు కిలోకు రూ. 23 మేర తగ్గాయి. వినియోగదారుల వ్యవహారాల శాఖ గణాంకాల ప్రకారం, ఆగస్టు 28న రాయితీ ధరపై విక్రయాలు ప్రారంభించినప్పుడు ఉల్లి సగటు దేశవ్యాప్త రిటైల్ ధర కిలోకు రూ. 48.5గా ఉండగా, ప్రస్తుతం అది రూ. 50.79గా నమోదైంది. సెప్టెంబర్ 5 నాటికి, ఉల్లి రిటైల్ ధర ఢిల్లీలో కిలోకు రూ. 58, ముంబయిలో రూ. 53, చెన్నైలో రూ. 63, రాంచీలో రూ. 40గా ఉండగా, సగటు హోల్సేల్ ధర కిలోకు రూ. 42.79గా ఉంది. కొత్త ఖరీఫ్ ఉల్లి పంట పరిస్థితి ఆశాజనకంగా ఉందని, అక్టోబర్ మధ్య నుండి మార్కెట్లోకి ఈ పంట రాకతో సరఫరా ఒత్తిడి తగ్గి ధరల విషయంలో మరింత ఉపశమనం లభిస్తుందని అధికారులు తెలిపారు.

### మోదీ సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే...

# ప్రతిపక్షానికి ఏటా ఒక కొత్త విశేషణం

**'నరాజ్ ఫూపా' వ్యాఖ్యలపై కాంగ్రెస్ ధ్వజం**

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'నరాజ్ ఫూపా' (అలిగిన బాబాయి) వంటి పదబంధాలను ఉపయోగించడం అనేది, తన సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రతీసారి ప్రతిపక్షానికి ఏదో ఒక కొత్త విశేషణాన్ని ఆపాదించే ఆయన పనితీరులో ఒక భాగమేనని ఆదివారం కాంగ్రెస్ ధ్వజమెత్తింది.శనివారం ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన శ్రీరామ్ కాలేజి ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్సిసి) శతాబ్ది ఉత్సవాలలో ప్రసంగించినప్పుడు, ఆ వేదికను మరొక రాజకీయ ప్రచార వేదికగా మార్చడం ద్వారా, ఆయన ఆ వేదికను దుర్వినియోగం చేశారని కూడా ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే మాట్లాడుతూ 'నరేంద్రమోదీజీ, నిన్న మీరు ఢిల్లీ యూనివర్సిటీలోని శ్రీరామ్ కాలేజీ ఆఫ్ కామర్స్ను సందర్శించారు. 'దేశ యువత, విద్య, వారి భవిష్యత్తుపై చర్చకు అది ఒక అవకాశం. కానీ విచారకరమైన విషయమేమిటంటే, యువత ప్రశ్నలను ఎదుర్కోవడానికి బదులుగా, ఆ ప్రసంగం మరో రాజకీయ ప్రచారంగా మారిపోయింది' అని ఆయనఅన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నలను అణిచివేసి, తన వైఫల్యాలు కనబడకుండా ఉండేందుకు, ప్రతీ ఏటా ప్రతిపక్షానికి ఒక విశేషణం ఇవ్వడమే మోదీజీ పంథా. 'నారాజ్ ఫూపా', 'దిమాగ్ నక్సల్' 'అర్బన్ నక్సల్', 'ఖాన్ మార్కెట్ గ్యాంగ్', 'ఆందోళన్ జీవి' 'పర్జీవి' అనే పదాలను మల్లికార్జున్ ఖర్గే తన హిందీ'ఎక్స్'లో పెట్టిన పోస్ట్లో పేర్కొన్నారు. విశేషణాలు మారుతుంటాయి. కానీ, మోదీ ప్రభుత్వ 'ప్రజా వ్యతిరేక విధానాలు మారవు' అని మల్లికార్జున్ ఖర్గే అన్నారు. 'మోదీజీ మీరు ప్రజలకు అందుబాటులో లేకుండా పోయినప్పుడే, వారిని చేరుకోవాల్సిన అవసరం ఉంటుంది. ప్రధానమంత్రి తన రిపోర్ట్ కార్డు చూపించారు. దేశ యువత కూడా తన రిపోర్ట్తో వస్తోంది. అందులో నిరుద్యోగం, ఏళ్ల తరబడి నిలిచిపోయిన నియామకాలు, పేపర్ లీక్లతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, రోజురోజుకూ విద్య ఖరీదుగా మారడం, తగ్గిపోతున్న స్కాలర్షిప్ అవకాశాలు, విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిపై పెరుగుతున్న ఒత్తిడి వంటి అంశాలు ఉన్నాయి' అని కాంగ్రెస్ చీఫ్ అన్నారు. దాటవేత మాటలతో పరిష్కారాలు లభించవు కాబట్టి 'ఛాత్రోంకీ గూంజ్ ' వినండి అని ఖర్గే అన్నారు.

## పుతిన్, జిన్‌పింగ్, ట్రంప్ ఉమ్మడి సమావేశం!



**మాస్కో:** రష్యా, చైనా, అమెరికా దేశాల అగ్రనాయకుల ఉమ్మడి సమావేశాన్ని తిరస్కరించలేమని రష్యా విదేశాంగ సహాయమంత్రి సెర్గీ రియాబ్‌కోవ్ అన్నారు. టాస్‌వార్తాసంస్థతో మాట్లాడుతూ, ఈ మూడు దేశాల నాయకుల ఉమ్మడి సమావేశాన్ని తోసిపుచ్చలేమని, అలాగని తక్షణమే దీని కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పడం కూడా అతిశయోక్తే అవుతుందని అన్నారు. ఐతే ఈ సమావేశం జరగబోదని మాత్రం తోసిపుచ్చలేమన్నారు.''అటువంటి ఆలోచన ఒకటి ఉంది. అది బహిరంగ చర్చకు వచ్చింది, కానీ తక్షణ ఏర్పాట్లు జరుగుతున్నాయనడం అతిశయోక్తి అవుతుంది, అత్యున్నతస్థాయి సమావేశం ఏర్పాట్లు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంటాయి'' అని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ సమావేశాలు జరగడానికి ముందుగా కొన్ని సంకేతాలు వస్తాయని చెబుతూ రష్యా, ఇండియా, చైనా (ఆర్‌ఐసి) విధానాన్ని ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చునన్నారు. వాస్తవానికి రష్యా, చైనా, అమెరికా నాయకుల ఉమ్మడి సమావేశం ఇప్పటి వరకూ జరగలేదు. ఐతే ఇంతకుమించి చెప్పడానికి ఈరోజు తన వద్ద ఎలాంటి ఆధారాలు లేవని కూడా రియాబ్‌కోవ్ చెప్పారు.

# పుతిన్‌తో మూడు గంటలు ట్రంప్ దూతల భేటీ

- పూర్తిస్థాయి కాల్పుల విరమణకు తిరస్కృతి
- కీవ్ చేరుకున్న స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్



**మాస్కో:** ఉక్రేన్ యుద్ధ పరిష్కారానికి మధ్యవర్తిత్వ చర్చలు పునరుద్ధరించిన ట్రంప్ తరఫు అమెరికా దూతలు మాస్కోలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్‌తో శనివారం రాత్రి మూడు గంటలసేపు సంభాషించారు.ఈ శాంతి చర్చలకు సంబంధించిన కీలక ప్రణాళికపై చర్చించారు. ఈ ప్రణాళిక ఏమిటనేది ప్రస్తుతానికి స్పష్టంగా తెలియదు. కీలక డిమాండ్లు నెరవేరకుండా పూర్తిస్థాయి కాల్పుల విరమణకు పుతిన్ తిరస్కరించారన్నది అంతర్జాతీయ మీడియా సమాచారం.ఐతే ఈ చర్చలపై ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. ఐతే ఈ సమాచార మార్గం ఒక విశ్వాస వాతావరణం నెలకొందన్న విషయాన్ని సూచిస్తోందని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ అన్నారు.పుతిన్ విదేశాంగ విధాన సలహాదారు యూరీ ఉషకోవ్ మాట్లాడుతూ, ఈ చర్చలు నిర్మాణాత్మకమైనవి, ఎంతో ప్రయోజనాత్మకమైనవని చెప్పారు.ఇరు దేశాల ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించిన ప్రాజెక్టుల గురించి కూడా చర్చించినట్లు చెప్పారు. ఈ చర్చలు పూర్తిచేసి ఆదివారం వారు ఉక్రేన్ రాజధాని కీవ్‌కు చేరుకున్నారు.అధ్యక్షుడు జెలెన్స్కీతో సంభాషిస్తారు. 'ఉక్రేన్‌లో యుద్ధం ముగించేందుకు మా దగ్గర ఒక ఐడియా ఉంది''అని ట్రంప్ చెప్పిన తర్వాత ఈ దౌత్య చర్చలు పునఃప్రారంభమయ్యాయి.ఐతే ఈ శాంతి ప్రయత్నాలను పుతిన్ స్వాగతించారు.చర్చల నిమిత్తం తాత్కాలికంగా మూడురోజులు అంటే సెప్టెంబరు ఎనిమిదో తేదీ వరకూ రెండు దేశాలు కాల్పులు విరమిస్తున్నట్లు ప్రకటించాయి. ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్,పశ్చిమాసియాలో అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్ అమెరికా తరపున సంభాషణల్లో పాల్గొంటున్నారు.ఇరు దేశాలమధ్యా పూర్తిస్థాయి యుద్ధ దాడులు తీవ్ర స్థాయికి చేరుకున్న దశలో ట్రంప్ శాంతి యత్నాలు చేపట్టారు. రష్యాను శాంతి చర్చల దగ్గరకు తీసుకురావాలని, పుతిన్‌ను లొంగదీయాలని చాలా నెలలుగా జెలెన్స్కీ యూరోపియన్ యూనియన్ దేశాలపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. తమ సాంస్కృతిక వారసత్వ భూభాగాలను రష్యా కాపాడుకుంటుంది.ఉక్రేన్‌ను ఒక వేదికగా చేసుకుని నాటో కూటమి తూర్పువైపుగా తన సైనిక వ్యవస్థను విస్తరించేందుకు ప్రయత్నం చేస్తోందని పుతిన్ మొదటినుండి విమర్శిస్తున్నారు. నాటో కూటమిలో ఉక్రేన్ చేర్చుకోకూడదని,ఆయుధాలు సరఫరా చేయకూడదని పుతిన్ ప్రధాన షరతు విధించారు. కానీ ట్రంప్ ప్రభుత్వం శక్తిమంతమైన డ్రోన్ పరిజ్ఞానాన్ని ఉక్రేన్‌కు అందించింది. ఉక్రేన్‌కు ఆయుధ సహాయాన్ని ఆపకుండా కొనసాగిస్తామని బ్రిటన్ ప్రధానమంత్రి బర్నీహామ్ ఇటీవల స్పష్టం చేశారు. రష్యా- ఉక్రేన్ మధ్య ఉన్న 1250 కి.మీ నిడివిగల సరిహద్దుల్లో ముందుకు దూసుకువెళ్లేందుకు రెండు దేశాల సైన్యాలు పోరాటం చేస్తున్న సమయంలో జెట్ ఆధారిత డ్రోన్‌తో రష్యా దాడులు ఉద్ధృతం చేసింది. కీవ్ నగరంలో నిత్యం సైరన్లు మోగుతున్నాయి. గడిచిన ఆరునెలలుగా ట్రంప్ ఇరాన్ యుద్ధంలో తలమునకలై ఉన్నారు. అంతకుముందు జనవరినెలలో చివరిసారి జారెడ్ కుష్నెర్, స్టీవ్ విట్‌కాఫ్ ఇద్దరూ చర్చల నిమిత్తం మాస్కో వెళ్ళారు. మళ్ళీ పుతిన్‌తో చర్చలు జరపడం ఇదే మొదటిసారి. 2022లో రష్యా పూర్తిస్థాయి దండయాత్ర చేసిన తర్వాత నుండి నేటివరకూ దాదాపు ఐదోవంతు ఉక్రేన్ భూభాగం రష్యా అధీనలోనే ఉంది.

# దురాక్రమణ చేస్తే తీవ్ర ప్రతిఘటన

### ఘాలిబాఫ్ హెచ్చరిక



**టెహ్రాన్:** అమెరికా ఎలాంటి దురాక్రమణ చర్యలకు పాల్పడినా, ఇరాన్ ప్రయోజనాలకు నష్టం కలిగించినా గానీ వారు చాలా బాధకరంగా చింతించేస్థాయిలో ఈసారి ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘెర్ ఘాలిబాఫ్ హెచ్చరించారు. ఆదివారం ఉదయం పార్లమెంటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆట నియమ నిబంధనలు మారిపోయాయన్న విషయాన్ని అమెరికా చాలా ఆలస్యంగా తెలుసుకుందన్నారు. సమానస్థాయి ప్రతిస్పందనకు కాలం చెల్లిందని, వారు ఒక క్షిపణితో దాడి చేస్తే తాము నాలుగు క్షిపణులతో దాడులు చేస్తామన్నారు.ఇరాన్ ప్రయోజనాలకు ఎలాంటి నష్టం వాటిల్లినాగానీ చాలా శరవేగంగా,తీవ్రస్థాయిలో, రెట్టింపు దాడులు చేస్తామని,ఆ దాడుల ప్రతిస్పందన చాలా బాధాకరంగా ఉంటుందన్నారు. ఇరాన్ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అమెరికా–ఇజ్రాయెల్ దేశాలు ఉమ్మడిగా రెండుసార్లు ఇరాన్‌పైన దాడులు చేసినాగానీ ఈ బాధలను దేశ ప్రజలు తట్టుకుని నిలబడ్డారని,ఎంతో సహనంతో వ్యవహరించారని ప్రశంసించారు. 2025 జూన్ 13 నుండి 24వ తేదీ వరకూ 12 రోజులు 2026 ఫిబ్రవరి 28 నుండి ఏప్రిల్ 8వ తేదీవరకూ 40 రోజులు రెండు విడతలుగా ఇరాన్‌పై అమెరికా యుద్ధం చేసింది. ఆ తర్వాత నుండి ఆడపాదడపా దాడులు జరుగుతూనే ఉన్నాయి. మరోవైపు హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవులపై అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగిస్తూనే ఉంది.

**నిరాశానిస్పృహతోనే ట్రంప్ దాడులు**

నిరాశానిస్పృహలతోనే అమెరికా సైనికులు ఇరాన్ చమురు నౌకలపై దాడులు చేస్తున్నారని, ప్రముఖ రచయిత,జర్నలిస్టు,పరిశోధకులు నిక్ మోటర్న్ విమర్శించారు. ఆయన అమెరికాలోనే చదువుకున్నారు. అక్కడే పెరిగిపెద్దయ్యారు.ఇరాన్ ప్రజలకు వ్యతిరేకంగా ట్రంప్ దాడులు,పౌరుల ఇళ్ళపై దాడులను ఆయన వ్యతిరేకించారు. ట్రంప్‌లో రాజకీయ నిరాశ తీవ్రమవుతోందని,ఆయన తీరు దీనినే ప్రతిబింబిస్తోందని అన్నారు.అమెరికాలో పెరిగిన ఆయుధాల కొరత,ఆ దేశ వైమానిక సిబ్బంది తీవ్రంగా అలసిపోవడం,సముద్ర వాతావరణంలో నెలల తరబడి ఉండిపోవడం,వారితో మానసిక సమస్యలు,ఒత్తిడితోపాటు స్వదేశంలో నవంబరులో రాబోయే ద్వైవార్షిక ఎన్నికలు,తగ్గిపోయిన ట్రంప్ రేటింగ్ వంటి విషయాలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.ఇరాన్‌కు ఉన్న నౌకా విధ్వంసక సామర్థ్యం కారణంగా ఆ దేశ జలాల దగ్గరగా వెళ్ళి దాడులు చేయకుండా అమెరికా దూరంగా ఉండిపోయిందన్నారు.

# ఇండోనేసియాలో బద్దలైన వాల్కనో

### జకర్తా సహా ఆరు విమానాశ్రయాల మూసివేత



**జకర్తా:** ఇండోనేసియాలో వాల్కనో బద్దలైంది. దీంతో లావా బయటకు తన్నుకువస్తోంది. దుమ్ము, ధూళి మేఘాలు ఆకాశాన్ని కమ్ముకున్నాయి. దీంతో ఆరు విమానాశ్రయాలను ఇండోనేసియా మూసివేసింది. దేశ రాజధాని నగరం జకర్తాలోని విమానాశ్రయాన్ని కూడా దుమ్ము, ధూళి ప్రమాదం వల్ల మూసివేశారు. ఆ దేశంలోని అనక్ క్రకటావు అగ్నిపర్వతం నుండి వాల్కలో బయటకు ప్రవహిస్తోంది. దుమ్ము, ధూళి, రాళ్ళు బయటకు వస్తున్నాయి. శుక్రవారం నాడు మెల్లిగా ఈ వాల్కలో బయటకు రావడం ప్రారంభమైంది. దీంతో పశ్చిమ ఇండోనేసియా అంతటా విమానాలను రద్దుచేశారు. జావా, సుమత్రా దీవులమధ్య సుందా జలసంధిలో ఈ వాల్కనో ఉంది. అగ్ని పర్వతం నుండి లావా బయటకు వస్తున్న దృశ్యాలను సి.సి కెమెరాల ద్వారా గమనించారు. ఇప్పటివరకూ ఎవరికీ ప్రమాదం వాటిల్లలేదు. ఎవరినీ ఖాళీచేసి వెళ్ళమని ఆదేశాలు జారీ చేయలేదు. ఈ పర్వతానికి 16 కి.మీ సమీపంలో నివాసిత ప్రాంతాలు లేవు. జకర్తాలోని కొన్ని ప్రాంతాలలో వాల్కనో ధూళి విస్తరించింది.

## గొంతు వినండి

**(మొదటి పేజీ తరువాయి)**

విషంలాంటి ఆహారం, డిబిటిలో మోసాలు' అని రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఇప్పుడు వాళ్లు ఎంపిఎస్‌సి వంటి రాజ్యాంగబద్ధమైన సంస్థను తమ ఆధీనంలోకి తీసుకుని, దాని విశ్వసనీయతను నాశనం చేశారన్నారు. విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తు కోసం చేసే ప్రతి డిమాండ్ సమర్థనీయమైనదేనని ప్రతిపక్షనేత స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న నియామక పరీక్షల విధానంపై సమగ్ర సమీక్ష జరిపి, దానిని మరింత పారదర్శకంగా, సురక్షితంగా, విశ్వసనీయంగా, అభ్యర్థులకు అనుకూలంగా మార్చేందుకు చర్యలు సూచించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, మహారాష్ట్రలో గిరిజన విద్యార్థులు, ఉద్యోగార్థులు పేలవమైన పనితీరుపై నిరసనలు చేపట్టారు. హాస్టల్ పరిస్థితులు, విద్యార్థుల భద్రత, పరీక్ష పత్రాల లీకేజీల వంటి అంశాల నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం కీలక డిమాండ్లను అంగీకరించి, కొత్త పరీక్షల సంస్కరణల కమిటీని ఏర్పాటు చేసింది.

**బిహార్‌లో విద్యార్థులపై చర్యపట్ల రాహుల్ ఆగ్రహం**

బిహార్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన చర్యల పట్ల కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విరిగిన ఎముకలను సరిచేయవచ్చు కానీ, వారి ఛిద్రమైన కలలను తిరిగి ఎలా తీసుకురాగలరని ప్రశ్నించారు. పరీక్షా విధానంలో అక్రమాలపై గళమెత్తినందుకు భయంకరమైన పోలీసు దౌర్జన్యాన్ని ఎదుర్కొన్న బిహార్ విద్యార్థులు, యువతతో తాను ఇటీవల జరిపిన సమావేశానికి సంబంధించిన వీడియోను రాహుల్‌గాంధీ ఆదివారం సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. ఆ వీడియోతో పాటు హిందీలో ఓ పోస్టు చేశారు. 'ఊహించండి, ఈ పిల్లలు చేసిన పాపం ఏమిటి? వారిపైకి బుల్లెట్లు ఎందుకు ప్రయోగించారు? వారు ప్రభుత్వం నుంచి కేవలం విద్య, ఉపాధి, జవాబుదారీతనం వంటి మూడు విషయాలు మాత్రమే కోరారు. ఒక విద్యార్థి కాలి ఎముక ఎకె47 బుల్లెట్ దాడిలో విరిగిపోయింది. దాంతో పాటు సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలన్న అతని కల కూడా కరిగిపోయింది. మరో ఇద్దరు విద్యార్థుల భుజాల గుండా బుల్లెట్లు దూసుకెళ్లాయి' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు పేర్కొన్నారు. విద్యార్థులు నేరస్తులు కాదని నొక్కిచెప్పిన ఆయన, వారు పేద కుటుంబాల పిల్లలని, తమ కుటుంబాల కలలను మోస్తూ చదువుకోవడానికి బయటకు వచ్చారన్నారు. 'బుల్లెట్ గాయాలు మానుతాయి, కానీ ఈ పిల్లల మనసుల్లో లోతుగా పాతుకుపోయిన భయానికి చికిత్స చేసే ఆసుపత్రి ఎక్కడ ఉంది? అని రాహుల్ ప్రశ్నించారు. ప్రధానమంత్రి గారూ, ముఖ్యమంత్రి గారూ... వారి విరిగిన ఎముకలు సరిచేయబడవచ్చు. కానీ వారి ఛిద్రమైన కలలను మీరు తిరిగి తీసుకురాగలరా? అని నిలదీశారు. గురువారం నాడు బిహార్ విద్యార్థులను కలిసినప్పుడు రాహుల్‌గాంధీ మాట్లాడుతూ, యువత గొంతుకను అణిచివేసే ఏ ప్రభుత్వమైనా చివరికి ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని బిజెపి గుర్తుంచుకోవాలని, ఆ రోజు ఎంతో దూరంలో లేదని అన్నారు. ఈ యువకులు కేవలం సమాన అవకాశాలు, పారదర్శకమైన పరీక్షా విధానం, తమ హక్కుల కోసం మాత్రమే డిమాండ్ చేస్తున్నారన్నారు. అటువంటి డిమాండ్లకు ప్రతిస్పందనగా లాఠీలు, బుల్లెట్లను ఉపయోగించాల్సిన అవసరం ఏముందని కాంగ్రెస్ నేత ప్రశ్నించారు. ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఏకస్థాయి పరీక్ష, పారదర్శక నియామక ప్రక్రియను డిమాండ్ చేస్తూ నిరసనకారులు ముఖ్యమంత్రి నివాసం వరకు పాదయాత్ర చేయడానికి ప్రయత్నించడంతో, గత నెలలో పాట్నాలో ఉద్యోగార్థులకు, పోలీసులకు మధ్య భీకర ఘర్షణ జరిగింది.

## భద్రతే ముఖ్యం

**(మొదటి పేజీ తరువాయి)**

ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈహెచ్‌ఎస్ అమలులో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఆదివారం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ఈహెచ్‌ఎస్ ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఉన్నతాధికారులతో భట్టి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, డిపెండెంట్లు అనారోగ్యానికి గురైనప్పుడు ఆర్థిక, మానసిక ఇబ్బందులు పడకూడదనే మానవీయ దృక్పథంతో ఈహెచ్‌ఎస్‌ను అమల్లోకి తీసుకొచ్చామని భట్టి తెలిపారు. ప్రస్తుతం 354 ప్రైవేట్ ఆసుపత్రులు పథకంలో ఉన్నాయని, మరిన్ని ఆసుపత్రులను డీమ్డ్ ఎంప్యానెల్డ్ విధానంలో చేర్చామని చెప్పారు. హెల్త్ కార్డుల జారీని వేగవంతం చేసి, ఆసుపత్రుల యాజమాన్యాలతో సమన్వయం చేసుకుని పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.ఉద్యోగ సంఘాలతో పలు మార్లు చర్చించి వారి సూచనలను పరిగణనలోకి తీసుకున్నామని డిప్యూటి సిఎం పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో ఉందని, ఈహెచ్‌ఎస్‌ను విజయవంతం చేయడంలో అధికారులు, ఉద్యోగ సంఘాలు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, జెఏడి స్పెషల్ చీఫ్ సెక్రటరీ మహేష్ దత్ ఎక్కా, ఆరోగ్య, వైద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టీనా, హోం శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఈహెచ్‌ఎస్ సీఈఓ హనుమంతు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వరి సాగుకే సై

**(మొదటి పేజీ తరువాయి)**

ఆశించిన స్థాయిలో కాకపోయిన కొంతమేరకు కురవడంతో వరిసాగుకు ఊతం మిచ్చింది. దీంతో ఆలస్యంగా నైనా రైతులు తిరిగి వరిసాగు వైపు మొగ్గు చూపడంతో గత ఏడాదితో పోల్చితే నామమాత్రమే వరి సాగు తగ్గింది.ఈనెల 2వ తేదీ నాటికి 2025 సంవత్సరంలో 61.73 లక్షల ఎకరాలు వరి సాగు చేయగా ఎల్‌నినో నేపథ్యంలో 2026 సెప్టెంబర్ 2 నాటికి 52.81 లక్షల ఎకరాలు మాత్రమే రైతులు సాగు చేశారు. ఇది గత ఏడాదితో పోల్చితే 8.92 లక్షల ఎకరాలు రాష్ట్ర స్థాయిలో 14.4 5శాతం తగ్గింది.అయితే వ్యవసాయ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఈ నెల 5వ తేదీన వెల్లడించిన లెక్కల ప్రకారం 57.70 లక్షల ఎకరాలకు చేరినట్లు ప్రకటించడంతో గత సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది 10 శాతం మేర మాత్రమే వరి సాగు తగ్గింది. అయితే గత సంవత్సరంతో పోల్చితే ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ పలు జిల్లాలో ఈఏడాది వరి సాగు పెరిగింది. రంగారెడ్డి 59,3161(84.64 శాతం), కరీంనగర్ 13,827 (5.49శాతం) కుమురం భీమ్ ఆసిఫాబాద్ 977 (2.83శాతం), కామారెడ్డి8,788 (2.83శాతం) అధికంగా రైతులు వరి సాగు చేశారు. అదేవిధంగా గత ఏడాదితో పోల్చితే ఎల్‌నినో కారణంగా పలు ప్రధాన జిల్లాలో వరి సాగు తగ్గింది. ఈ సంవత్సరం సూర్యాపేట 1,28,557(28.55శాతం), ఎకరాలు, నల్గొండ 1,23,874(25.56శాతం), ఖమ్మం1,04,190(36శాతం), వరంగల్ 65,975( 50శాతం), సిద్దిపేట 64,614(19.52శాతం) ఎకరాలు తక్కువగా రైతులు వరి సాగు చేశాయి.

**వరిసాగుపై ఎల్‌నినో ప్రభావం నామమాత్రమే**

రాష్ట్రంలో వరిసాగుపై ఎల్‌నినో నామ మాత్రమే ప్రభావం చూపింది. ఇందుకు కారణం రాష్ట్రంలో అధిక శాతం వ్యవసాయం బోరు బావులపై ఆధారపడి ఉండడమే.వర్షకాలం ప్రారంభంలో వర్షాలు కురువకపోయినా ఆ తర్వాత కురిసిన వర్షాలను నమ్ముకుని రైతులు ఆలస్యంగా వరి సాగు చేశారు. జూలై , ఆగస్టులో రాష్ట్ర వ్యాప్తంగా మోస్తారు వర్షాలు కురవడంతో కొంత మేర భూగర్భ జలాల మట్టాలు పెరగడంతో రైతులు తిరిగి వరిసాగుపై దృష్టి సారించారు.

| క్ర.సం | జిల్లా | 2025 సాగు ఎకరాల్లో | 2026 సాగు ఎకరాల్లో |
|---|---|---|---|
| 1. | ఆదిలాబాద్ | 2,375 | 1,250 |
| 2. | కుమురం భీమ్ ఆసిఫాబాద్ | 34,475 | 35,452 |
| 3. | మంచిర్యాల | 1,37,883 | 1,30,277 |
| 4. | నిర్మల్ | 1,25,003 | 90,474 |
| 5. | నిజామాబాద్ | 4,36,695 | 4,35,600 |
| 6. | కామారెడి | 3,10,573 | 3,19,361 |
| 7. | కరీంనగర్ | 2,51,907 | 2,65,734 |
| 8. | పెద్దపలి | 2,09,748 | 2,06,126 |
| 9. | జగిత్యాల | 3,12,420 | 2,92,860 |
| 10. | రాజన్న సిరిసిల్ల | 1,85,420 | 1,47,500 |
| 11. | మెదక్ | 2,92,095 | 2,87,004 |
| 12. | సంగారెడ్డి | 1,45,372 | 1,22,118 |
| 13. | సిద్దిపేట | 3,31,020 | 2,66,406 |
| 14. | వరంగల్ | 1,30,225 | 64,250 |
| 15. | హనుమకొండ | 1,38,807 | 1,19,490 |
| 16. | మహబూబాబాద్ | 2,08,268 | 1,49,162 |
| 17 | ములుగు | 89,490 | 68,254 |
| 18. | జయశంకర్ భూపాలపల్లి | 1,05,351 | 84,512 |
| 19. | జనగామ | 1,80,898 | 1,54,404 |
| 20. | ఖమ్మం | 2,89,407 | 1,85,217 |
| 21. | భద్రాద్రి కొత్తగూడెం | 1,56,776 | 1,24,506 |
| 22. | రంగారెడ్డి | 32,126 | 91,442 |
| 23. | వికారాబాద్ | 1,17,155 | 96,893 |
| 24. | మేడ్చల్–మల్కాజిగిరి | 17,634 | 16,996 |
| 25. | మహబూబ్‌నగర్ | 1,78,358 | 1,45,169 |
| 26. | నారాయణపేట | 1,72,855 | 1,34,355 |
| 27. | నాగర్‌కర్నూల్ | 1,28,564 | 1,12,237 |
| 28. | వనపర్తి | 1,78,746 | 1,62,735 |
| 29. | జోగులాంబ గద్వాల | 83,752 | 78,713 |
| 30. | నల్గొండ | 4,84,669 | 3,60,795 |
| 31. | సూర్యపేట | 4,50257 | 3,21,700 |
| 32 | యాదాద్రి భువనగిరి | 2,54,554 | 2,10,321 |
| మొత్తం | | 61,72,878 | 52,81,313 |

## ఆందోళన

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ రంగాన్ని సమాయత్తం చేయాలి, భారీస్థాయిలో తయారీ రంగాన్ని తీర్చిదిద్దాలి, కొత్త సాంకేతికతను సమకూర్చుకోవాలి, ప్రయోగాలకు సంబంధించిన శక్తిసామర్థ్యాలను మెరుగుపరచుకోవాలి అని కూడా ఆయన ఎక్స్‌వేదికగా పేర్కొన్నారు.అంతకుముందు ఆగస్టు 21వ తేదీన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ,ప్రభుత్వేతర సంస్థలను,ప్రైవేటు సంస్థలను ఇన్–స్పేస్ ప్రోత్సహిస్తుందని,అవి చేపట్టే వివిధ అంతరిక్ష కార్యకలాపాలను ఇన్–స్పేస్ పర్యవేక్షిస్తుందని చెప్పినట్లు వార్తలు వెలువడ్డాయి.ఇక అంతిమంగా ఇస్రో ఎలాంటి అంతరిక్ష వాహక నౌకలను తయారు చేయబోదని,ప్రైవేటు రంగ సంస్థలు లేదా ప్రభుత్వేతర సంస్థలు ఈ వాహక నౌకలను తయారు చేస్తాయని పవన్ గోయంగా ఒక బహిరంగ కార్యక్రమంలో చెప్పినట్లు సమాచారం వెల్లడైంది. దీంతో ఉద్యోగ సంఘాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి.ప్రస్తుతం ఖాళీలను భర్తీ చేయడం, భవిష్యత్ నియామకాలు, దేశ భద్రత వంటి విషయాలను ప్రధానంగా ఉద్యోగ సంఘాలు నారాయణన్‌కు రాసిన లేఖలో ప్రశ్నించాయి.

ఇస్రోను కేవలం ఒక నామమాత్రపు సంస్థగా మార్చేస్తారా? కేవలం ఒక పరిశోధన– అభివృద్ధి విభాగాలకే పరిమితం చేస్తారా? ప్రస్తుత ఖాళీల భర్తీ,మంజూరైన నియామకాలు, శాస్త్రీయ, సాంకేతిక, పారిశ్రామిక సిబ్బంది, ఉద్యోగుల నియామకాలపై ప్రభావం, భవిష్యత్ నియమాకాల సంగతి ఏమిటి? ఇంతటి ముఖ్యమైన విషయాలపై అధికారికంగా ఇస్రో ద్వారా ఎందుకు సమాచారం ఇవ్వడం లేదు? అని ఉద్యోగ సంఘాలు ఆ లేఖలో నిలదీశాయి. అంతరిక్ష సంస్థ ఈ విషయంలో విధానపరమైన ఆమోదంతో వివరణ ఇవ్వలేదు, అధికారికంగా సమాచారాన్ని ఉద్యోగులకు తెలియజేయలేదు, న్యాయపరమైన మార్గాల ద్వారా పాలనావిభాగం ద్వారా చెప్పలేదు, ఇస్రో భవిష్యత్తు గురించి, తదుపరి పర్యవసానాల గురించి, ప్రస్తుతం ఉన్న కార్మికులు, ఉద్యోగుల గురించి, ప్రభుత్వ రంగం ద్వారా ఎందుకు సమాచారం చెప్పలేదని అని ఉద్యోగ సంఘాలు ప్రశ్నించాయి.

''ఇస్రో అభివృద్ధి చేసిన సాంకేతికత జాతి సంపద, దీనిని అయాచితంగా ధారాదత్తం చేస్తారా? అత్యంత కీలకమైన ఈ సాంకేతికతలో ప్రైవేటు భాగస్వామ్యం, బదిలీ చేసే ప్రక్రియ బాహటత్వంతో, ఒక బహిరంగ ప్రక్రియగా కొనసాగాలి, దానికి జవాబుదారీ, భద్రత ఉండాలి, స్థిరమైన వ్యూహాత్మకత ఉండాలి, ఉద్యోగుల సలహా సంప్రదింపులు లేకుండా పత్రికల ద్వారా సమాచారం తెలియజేయకూడదు అని లేఖలో ప్రశ్నించాయి. ఈ విధమైన వార్తలు ఇంకా అనేక రకాల ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి,ఇస్రోకు సంబంధించి కీలకమైన పిఎస్ఎల్‌వి,ఎల్‌విఎం3 ఎస్ఎస్ఎల్‌వి డిజైన్, అభివృద్ధి, రూపకల్పన, అనుసంధానం, పరీక్షలు, ప్రయోగం, ఆ తర్వాత కొత్తగా కొనసాగింపుగా తయారు చేసే వాహకనౌకలల పనితీరు వంటివన్నీ ఇస్రో విధులలో భాగంగా కొనసాగుతాయా? లేక నిలిపివేస్తారా? అని సంఘాలు ప్రశ్నించాయి.

**ఇస్రో పాత్రను కుదించేస్తున్న మోదీ ప్రభుత్వం: కాంగ్రెస్ విమర్శ**

అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే పేరుతో మోదీ ప్రభుత్వం ఇస్రో పాత్రను ఉద్దేశపూర్వకంగా కుదించేస్తోందని కాంగ్రెస్‌పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇస్రోలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని, ప్రైవేటు కంపెనీలను విస్తరించేందుకు మోదీ ప్రభుత్వం దూకుడు చర్యలపై ఒక ఆంగ్లపత్రికలో వచ్చిన కథనంతోపాటు తొమ్మిది ఉద్యోగ సంఘాలు కూడా ఇస్రో ఛైర్మన్ నారాయణన్‌ను నిలదీస్తూ ఒక లేఖరాసిన విషయాన్ని కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఎక్స్ వేదికగా ప్రస్తావించారు. అంతరిక్ష రంగంలో అంకుర సంస్థలనుప్రోత్సహించే పేరుతో దేశ అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానానికి జవాబుదారీ లేకుండా చేస్తారా? అని ప్రశ్నించారు. ఇస్రో మాజీ ఛైర్మన్ ఒకరు ఎంతో ధైర్యంగా ఈ విషయాన్ని బాహాటంగా ప్రశ్నించారని గుర్తుచేశారు. జి.మాధవన్ నాయర్ గురించే ఆయన పరోక్షగా ప్రస్తావించారు. శుక్రవారంనాడు ఇస్రో ఎంతో విజయవంతంగా మొట్టమొదటి ఇమేజింగ్ శాటిలైట్‌ను జిఎస్ఎల్‌వి ద్వారా 2,300 కేజీల పేలోడ్‌ను భూస్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టి ఘన విజయం సాధించిందని, ఈ విజయం ఉద్యోగులలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, కానీ మోదీ ప్రభుత్వం అంకుర సంస్థలను ప్రోత్సహించే పేరుతో ఇస్రో పాత్రను పరిమితం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అనేక దశాబ్దాలుగా అభివృద్ధి చేసుకున్న ఇస్రో శక్తి సామర్థ్యాలను ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేస్తే జవాబుదారీ సంగతి ఏమిటన్నారు. ఈ విషయాలను ఇప్పుడు ఇస్రోలో ఉన్న ధైర్యవంతులు ముందుకు వచ్చి ప్రశ్నిస్తున్నారన్నారు.

## రావాలా?

**(మొదటి పేజీ తరువాయి)**

స్పీచ్‌లు ఇస్తున్నారని, అసెంబ్లీకి రావాలని ధర్నాలు చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం పోవడం ఖాయమని ఆ పార్టీ నాయకులకు అర్థమైందని, అందుకే అడ్డగోలుగా దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల అంశంపై ఉధృతమైన పోరాటం చేయాలని కెసిఆర్ సూచించారు.ఉద్దేశపూర్వకంగా రైతులకు సాగునీరు ఇవ్వకుండా ప్రభుత్వం గోస పెడుతోందని, రాజకీయాల కోసం అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టు పంపులను ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాలకు అందరూ తప్పకుండా హాజరుకావాలని కెసిఆర్ సూచించారు. ఉభయసభలలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలని, ఈ సమావేశాలను ఎవ్వరూ లైట్‌గా తీసుకోవద్దన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ప్రస్తుత పనితీరుపైన ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. అధికార పాక్షం తన ప్రస్తావన తీసుకొచ్చినా చర్చ నుంచి పక్కకు వెళ్లవద్దని, డైవర్షన్ పాలిట్రిక్స్‌లో పడ్డొదని కెసిఆర్ సూచించినట్టు తెలిసింది.

**అసెంబ్లీకి రావాల్సిన అవసరం లేదు...**

శాసనసభ సమావేశాలకు 'మీరు' (కెసిఆర్) రావాల్సిన అవసరం లేదని బిఆర్‌ఎస్‌ఎల్‌పి సమావేశంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా నిర్ణయించారు. పదే పదే కెసిఆర్‌ను తిడుతున్న నేపథ్యంలో కెసిఆర్ తరపున తామే సరిపోతామని వారు స్పష్టం చేశారు.

**ప్రజా సమస్యలపైన ప్రభుత్వాన్ని నిలదీస్తాం: హరీశ్‌రావు**

ప్రజా సమస్యలపైన సమగ్రంగా చర్చించేందుకు కనీసం నెల రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని బీఏసీ సమావేశంలో డిమాండ్ చేయనున్నట్టు బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉపనాయకుడు తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. 22ఎ కింద నిషేధిత జాబితాలో పెట్టిన వ్యవసాయ భూములు, కరెంట్ కోతలు, రుణమాఫీలో వైఫల్యం, పాలిటెక్నిక్ జీవో 97 రద్దు, సింగరేణి కుంభకోణాలు, పీఆర్సీ, డీఏలు, ఈహెచ్‌ఎస్ వైఫల్యం లాంటి పలు అంశాలపైనా అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. బిఆర్‌ఎస్‌ఎల్‌పి సమావేశ వివరాలను హరీశ్‌రావు మీడియాకు వెల్లడించారు. సిఎం రేవంత్ రెడ్డి మాటల తీరు చూసి సభ్యసమాజం తలదించుకుంటోందని, అలాంటి గౌరవం లేని సభకు కెసిఆర్ వెళ్లాల్సిన అవసరం లేదన్నారు.ప్రతిపక్ష నేతగా, రెండుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్ భద్రత విషయంలో సిఎం రేవంత్ రెడ్డికి ఏడుపు ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఏపీలో మాజీ సీఎంలకు భద్రత కల్పించడం లేదా?, కనీసం వార్డు మెంబర్ కూడా కాని సిఎం తమ్ముడు తిరుపతి రెడ్డికి నలుగురు గన్‌మెన్లను పెట్టి, భద్రత కోసం రూ 40 కోట్లు ఎలా ఖర్చు పెడుతున్నారని ప్రశ్నించారు. ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి, ఎన్టీఆర్, చంద్రబాబు లాంటి నేతల పట్ల అసెంబ్లీలో అనుచితంగా ప్రవర్తించినప్పుడు, వాళ్లు సభను బహిష్కరించి, ప్రజాక్షేత్రంలోకి వెళ్లి మళ్లీ ముఖ్యమంత్రులుగా సభలోకి అడుగుపెట్టిన చరిత్ర ఉన్నదని హరీశ్‌రావు గుర్తు చేశారు.

## కెసిఆర్ విఫలం

**(మొదటి పేజీ తరువాయి)**

వివరించాలని వారు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కెసిఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జి.వివేక్ వెంకటస్వామి, మహ్మద్ అజారుద్దీన్, ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపి మధు యాష్కీ గౌడ్, జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలైన నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తాము పోరాటాలు చేశామని స్పష్టం చేశారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనకు, పదేళ్ల బిఆర్‌ఎస్ దుర్మార్గానికి మధ్య తేడాపై ఎక్కడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, బిఆర్‌ఎస్ నాయకులకు ఆ సవాల్‌ను స్వీకరించే ధైర్యం ఉందా? అని నిలదీశారు. గతంలో కెసిఆర్ చేసిన కొండంత అప్పులను మోస్తూనే తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. కెటిఆర్ కేవలం సోషల్ మీడియాకే పరిమితమై క్షణికానందం పొందుతున్నారని, ఆయన చదువుకున్నప్పటికీ సంస్కారం లేని రీతిలో ప్రవర్తిస్తున్నారని మహేశ్ గౌడ్ దుయ్యబట్టారు. తెలంగాణ సంస్కృతిని కాపాడుతూ గద్దర్, అందెశ్రీ, పూలే, సర్దార్ సర్వాయి పాపన్న వంటి మహనీయులను గౌరవించిన ఘనత కాంగ్రెస్‌దేనని తెలిపారు. రాష్ట్రాన్ని దశాబ్దాల పాటు ఏలే శక్తి కాంగ్రెస్‌కు ఉందని, తెలంగాణలో 2040 వరకు తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని తేల్చిచెప్పారు. తెలంగాణ మట్టిలో బిఆర్‌ఎస్ అనే మొక్క ఇప్పటికే వాడిపోయిందని, బిజెపి అనే మొక్క అసలు మొలకెత్తనే మొలకెత్తదని ఆయన ఎద్దేవా చేశారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత ఆర్‌టిసి బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, రైతుభరోసా, సన్నవడ్ల బోనస్ వంటి పథకాలను అమలు చేశామని తెలిపారు. 72 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని పేర్కొన్నారు. గురుకులాల్లో డైట్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచడంతో పాటు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు నిరంతరం కృషి చేస్తూ సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణకు బిజెపి చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బిఆర్‌ఎస్ నేతలతో రోడ్లపై మాట్లాడించడం కాదని, అసెంబ్లీకి వస్తే సమాధానం చెప్తామని అన్నారు. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కెసిఆర్ ప్రజాతీర్పును అపహాస్యం చేయవద్దని, అసెంబ్లీకి రాకపోతే ప్రతిపక్ష నేత పదవిని మరొకరికి అప్పగించాలని హితవు పలికారు. మహ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిలో అన్ని వర్గాలను భాగస్వాములను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ అర్హులైన వారికి రేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. చామల కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడిగా ప్రజల సమస్యలపై ప్రశ్నించకుండా కేవలం ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కెసిఆర్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మధు యాష్కీ మాట్లాడుతూ ఇకనైనా బిఆర్‌ఎస్ నాయకుడి వైఖరి మారకుంటే, మరో పదేళ్లు కూడా వాళ్లు రోడ్ల మీదనే ఉంటారని పేర్కొన్నారు. ఈ మహా ధర్నాలో కాంగ్రెస్ ఎంపిలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, డిసిసి అధ్యక్షులు, మహిళా నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. కెసిఆర్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించి, నిరసన వ్యక్తం చేశారు.

# ఆ ఒక్క విజయం.. పాక్ క్రికెట్ పతనం ప్రారంభం!



పాకిస్థాన్ క్రికెట్ జట్టు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంక్షోభానికి ఆ జట్టు మాజీ కెప్టెన్ మహ్మద్ యూసుఫ్ ఒక విచిత్రమైన కారణాన్ని చూపాడు. దుబాయ్‌లో జరిగిన 2021 ఐసీసీ టీ20 ప్రపంచ కప్‌లో భారత్‌పై పాకిస్థాన్ 10 వికెట్ల తేడాతో గెలిచిన తర్వాత తమ జట్టు పతనం మొదలైందని అభిప్రాయపడ్డాడు. ఆ విజయం తర్వాత కొంతమంది ఆటగాళ్లు తాము ఏదో గొప్ప విజయం సాధించామని విర్రవీగారని, కెప్టెన్సీ కోసం నెలకొన్న పోటీ డ్రెస్సింగ్ రూమ్లో విభేదాలను సృష్టించిందని పేర్కొన్నాడు. ''2021లో భారత్‌పై మేం గెలిచాం. ఆ మ్యాచ్ మాకు చాలా నష్టం కలిగించింది. ఎందుకంటే ఆ విజయం తర్వాత, తాము ఏదో గొప్ప విజయాన్ని సాధించామని కొందరు ఆటగాళ్లు భావించడం మొదలుపెట్టారు. ఆ తర్వాత ఏం చేయాలో వారికి అర్థం కాలేదు. మంచి ప్రదర్శన చేస్తున్నప్పుడు వినయంగా ఉండాలి. అహంకారంతో ప్రవర్తిస్తూ అగౌరవంగా వ్యవహరిస్తే సమస్యలు వస్తాయి. పాకిస్థాన్ క్రికెట్‌లో అటువంటి సమస్యలు చాలానే తలెత్తాయి. జట్టులోని ప్రతి ఒక్కరూ కెప్టెన్ కావాలని ప్రయత్నించారు. దాని పర్యవసానాలు ఇప్పటికీ పాకిస్థాన్ క్రికెట్‌కు నష్టం కలిగిస్తున్నాయి. భారత్‌పై విజయం తర్వాత వన్డే, టీ20 ప్రపంచ కప్‌లు, ఆసియా కప్‌లు, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో పాక్ చెత్త ప్రదర్శన చేసింది. జట్టు నుంచి మంచి ఫలితాలు రాబట్టడానికి పీసీబీ ఎన్నో ప్రయత్నాలు చేసింది. కెప్టెన్లు, కోచులు, సహాయక సిబ్బందిని మార్చింది. అయినా ఏ ఆటగాడూ ముందుకు వచ్చి బాధ్యత తీసుకోలేదు'' అని మహ్మద్ యూసుఫ్ పేర్కొన్నాడు. 2021 టీ20 ప్రపంచ కప్‌లో టీమ్ ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో 152 పరుగుల లక్ష్యాన్ని పాక్ ఒక్క వికెట్ నష్టపోకుండా ఛేదించింది. ఓపెనర్లు బాబర్ అజామ్ (68), మహ్మద్ రిజ్వాన్ (79) నాటౌట్‌గా నిలిచి జట్టుకు ఘన విజయం అందించిన విషయం తెలిసిందే. పొట్టి వరల్డ్ కప్ చరిత్రలో భారత్‌పై పాక్ గెలవడం అదే మొదటిసారి. ఇక, మహిళల క్రికెట్‌లో ఎన్నో ఏళ్లుగా పాకిస్థాన్‌పై తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తున్న భారత జట్టు.. ఆసియా కప్‌లోనూ పైచేయి సాధించింది. శనివారం గ్రూప్‌ఎలో తన చివరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన 7 వికెట్ల తేడాతో పాక్‌ను చిత్తు చేసింది.

## సాత్విక్ – చిరాగ్ జోడీకి చైనా మాస్టర్స్ టైటిల్



భారత డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి ఖాతాలో మరో టైటిల్ చేరింది. చైనా మాస్టర్స్ సెమీస్‌లో సంచలన విజయంతో ఫైనల్ చేరిన ఈ జోడీ.. ఆఖరి పోరులో చైనా జంటను చిత్తు చేసింది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో హే జీ టింగ్ రెన్ గ్జియాంగ్‌పై అద్భుతం విజయంతో విజేతగా నిలిచింది సాత్విక్ చిరాగ్ జంట. తొలి సెట్ కోల్పోయినా ఆత్మవిశ్వాసం కోల్పోకని భారత జోడీ వరసగా రెండు సెట్లలో గెలుపొందింది. దాంతో.. చైనా షట్లర్లకు నిరాశే మిగిలింది. చైనా మాస్టర్స్‌లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి ద్వయం ఛాంపియన్‌గా నిలిచింది. పురుషుల డబుల్స్‌లో అంచనాలు అందుకుంటూ ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత జంట ధాటికి చైనా షట్లర్లు చేతులెత్తేశారు. తొలి సెట్‌ను 11–21తో కోల్పోయిన సాత్విక్ జోడీ ఒత్తిడికి లోనవ్వలేదు. రెండో సెట్‌లో గొప్పగా ఆడి హే జీ టింగ్ రెన్ గ్జియాంగ్‌కు 21–13తో షాకిచ్చింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లోనూ భారత ద్వయం చెలరేగింది. ఫలితంగా 21–17తో సెట్‌ను గెలుపొందడంతో పాటు టైటిల్‌నూ సొంతం చేసుకుందీ స్టార్ జోడీ. గతంలో రెండుసార్లు (2023, 2025) ఈ టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన సాత్విక్ చిరాగ్.. ఈసారి తమ కలను సాకారం చేసుకుంటూ విజేతగా నిలిచారు. మొత్తంగా ఈ సీజన్‌లో వీరికి ఇది రెండో టైటిల్. ఈమధ్యే ఈ జంట సింగపూర్ ఓపెన్ సూపర్ 750 టైటిల్‌ను గెలిచింది.

## ఫైనల్‌లో సూర్యవంశీకి బిగ్ షాక్



దులీప్ ట్రోఫీ 2026–27 ఫైనల్ మ్యాచ్ చెన్నైలోని ఎంఎ చిదంబరం స్టేడియంలో ఈస్ట్ జోన్, సౌత్ జోన్ జట్ల మధ్య జరుగుతోంది. ఈ కీలక మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ తరఫున ఆడుతున్న యువ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ తొలి ఇన్నింగ్స్‌లో దూకుడుగా ఆడి 37 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్సర్ బాది 44 పరుగులు సాధించాడు. హాఫ్ సెంచరీ దిశగా దూసుకెళ్తున్న వైభవ్ సూర్యవంశీ.. ఫాస్ట్ బౌలర్ చామ మిలింద్ బౌలింగ్‌లో షార్ట్ పిచ్ బంతిని సిక్సర్‌గా మలచి అర్ధ శతకం పూర్తి చేయాలని ప్రయత్నించాడు. అయితే ఆ బంతి సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ తానయ్ త్యాగరాజన్ చేతికి చిక్కడంతో వైభవ్ సూర్యవంశీ పెవిలియన్కు చేరాల్సి వచ్చింది. అంతకు ముందు ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ, అభిమన్యు ఈశ్వరన్ కలిసి తొలి వికెట్‌కు అద్భుతమైన శతక భాగస్వామ్యాన్ని(100 పరుగులు) అందించారు. క్రీజులోకి వచ్చిన వెంటనే వైభవ్ సూర్యవంశీ తన జోరును ప్రదర్శించాడు. ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ వేసిన తొలి బంతికే అద్భుతమైన బౌండరీ బాదాడు. ఆ తర్వాత మహ్మద్ నిధిష్ బౌలింగ్‌లో రెండు ఫోర్లు కొట్టగా.. తిరిగి మహమ్మద్ సిరాజ్ ఓవర్‌లో ఏకంగా 14 పరుగులు పిండుకుని ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచాడు. ఈ టైటిల్ పోరులో తూర్పు జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఈ మ్యాచ్ లో సౌత్ జోన్ జట్టులో మహమ్మద్ సిరాజ్, దేవదత్ పడిక్కల్ వంటి స్టార్ ఆటగాళ్లు బరిలోకి దిగారు. ఇక ఈ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లో తక్కువ పరుగులు చేసినప్పటికీ బౌలింగ్‌లో రాణించిన వైభవ్ సూర్యవంశీ.. సెమీ ఫైనల్స్‌లో అద్భుత ఇన్నింగ్స్‌లతో(92, 40 పరుగులు) దులీప్ ట్రోఫీలో అర్థ సెంచరీ సాధించిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు.

# ఆరోగ్యం

## 'బుండిబుగ్యో' ఎబోలా

డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డిఆర్‌సి)లో ప్రస్తుతం ఎబోలా వ్యాధి వేగంగా వ్యాపిస్తుండడం ప్రపంచ ఆరోగ్య నిపుణులను అప్రమత్తం చేసింది. 2026 మేలో ఈ వ్యాధి అధికారికంగా గుర్తించినప్పటి నుంచి ఇప్పటివరకు 837 నిర్ధారిత కేసులు, 196 మరణాలు నమోదయ్యాయి. ఈసారి వ్యాధికి కారణమైన వైరస్ 'బుండిబుగ్యో' రకం కావడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది. ఈ వైరస్‌కు ఇప్పటివరకు ఆమోదం పొందిన టీకా లేదా ప్రత్యేక చికిత్స అందుబాటులో లేదు. నిపుణుల ప్రకారం, ప్రారంభ దశలో ఈ వైరస్‌ను సాధారణ 'జైర్' రకం ఎబోలాగా భావించడం వల్ల సరైన నిర్ధారణ ఆలస్యమైంది. దీంతో వైరస్ అప్పటికే అనేక ప్రాంతాలకు వ్యాపించింది. అంతేకాకుండా, ఘర్షణలు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రజలు తరలిపోవడం, బాధితులతో సన్నిహితంగా ఉన్న వారిని గుర్తించే 'కాంటాక్ట్ ట్రేసింగ్' సమర్థంగా జరగకపోవడం కూడా వ్యాధి వ్యాప్తికి కారణమైంది.



ప్రస్తుతం బుండిబుగ్యో వైరస్‌కు టీకా అభివృద్ధి కోసం ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు వేగంగా సాగుతున్నాయి. వైరల్ వెక్టర్, ఎంఆర్ఎన్ఏ ఆధారిత టీకాలను అభివృద్ధి చేస్తున్నప్పటికీ, అవి మానవ పరీక్షలకు రావడానికి ఇంకా కొన్ని నెలలు పట్టే అవకాశం ఉంది. అయితే ఈ వ్యాధి ప్రపంచవ్యాప్తంగా మహమ్మారిగా మారే అవకాశం తక్కువగానే ఉందని అంటువ్యాధి నిపుణులు చెబుతున్నారు. ఎబోలా వైరస్ కరోనా మాదిరిగా గాలి ద్వారా వ్యాపించదు. ఇది ప్రధానంగా బాధితుల రక్తం లేదా ఇతర శరీర ద్రవాలతో ప్రత్యక్ష సంబంధం వల్ల మాత్రమే సంక్రమిస్తుంది. అందువల్ల బాధితులను వెంటనే గుర్తించి వేరుచేయడం, వారి సన్నిహితులను పర్యవేక్షించడం, క్వారంటైన్ చర్యలను సమర్థంగా అమలు చేయడం ద్వారా ఈ వ్యాధిని అదుపులోకి తీసుకురావచ్చని నిపుణులు విశ్వసిస్తున్నారు.

## కొలెస్ట్రాల్ చికిత్సలో ముందడుగు



కొలెస్ట్రాల్ చికిత్సలో 'విఇఆర్‌విఇ 102' అనే కొత్త జీన్ ఎడిటింగ్ ఆధారిత ఇంజెక్షన్ వైద్యరంగంలో ఆశాజనకమైన ముందడుగుగా గుర్తింపు పొందుతోంది. ఒక్కసారి ఇంజెక్షన్ తీసుకుంటేనే రక్తంలోని చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డిఎల్) స్థాయిని దీర్ఘకాలం గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని ప్రారంభ క్లినికల్ పరిశోధనలు సూచిస్తున్నాయి. ప్రతిరోజూ మందులు వాడాల్సిన అవసరం లేకపోవడం దీని ప్రధాన ప్రత్యేకత. ఈ చికిత్స కాలేయంలోని పిసిఎస్‌కె 9 జన్యువును లక్ష్యంగా చేసుకుని పనిచేస్తుంది. ఈ జన్యువు ప్రభావం తగ్గితే కాలేయం రక్తంలోని ఎల్‌డిఎల్ LపాL కొలెస్ట్రాల్‌ను మరింత సమర్థంగా తొలగిస్తుంది. ఫలితంగా రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయి గణనీయంగా తగ్గుతుంది. 'విఇఆర్‌విఇ 102' ప్రస్తుతం ఫేజ్1బి హార్ట్2 క్లినికల్ ట్రయల్ దశలో ఉంది. ఈ పరిశోధనలో అత్యధిక మోతాదు పొందిన కొంతమంది రోగుల్లో ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్ సుమారు 69 శాతం వరకు తగ్గినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే 'విఇఆర్‌విఇ 102' ఇంకా సాధారణ వైద్య వినియోగానికి ఆమోదం పొందలేదు. దీని భద్రత, దీర్ఘకాల ప్రభావం, దుష్ప్రభావాలపై మరిన్ని క్లినికల్ పరీక్షలు పూర్తయ్యాకే తుది నిర్ణయం తీసుకుంటారు. అప్పటి వరకు వైద్యులు సూచించిన కొలెస్ట్రాల్ చికిత్సను కొనసాగించడమే ఉత్తమం.

## ముదురురంగు సీసాల్లోనే ఎందుకు?



చర్మ సంరక్షణ ఉత్పత్తుల్లో విటమిన్ 'సి' సీరమ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. అయితే మార్కెట్లో లభించే దాదాపు అన్ని విటమిన్ 'సి' సీరమ్‌లు గోధుమ, అంబర్ లేదా ఇతర ముదురు రంగు గాజు సీసాల్లోనే విక్రయించబడతాయి. ఇది కేవలం ఆకర్షణీయమైన ప్యాకేజింగ్ కోసం కాదని, శాస్త్రీయ కారణాల వల్లనే ఈ విధంగా తయారు చేస్తారని నిపుణులు చెబుతున్నారు. ఔషధ, సౌందర్య ఉత్పత్తుల పరిశోధన నిపుణుడు డాక్టర్ సౌరభ్ అరోరా వివరణ ప్రకారం, విటమిన్ 'సి'లో ఉండే 'అస్కార్బిక్ యాసిడ్' కాంతికి, ముఖ్యంగా సూర్యరశ్మిలోని అతి నీలలోహిత (అల్ట్రావయొలెట్) కిరణాలకు చాలా సున్నితంగా స్పందిస్తుంది. కాంతి తగిలినప్పుడు అస్కార్బిక్ యాసిడ్ వేగంగా రసాయనిక మార్పులకు లోనై విచ్ఛిన్నమవుతుంది. దీనివల్ల అది తన ప్రభావాన్ని కోల్పోయి చర్మానికి ఆశించిన ప్రయోజనాలను అందించలేకపోతుంది. అందుకే కాంతి లోపలికి ప్రవేశించకుండా నిరోధించే ముదురు రంగు గాజు సీసాల్లో విటమిన్ 'సి' సీరమ్‌ను నిల్వ చేస్తారు. కేవలం కాంతి మాత్రమే కాదు, గాలిలోని ఆక్సిజన్ కూడా విటమిన్ 'సి' శత్రువే. విటమిన్ 'సి' ఒక శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ కావడంతో ఆక్సిజన్‌తో సులభంగా చర్యకు లోనవుతుంది. ఈ ప్రక్రియను 'ఆక్సీకరణ' అంటారు. సీసా తరచూ తెరవడం వల్ల కొంత గాలి లోపలికి వెళ్లినా, నాణ్యమైన డ్రాపర్ మూత సరిగ్గా మూసివేస్తే ఈ ప్రభావం చాలా వరకు నియంత్రణలో ఉంటుంది. అందువల్ల సాధారణ వినియోగంలో సీరమ్ నాణ్యత వెంటనే తగ్గిపోదని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల సరైన ప్యాకేజింగ్‌లో ఉన్న ఉత్పత్తులను నిర్దేశించిన విధంగా ఉపయోగిస్తే పెద్దగా ఆందోళన అవసరం ఉండదు. అయితే మంచి ప్యాకేజింగ్ ఒక్కటే నాణ్యతకు ప్రమాణం కాదని నిపుణులు సూచిస్తున్నారు. సీరమ్ తయారీలో ఉపయోగించిన విటమిన్ 'సి' రూపం, నీటి శాతం, ఇతర పదార్థాల కలయిక వంటి అంశాలు కూడా చాలా ముఖ్యమైనవి. ఉదాహరణకు నీటి ఆధారిత సీరమ్‌లలో సాధారణ అస్కార్బిక్ యాసిడ్ కంటే 'మెగ్నీషియం అస్కార్బిల్ ఫాస్ఫేట్' వంటి స్థిరమైన రూపాలను ఉపయోగించడం ఉత్తమం. అలాగే 'ఇథైల్ అస్కార్బిక్ యాసి డ్, 'సోడియం అస్కార్బేట్', 'టెట్రాహెక్సిల్‌డెసైల్ అస్కార్బేట్' వంటి విటమిన్ 'సి' వివిధ రూపాలు వేర్వేరు స్థిరత్వ లక్షణాలను కలిగి ఉంటాయి. అందువల్ల ఉత్పత్తి లేబుల్‌పై ఏ రూపంలోని విటమిన్ 'సి' ఉపయోగించారో పరిశీలించడం మంచిది. విటమిన్ 'సి' సీరమ్ పాడైందో లేదో తెలుసుకోవడానికి దాని రంగును గమనించడం ఒక సులభమైన మార్గం. సాధారణంగా పారదర్శకంగా లేదా లేత రంగులో ఉండే సీరమ్ క్రమంగా పసుపు, ఆపై గోధుమ రంగులోకి మారితే, అందులోని విటమిన్ 'సి' ఆక్సీకరణకు గురవుతున్న సంకేతంగా భావించాలి. ఉపయోగిస్తున్న కొద్దీ స్వల్ప రంగు మార్పు సహజమే అయినప్పటికీ, సీసా తెరిచిన వెంటనే ముదురు రంగులో కనిపించడం లేదా చాలా తక్కువ సమయంలో రంగు మారిపోవడం జరిగితే, అది తన ప్రభావాన్ని కోల్పో యి ఉండే అవకాశం ఉంది. నిపుణుల సూచనల ప్రకారం, విటమిన్ 'సి' సీరమ్‌ను మందుల మాదిరిగానే చల్లని, పొడి ప్రదేశంలో నిల్వ చేయాలి. నేరుగా సూర్యకాంతి తగలకుండా చూసుకోవడం, ప్రతి వినియోగం తర్వాత మూతను గట్టిగా బిగించడం వల్ల సీరమ్ నాణ్యతను ఎక్కువకాలం కాపాడుకోవచ్చు. సరైన పదార్థాలు, శాస్త్రీయంగా రూపొందించిన ఫార్ములా, తగిన ప్యాకేజింగ్, సరైన నిల్వ విధా నం అనే నాలుగు అంశాలు కలిసినప్పుడే విటమిన్ 'సి' సీరమ్ ఆశించిన ఫలితాలను అందించగలదని నిపుణులు సూచిస్తున్నారు.

# దేశ సంపద బహుళ జాతి సంస్థలకు ధారాదత్తం

- సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం దేశ సంపదను బహుళజాతి సంస్థలకు, పెట్టుబడిదారులకు దారాదత్తం చేస్తుందని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ తోడే అడివయ్య జీవిత చరిత్ర పుస్తకావిష్కరణకు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై నూతన పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతో మంది వామపక్ష వాదులు భూమి కోసం పోరాడి ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రాంతానికి చెందిన వామపక్షవాదులు కె.కృష్ణమూర్తి, తోడే అడివయ్య, పోచమోని జంగయ్య, కర్రె కోటప్ప, కుకుడాల జంగారెడ్డితో పాటు అనేక మంది పోరాటయోధులు భూమి భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం పోరాడిన నాయకులను స్ఫూర్తిగా తీసుకొని అణగారిన వర్గాల చైతన్యానికై నడుం బిగించి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి పార్లమెంట్‌లో గతంలో ప్రాతినిధ్యం వహించిన సిపిఐ నాయకులు కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం, కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డిలు చట్టసభల్లోకి వెళ్లి నీతిగా, నిజాయితీగా సంస్థాన్ నారయాణపూర్, మునుగోడుతో పాటు ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించే వారని అన్నారు. గతంలో ఇబ్రహీంపట్నం వామపక్ష పార్టీ నాయకులు బంధూక్‌లు ఎక్కు పెట్టి దొరలకు, జమీందారులకు వ్యతిరేకంగా పోరాడి దున్నేవానికే భూమి కావాలనే నినాదంతో సమరశీల పోరాటం చేసిన ఘన చరిత్ర ఇబ్రహీంపట్నం గడ్డకు ఉందని పేర్కొన్నారు. నేడు పార్లమెంట్, చట్టసభ, అసెంబ్లీలోకి పెట్టుబడిదారులు, రియల్ ఎస్టేట్ దారులు, బడా వ్యాపారవేత్తలు అడుగు పెట్టి పేద ప్రజల ప్రజాధనాన్ని దోచుకొని దాచుకుంటున్నారని వాపోయారు. రాబోయే తెలంగాణ విమోచన దినం కార్యక్రమాలకు బిజెపి నాయకులు హంగు ఆర్భాటం చేయటం సరికాదని సూచించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో బిజెపి నాయకులు ఏనాడు పోరాటం పాల్గొన్న లేదని అన్నారు. భూ స్వాములకు, కార్పోరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడటానికి వామపక్ష పార్టీల కార్యకర్తలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పేద ప్రజల హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ప్రజాస్వామ్య, లౌకికవాదులు, వామపక్షవాదులు మద్దతు ఇవ్వాలని సూచించారు. పేద ప్రజల కోసం ప్రాణ త్యాగం చేసిన కామ్రేడ్ తోడే అడివయ్య జీవిత చరిత్రను కుటుంబ సభ్యులు పుస్తకం ఆవిష్కరించటం అభినందనీయమన్నారు. ముందుగా కామ్రేడ్ అడివయ్య, బాల్‌చందర్‌ల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఐ, సిపిఐ(ఎం) నాయకులు కావలి నర్సింహ, పి.జంగారెడ్డి, బి.స్వామేల్, కావలి సురేష్, పి .నీలమ్మ, సిహెచ్.జంగయ్య, పిఒడబ్ల్యు మాజీ అధ్యక్షురాలు సంధ్య, పి.నీలమ్మ, తోడే మానస, తోడే మదన్, శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వర్గరహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా పోరాడుదాం

- సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి



ప్రజాపక్షం/హసన్‌పర్తి : వర్గ రహిత సమాజమే నిర్మాణమే ధ్యేయంగా పోరాడుదామని భారత కమ్యూనిస్టు పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి అన్నారు. ఆదివారం బొర్ర శ్రీనివాస్ వర్ధంతి ఎల్లాపూర్ గ్రామ సిపిఐ కార్యాలయంలో గ్రామ సిపిఐ యాది సభ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో సోషలిజం ఏర్పాటు లక్ష్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ వీరోచిత విప్లవాలను సృష్టిస్తున్న తరుణంలో కామ్రేడ్ బొర్ర శ్రీనివాస్ వర్గ రహిత, వర్ణ రహిత సమాజ నిర్మాణం కొరకు ప్రజాస్వామిక నైతిక విలువలతో పోరాడిన విప్లవ వీరుడు బొర్ర శ్రీనివాస్ అని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ దళితులపై కమ్యూనిస్టులపై అర్బన్ నక్సలైట్లు ముద్ర వేసి, కేంద్రం నిర్బంధాన్ని పెంచి కుట్ర కేసులు బనాయించి రాజ్యాంగాన్ని దుర్వినియోగపరచి ప్రజాస్వామిక పోరాటాల్ని అణిచివేయ చూస్తుందని ధ్వజమెత్తారు. ప్రజా వ్యతిరేక పెట్టుబడిదారీ ఫాసిస్టు పాలకులపై పోరాటాలను తీవ్రతరం చేయడమే శ్రీనివాస్‌కు మనం తెలిపే నివాళులు అవుతాయని తెలిపారు. సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి మాట్లాడుతూ ఒకే దేశం ఒకే పార్టీ ఒకే నాయకుడు అనే కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామిక విధానాన్ని ప్రజల్లో ఎండ గట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ భార్య బొర్ర సరిత, కొడుకులు బుర్ర శ్రీనాథ్, నవీన, శ్రీకాంత్, మౌనిక, సిపిఐ సీనియర్ నాయకులు మోతే లింగారెడ్డి, పాక రవీందర్, ముజ్జిగ పరుశరాములు, మాజీ ఎంపిటిసి కే.సుదర్శన్ లంక దాసరి వెంకటయ్య, అల్లుడు బిడ్డ శైలేంద్ర, పరస్పాండ్ శ్రీవేణి, పరస్పాన్ దేవరకొండ ప్రభాకర్, మనుమలు అత్రావు, శుక్రాంత్, నాంపల్లి లక్ష్మ య్య, దుస్సా వెంకటేశ్వర్లు, ఎర్ర నాగరాజు, బొర్ర సంపూర్ణ, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## స్వరాష్ట్రంలోనే ఉద్యోగులకు సమస్యలు






- తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వస్తే ఉద్యోగుల సమస్యలు తీరుతాయని, మంచి సిఆర్‌సి, డిఎలు వస్తాయని ఆశించామని, కానీ స్వరాష్ట్రంలోనే ఉద్యోగుల సమస్యలకు బీజం పడిందని తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో తెలంగాణ ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో నిర్వహించిన 'సంకల్ప సభ' నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఉద్యోగులు ఈ సభకు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో పెండింగ్‌లో లేని పిఆర్‌సి, డిఏలు ప్రత్యేక రాష్ట్రంలో ఎందుకు పెండింగ్‌లో పడ్డాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సిఎం, డిప్యూటీ సిఎం పలుమార్లు చర్చలు జరిపి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని, పెండింగ్ డిఏలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయాలని, ప్రతినెలా రూ.2 వేల కోట్ల నిధులను ఉద్యోగుల బిల్లుల కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు. జెఎసి సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఉద్యోగులంతా సంఘటితం కావాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి హామీలను నెరవేర్చుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగుల జెఎసి నాయకులు ఎస్.రాములు, మహిపాల్ రెడ్డి, బాణాల రాంరెడ్డి, నిర్మల, రాధ, గరికె ఉపేందర్ రావు పాల్గొన్నారు.

## మార్కపూడి కోటేశ్వరరావు మృతికి సిపిఐ నివాళి



ప్రజాపక్షం/చింతకాని : నాగిలిగొండ గ్రామపంచాయతీ మల్టీ పర్పస్ సిబ్బంది మార్కపూడి కోటేశ్వరరావు (41) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మరణవార్త తెలుసుకున్న సిపిఐ జాతియ సమితి సభ్యులు భాగం హేమంతరావు నాగిలిగొండ చేరుకొని కోటేశ్వరరావు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ కోటేశ్వరరావు గ్రామపంచాయతీ సిబ్బందిగా ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండేవాడని ఆయన మృతి కుటుంబానికి తీరని లోటన్నారు. కోటేశ్వరరావు కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, గ్రామ సర్పంచ్ ఏపూరి పద్మ, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు షేక్ హుస్సేన్, మాజీ ఎంపిటిసి పిలిప్స్, చాట్ల మురార్జీ, చాట్ల బాబు, మార్కపూడి ఏలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కొమరయ్య ఆశయాలు నేటి తరానికి ఆదర్శం

- ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్
- ఘనంగా కామ్రేడ్ కొమురయ్య 30వ వర్ధంతి వేడుకలు




ప్రజాపక్షం/భూపాలపల్లి : సింగరేణి కార్మికుల హక్కుల పోరాట యోధుడు కొమురయ్య ఆశయాలు నేటి తరానికి ఆదర్శనీయమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ కొనియాడారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొమురయ్య భవన్లో కామ్రేడ్ కొమురయ్య 30 వర్ధంతి వేడుకలను బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ అధ్యక్షతన ఎఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి రాజ్ కుమార్, ఎఐటియుసి నాయకులు ఘన నివాళులు అర్పించారు. అలాగే భూపాలపల్లి ఏరియాలో అన్ని మైన్స్ డిపార్టుమెంటులలో కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మిక హక్కుల సాధనకు నిత్యం పోరాటాలు నిర్వహించి హక్కులను సాధించిన కార్మికుల జాతిపితగా కొమురయ్య నిలిచాడని కొనియాడారు. నల్ల నేలలో పొడిచిన ఎర్ర పొద్దులే కార్మికుల హక్కుల కోసం ఎఐటియుసి ఎర్రజెండా పక్షాన నిరంతరం పోరాటాలు నిర్వహించి అనేక హక్కుల సాధించిన పెట్టిన గొప్ప నాయకుడు అని అన్నారు. మనుబోతుల ఇంటి పేరుని యూనియన్ కొమురయ్యగా పిలిచే స్థాయికి ఎదిగాడని, కార్మికుల కష్ట నష్టాల్లో తోడునీడగా ఉండి కార్మికుల పెన్షన్ కావాలని పోరాడిన నాయకుడు, ప్రస్తుతం మనం తీసుకుంటున్న పెన్షన్ కొమురయ్య సాధించిపెట్టిందేనని గుర్తు చేశారు. నేటి తరానికి కొమురయ్య ఆశయాలు తెలవదని, వారి ఆశయాలను కొనసాగించాలని పిలుపు నిచ్చారు. నేటికీ కొమురయ్య ఆశయాలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాల సాధనకు కార్మికులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అయన మన మధ్యలో లేకపోయినా ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. కొమురయ్య పోరాట స్ఫూర్తితో రాబోయే రోజుల్లో పోరాటాలు నిర్వహించి హక్కుల సాధనకై ఉద్యమించాలని రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, గురుజేపల్లి సుధాకర్ రెడ్డి, నూకల చంద్రమౌళి, జి.శ్రీనివాస్ ఆసిఫ్ పాషా, తాళ్ల పోశం, తోట రామచందర్, ఎండి.కరీముల్లా, ఎల్.శంకర్, పి.శ్రీనివాస్, ఫిట్ సెక్రటరీలు టెంపుల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




## మైనర్ బాలికపై హత్యాచారం కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

రిమాండ్‌కు తరలింపు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మండల పరిధిలో ఓ గ్రామంలో మైనర్ బాలికపై జరిగిన హత్యాచారం ఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులు కూడా 19 సంవత్సరాలైన కాంపాటి విరామ్, పాముల ఆకాష్ లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు హుజూర్‌నగర్ సిఐ చరమందరాజు తెలిపారు. ఆదివారం సిఐ కార్యాలయంలో కేసు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలు వెల్లడించారు. సిఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఒక గ్రామానికి చెందిన మైనర్ బాలికపై జరిగిన హత్యచార ఘటన హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేయడం జరిగింది. ఈ అమానుష ఘటనపై పోలీసులు అత్యంత వేగంగా స్పందించి దర్యాప్తు చేపట్టారు. సమగ్ర విచారణ అనంతరం నిందితుల ఇద్దరిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని, వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మహిళలు, మైనర్ బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చలిగంటి నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం అభివృద్ధికి సహాయం అందిస్తా

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పద్మశాలి సమాజ అభివృద్ధికి, సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వనభోజనాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం సభ్యులు, బంధుమిత్రులతో ఎమ్మెల్యే ఆత్మీయంగా ముచ్చటించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం, ఆత్మీయతను పెంపొందించేలా ఇలాంటి ఆత్మీయ వనభోజనాల కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పద్మశాలి బంధువులందరూ ఐక్యంగా ఉంటూ సమాజ వికాసానికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు ఎలక్ట్రిక్ బైకులదే

ఏఐసిసి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** భవిష్యత్తులో ఎలక్ట్రిక్ బైకుల వినియోగం మరింత పెరగనుందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో మార్కెట్ రోడ్డులో ఎంజి వన్ భూమి ఇవి బైక్స్, ఆటో షో రూమ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం పెరుగుతున్న ఇంధన ధరలు, కాలుష్య సమస్యలకు ఎలక్ట్రిక్ వాహనాలు మంచి ప్రత్యామ్నాయంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బైకుల వినియోగంతో ఇంధన ఖర్చులు తగ్గడంతోపాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని అన్నారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలపై అవగాహన పెంచుకుని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వాటిని వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, పిడమర్తి కీర్తి లవన్, జిల్లా నాయకులు మొరిశెట్టి లక్ష్మాది, దండు మైసమ్మ ఆలయ చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

## గుప్తనిధుల కోసం అర్ధరాత్రి తవ్వకాలు

**ప్రజాపక్షం/చివ్వేంల :** మండలంలోని ఉండ్రుగొండ గుట్టల్లో పురాతనమైన శ్రీశ్రీశ్రీ లక్ష్మి నృసింహ స్వామి దేవస్థాన పరిసర ప్రాంతాల్లో కొంత మంది వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి గుప్త నిధుల కోసం తొవ్వకాలు నిర్వహించినట్లు సమాచారం. పోలీసులకు గుర్తు తెలియని వ్యక్తులు సమాచారం అందించడంతో 12.30 గంటల ప్రాంతంలో అక్కడికి వెళ్ళి కొంత మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారి వద్ద తొవ్వకాలకు సంబంధించిన పరికరాలు, గుప్త నిధుల గుర్తింపు కోసం ఉపయోగించే ఓ ఆధునాతనమైన పరికరాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈవిషయమై ఎస్ఐ మహేశ్వర్‌ను వివరణ కోరగా వాస్తవమేనని ఉన్నతాధికారుల ఆదేశాలతో దీనిపై సమగ్ర విచారణ జరుపుతున్నామని తెలిపారు.

## కరాటేతో ఆత్మవిశ్వాసం.. ఆత్మరక్షణ



**ప్రజాపక్షం/నకిరేకల్:** ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడంతో పాటు ఆత్మరక్షణ కోసం కరాటే విద్యను తప్పనిసరిగా నేర్చుకోవాలని ఎన్ఆర్ ట్రస్ట్ కార్యదర్శి కందాల ప్రమీల పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా, ఎన్ఆర్ విజ్ఞాన కేంద్రం నకిరేకల్ డోజో ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు నకిరేకల్, కట్టంగూర్, హాలియా మండలాల నుంచి 55 మంది విద్యార్థులు హాజరయ్యారు.జూనియర్ రెడ్, ఎల్లో,ఆరంజ్, గ్రీన్,పర్పుల్,జపాన్ బ్రౌన్ బెల్ట్ విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఉత్తమ గ్రేడింగ్ సాధించిన విద్యార్థులకు బెల్టులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈకార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బొజ్జ చిన్న వెంకులు, వంటేపాక వెంకటేశ్వర్లు, చీఫ్ ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్,జిల్లా వైస్ ప్రెసిడెంట్ అంతటి సోములు గౌడ్,కట్టంగూర్ మాస్టర్ వి.రామలింగం,నకిరేకల్ మాస్టర్లు ఆర్.విజయ్ కుమార్, ఎ.అంజి, ఎం.సత్యరాజ్, హాలియా నుంచి వెంకటేశ్వర్లు, నరహరి,సాయి శ్రీనివాస్,ఉదయ్, నవీన్,సైదులు,నాగరాజు, ఎ.కృష్ణ,కె.రవి, భగవాన్ సింగ్ పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 49వేల మంది విద్యార్థులకు

# బ్రేక్ ఫాస్ట్ స్కీం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన ఉచిత విద్య అందిస్తాం



**ప్రజాపక్షం/కోదాడ:** తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో 50కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న జవాహర్ నవోదయ విద్యాలయ నిర్మాణ పనులు స్థానిక ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి పరిశీలించారు. పాఠశాల భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌కు అదేశించారు. నిర్మాణ పనుల్లో రాజీపడవద్దని నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన ఉచిత విద్యను అందించే కార్యచరణలో భాగంగానే జవాహర్ నవోదయ విద్యాలయాలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అన్నారు. చిలుకూరు గుట్టలో 200 కోట్లతో యంగ్ ఇండియాఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సంక్షేమ పథకాలు అమలు, మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం బ్రేక్‌పాస్ట్ అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యచరణలో భాగంగా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 49వేల మంది విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వ విద్యారంగ బలోపేతంలో భాగంగా పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. దేశంలో తెలంగాణ రాష్ట్రం విద్యా రంగంలో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, కోదాడ మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నంబాబు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్డీవో సూర్యనారాయణ, వైస్ చైర్మన్ దేవరం మల్లీశ్వరి పాల్గొన్నారు.

**యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి**

నియోజకవర్గంలోని చిలుకూరు మండలం సీతారాంపురం సమీపంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ నిర్మాణ పనులను రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి పనులను వేగవంతం చేయాలని అదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలతో పాటు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఎంతో ప్రమాణికంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా పాల్గొన్నారు.



## 9 తండాల నీటి కష్టాలకు శాశ్వత విముక్తి కల్పించాలని వినతి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని న్యూబంజారాహిల్స్ గ్రామ పంచాయితీ పరిసర ప్రాంతాల్లోని 9 గిరిజన తండాల దశాబ్దాల తాగు నీరు, సాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ తెలంగాణ భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. గ్రామ సర్పంచ్ ధరావత్ కవిత రవీందర్ నాయక్, ఉపసర్పంచ్ బానోతు శివకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ నాయకులు, పెద్దల బృందం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఇక్కడి ప్రజల, రైతుల ఇబ్బందులను సుదీర్ఘంగా వివరించారు. గ్రామ పరిధిలోని ప్రజల తాగునీటి అవసరాలు, రైతుల సాగునీటి అవసరాలను తీర్చేందుకు గ్రామంలో నూతన చెరువును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ప్రతిపాదిత చెరువుకు 127 లిఫ్ట్ ఇరిగేషన్ పథకం నుండి పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించి అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కవిత రవీందర్, ఉప సర్పంచ్ శివకృష్ణ, గ్రామ పెద్దలు తెలిపారు.

## అభివృద్ధి పరుగులు.. ప్రజలకు సంక్షేమ ఫలాలు

వెయ్యి రోజుల ప్రజాపాలన.. ప్రజా వికాస సభ సక్సెస్

వేలాదిగా తరలివచ్చిన ప్రజానీకానికి ధన్యవాదాలు

ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రజాపాలన కొనసాగిస్తోందని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హాజరైనా నకిరేకల్‌లో నిర్వహించిన ప్రజా వికాస సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేసిన ప్రజలకు,నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.ఆదివారం నకిరేకల్ పన్నాలగూడెంక్యాంపు కార్యాలయంలో ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెయ్యి రోజుల ప్రజాపాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల మద్దతు సభ ద్వారా వెల్లడైందన్నారు. ప్రజా వికాస సభలో నకిరేకల్ నియోజకవర్గానికి మొత్తం రూ.339 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరిగాయని ఆయన తెలిపారు. రూ.32 కోట్లతో నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సీఎం ప్రారంభించారని, రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని చెప్పారు. రహదారుల నిర్మాణ పనులకు రూ.45.60 కోట్లు, నకిరేకల్ పట్టణ రోడ్ల నిర్మాణానికి రూ.17.50 కోట్లు, నకిరేకల్, చిట్యాల మున్సిపల్ కార్యాలయాల నిర్మాణానికి రూ.12 కోట్లు, ప్రభుత్వ కార్యాలయాల సముదాయ నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి రూ.9.85 కోట్లు, ఎక్సైజ్ కార్యాలయ నిర్మాణానికి రూ.1.10 కోట్లు, వెటర్నరీ ఆసుపత్రి నిర్మాణానికి రూ.90 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. మహిళా సంఘాల అభివృద్ధి కోసం రూ.127 కోట్ల చెక్కును అందజేసినట్లు పేర్కొన్నారు.ఆసిఫ్‌నగర్ కెనాల్ ద్వారా సుమారు 60 చెరువులు నిండేలా చర్యలు తీసుకుంటామని, ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని వీరేశం తెలిపారు. నకిరేకల్ నుంచి తిప్పర్తి వరకు, కట్టంగూర్ నుంచి నల్లగొండ వరకు రహదారుల అభివృద్ధితోపాటు కట్టంగూర్ పట్టణంలో అండర్‌పాస్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. నకిరేకల్ పట్టణంలోని మినీ స్టేడియం అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయనున్నట్లు సీఎం ప్రకటించారని తెలిపారు. చెరువుగట్టు ఆలయ అభివృద్ధికి కూడా త్వరలో ప్రత్యేక చర్యలు చేపడతామని హామీ ఇచ్చారన్నారు.ఈసమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, మాజీ జెడ్పిటిసి మాద యాదగిరి,కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు గాదగోని కొండయ్య, లింగాల వెంకన్న, చౌగోని శ్రీనివాస్,యాస కరుణాకర్, బొజ్జ సుందర్, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇంట్లో గృహప్రవేశం :** నకిరేకల్ మండలం మార్రూర్ గ్రామానికి చెందిన కొండేటి వెంకటరాములు నూతన ఇందిరమ్మ ఇంట్లో గృహప్రవేశ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



## ఎఐవైఎఫ్ రాష్ట్ర మూడో మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకుడు కొండూరి విప్లవ్ అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామంలో మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 8వ తేదీన యాదగిరిగుట్ట పట్టణంలో భారీఎత్తున యువజన కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9,10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులతో మహాసభలు ఉంటాయని, ఈ మహాసభ లకు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని పాలకులు అవలంబించే విద్యార్థి యువజన విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని కోరారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత ప్రధాన పాత్ర పోషిస్తుందని, దేశంలో ప్రజాస్వామ్య లౌకిక విలువల పరిరక్షణ కోసం ఏఐవైఎఫ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైయఫ్ మండల కార్యదర్శి కొండూరి రవితేజ, సీపీఐ శాఖ కార్యదర్శి బైకని రాజు, కొండూరి స్వామి వరికుప్పల రాకేష్, కొండూరి గణేష్, కప్పల అరుణ్, ఐతరాజ శ్రీను, కొండూరి రాజు, కొండూరి అఖిల్, కె.శ్రవణ్, కె.మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఎఐవైఎఫ్ పోరాటాలు



**ప్రజాపక్షం/మర్రిగూడ:** నిరుద్యోగ యువత సమస్యలను పాలకుల దృష్టికి బలంగా తీసుకెళ్లేందుకు, ఉద్యోగాల భర్తీ కోసం భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ రూపొందించేందుకు నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ మండల ఉపాధ్యక్షుడు గంట రాజు పిలుపునిచ్చారు.యాదగిరిగుట్టలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలకు యువత భారీ సంఖ్యలో తరలివచ్చి తమ గళాన్ని వినిపించాలని పిలుపునిచ్చారు.ఆదివారం మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కన్వీనర్ బుర్ర శేఖర్,ఎరుకలి నిరంజన్,జక్కల అంజయ్య, ఎం.డి.నజీర్, ఏఐవైఎఫ్ నాయకులు గోల్కొండ కిరణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతి కోసం ప్రజలంతా ఐక్య ఉద్యమం

అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న యుద్ధ వాతావరణం, హింస, సామ్రాజ్యవాద దురాక్రమణలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా నిలబడి శాంతి కోసం ఉద్యమించాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపిఎస్ఓ) రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవన్‌లో నిర్వహించిన ఏఐపిఎస్ఓ జిల్లా కమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ యుద్ధాల వల్ల సాధారణ ప్రజలే తీవ్రంగా నష్టపోతారన్నారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుధ పోటీకి, యుద్ధాలకు వెచ్చిస్తున్న భారీ నిధులను ప్రజల సంక్షేమం, విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో శాశ్వత శాంతి నెలకొల్పేందుకు దేశాల మధ్య స్నేహ సంబంధాలు, పరస్పర గౌరవం, సహకారం పెంపొందాల్సిన అవసరం ఉందన్నారు. మతం, కులం, ప్రాంతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలను తిప్పికొట్టాలని సూచించారు. శాంతి, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం, మానవ హక్కుల పరిరక్షణ కోసం యువత, విద్యార్థులు, మేధావులు, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజలను సభ్యత్వం చేర్పించడం ద్వారా వెళ్లాలని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా మహాసభలు నిర్వహించడానికి సమయత్తం కావాలన్నారు. ఏఐపిఎస్ఓ ఆధ్వర్యంలో శాంతి సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కార్యక్రమాలను మరింతగా నిర్వహిస్తామని తెలిపారు. ఏఐపిఎస్ఓ జిల్లా అధ్యక్షులు తొగటి మురళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గౌరవ అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్, కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు అనంతుల మల్లేశ్వరి, సహాయ కార్యదర్శి సారెడ్డి వెంకట్ రెడ్డి, గాలి రామకృష్ణ పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ వచ్చేంత వరకూ మా మద్దతు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చేంత వరకు తమ పూర్తి మద్ధతు ఉంటుందని సూర్యాపేట మేరు సంఘం అధ్యక్షుడు మునగాల సతీష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ నుండి పొట్టిశ్రీరాములు సెంటర్ వరకు మేరు సంఘం ఆధ్వర్యంలో బుల్లెట్ ట్రైన్ కోసం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని సూర్యాపేట మీదుగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట మీదుగా వస్తే జిల్లాలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వ్యాపార, పారిశ్రామిక, విద్యారంగాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించేందుకు చేపడుతున్న ఉద్యమానికి మేరు సంఘం తరపున అండగా ఉంటామని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట మీదుగా వచ్చేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చేంత వరకు ఉద్యమానికి తమ మద్ధతు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కర్నె ఉపేందర్, కోశాధికారి తెంబరేణి కృష్ణ, గట్ల సిద్ధప్ప, కీర్తి వెంకన్న, తెంబరేణి వీరేష్, దీకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.



## గంధమల్ల ప్రాజెక్ట్‌తో ఆలేరు సస్యశ్యామలం

ప్రాజెక్టు నిర్మాణానికి భూమిపూజ చేసిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామంలో నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టుతో ఆలేరు ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. గంధమల్ల ప్రాజెక్టు నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. భూమి పూజతో రిజర్వాయర్ నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభం కానున్నాయి. గంధమల్ల రిజర్వాయర్ పూర్తయితే ఆలేరు నియోజకవర్గంతో పాటు పరిసర మండలాలు సస్యశ్యామలం కానున్నాయన్నారు.గంధమల్ల ప్రాజెక్టు ద్వారా ఆలేరు నియోజకవర్గంలోని సుమారు 58 వేల ఎకరాలకు సాగునీరు అందనుండగా, 1.41 టీఎంసీల సామర్థ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్మించనుందని అన్నారు. రిజర్వాయర్ అందుబాటులోకి వస్తే రైతులకు సాగునీటి భరోసా కలగడంతో పాటు వ్యవసాయ అభివృద్ధికి మరింత ఊతం లభించనుందని తెలిపారు.గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిర్మలాపురం వద్ద శంకుస్థాపన చేసిన విషయం గుర్తు చేసి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతో, గంధమల్ల ప్రాజెక్టు నిర్మాణ పనులు ముందుకు సాగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ గంధమల్ల ప్రాజెక్టు నిర్మాణం ఆలేరు నియోజకవర్గ రైతుల చిరకాల స్వప్నమని, గంధమల్ల రిజర్వాయర్ పూర్తయితే ఆలేరు నియోజకవర్గంలోని సుమారు 58 వేల ఎకరాలకు సాగునీరు అందడంతో వేలాది మంది రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. గంధమల్ల ప్రాజెక్టును నిర్ణీత సమయంలో పూర్తి చేసి ఆలేరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే మా లక్ష్యం అని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూసర్వేను అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన పూర్తి చేసిందని, రిజర్వాయర్ నిర్మాణానికి సుమారు 1,000 ఎకరాల భూమిని సేకరించినట్లు తెలిపారు. గంధమల్ల, వీరారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన సుమారు 2,000 మంది రైతులు నిర్వాసితులు అవుతున్నాని, నిర్వాసిత రైతులకు పరిహారం చెల్లింపులో భాగంగా మొదటి విడతలో కట్ట నిర్మాణానికి సంబంధించిన 112 ఎకరాలకు రూ.27 కోట్ల పరిహారం ప్రభుత్వం అందించిందని,రెండో విడతలో జలాశయంలో భూములు కోల్పోతున్న 352 ఎకరాలకు రూ.88.84 కోట్ల పరిహారాన్ని ఇటీవల అందజేసినట్లు తెలిపారు.మిగిలిన భూములకు పరిహారం చెల్లించేందుకు అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి పంపించారని తెలిపారు.

## పారదర్శకంగా ఓటర్ల జాబితా

సబ్ కలెక్టర్ హర్ష చౌదరి



**ప్రజాపక్షం /కౌటాల :** అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి అధికారులను ఆదేశించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించేందుకు ఆదివారం ఆయన కౌటాల మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కౌటాలలోని 178, 179, 180 పోలింగ్ కేంద్రాలతో పాటు బోదంపల్లిలోని 195, 196 కేంద్రాలను సందర్శించిన ఆయన, అక్కడ జరుగుతున్న ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎక్కడా అర్హుల పేర్లు తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌటాల తహసీల్దార్ ప్రమోద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా ఎఫ్ఎల్ఎన్ సెల్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/మంచిర్యాల :** మంచిర్యాల జిల్లాలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) సెల్ ఏర్పాటుకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి చంద్రయ్య ఐఏఎస్ తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యా కార్యక్రమాల పర్యవేక్షణ కోసం ఒక ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, ముగ్గురు ఎస్జీటీ (తెలుగు, ఇంగ్లీష్, గణితం) పోస్టులను భర్తీ చేయనున్నారు. 56 ఏళ్ల లోపు వయస్సు, నిర్ణీత సర్వీసు అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. అకడమిక్ ప్యానెల్‌లో ఉన్నవారు అనర్హులని, దరఖాస్తులను 1:2 నిష్పత్తిలో కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ ఇంటర్వ్యూ ద్వారా తుది ఎంపిక చేస్తుం దని వివరించారు. 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

## చిన్నారిపై లైంగిక దాడి

నిందితుడికి రిమాండ్



**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** శాంతిఖనిలో చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. బెల్లంపల్లి రూరల్ సిఐ సిహెచ్ హనోక్ తెలిపిన వివరాల ప్రకారం శాంతిఖనికి చెందిన బాధిత బాలిక శనివారం సాయంత్రం ఇంటి ఎదుట ఆడుకుంటుండగా సమీపంలో ఉండే కాంపెల కిష్టయ్య తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఏడ్చుకుంటూ ఇంటికి చేరి కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలిపింది. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెల్లంపల్లి 2 టౌన్ ఎస్ఐ సిహెచ్ తిరుపతి కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై రూరల్ సిఐ సిహెచ్ హనోక్ దర్యాప్తు చేపట్టి నిందితుడు కాంపెల కిష్టయ్యను అరెస్ట్ చేశారు.కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి నిందితుడికి రిమాండ్ విధించారు.

## ఏడు రకాల వరి సాగుకే బోనస్

**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలో వానకాలం 2026 ప్రభుత్వం సూచించిన 7 వరి రకాలు వరి సాగు చేసిన రైతులకు మాత్రమే రూ.500 ల బోనస్ వర్తిస్తుందని మండల వ్యవసాయాధికారి శ్రీలత తెలిపారు. వరి సాగుకు సంబంధించి రైతులకు రైతు ఎక్కడైతే వరివిత్తనాలు కొనుగోలు చేశారో ఆ సీడ్ డీలర్ వద్ద రైతు వివరాలు నమోదు చేసుకోగలరని నమోదు చేసుకున్న వారికే బోనస్ ఉండును. కావున రైతులు గమనించాలన్నారు. తప్పనిసరిగా వరి విత్తనాలు తీసుకున్న డీలర్ వద్ద రైతు వివరాలు ఈనెల 10లోగా నమోదు చేసుకోవాలన్నారు.

## రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు.. గ్రహీతలను అభినందించిన ప్రిన్సిపాల్




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కొడంగల్‌లో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలకు చెందిన డాక్టర్ కె.రంజిత (కామర్స్) డాక్టర్ పి.రామకృష్ణ (భౌతికశాస్త్రం) రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికై కళాశాల విద్య కమీషనర్ శ్రీదేవసేన, విద్యాశాఖ కార్యదర్శి యోగితారానా చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక ధృవపత్రాలతో పాటు జ్ఞాపికను 10 వేల చొప్పున పారితోషికంను అందుకున్నారు. జిజి కళాశాలకు చెందిన ఇద్దరు అధ్యాపకులు ఒకేసారి రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులుగా అవార్డు తీసుకోవటం విశేషమని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామ్మోహన్‌రెడ్డి వారిని ప్రత్యేకంగా అభినందించారు. వైస్‌ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రంగరత్నం, టియు ఇసి మెం బర్ దండు స్వామి, పరీక్షల నియంత్రణాధికారి భరత్‌రాజ, ఇనయకుమా ర్, అకాడమిక్ కోఆర్డినేటర్ నహీదాబేగం, ఐక్యూఎసి కోఆర్డినేటర్ రాజేష్, ఎన్‌సీసీ అధికారి రామస్వామి, ఫిజికల్ డైరెక్టర్ బాలమని, వివిధ విభాగాధిపతులు రమేష్‌గౌడ్, ముత్తెన్న, చంద్రశేఖర్, జయప్రసాద్, వేణుగోపాల్, రాహుల్, ఉమాకిరణ్, అనసూయ, పూర్ణచందర్‌రావు, షేక్‌చాంద్, ఎటరాంకిషన్, సూపరింటెండెంట్ ఉదయ్‌భాస్కర్, సిబ్బంది అభినందనలు తెలిపారు. కళాశాలల అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

## నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని జర్నలిస్టుల నిరాహార దీక్ష

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** మెదక్ జిల్లాలో ఉన్న రామాయంపేట గతంలో నియోజకవర్గంగా ఉండేదని, మళ్లీ డీలిమిటేషన్‌లో భాగంగా నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని ఆదివారం నిజాంపేట మండల జర్నలిస్టులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రామాయంపేట నియోజకవర్గంగా ఏర్పడితే అన్ని మండలాలు అభివృద్ధి చెందుతాయని, గత 1952 సంవత్సరం నుండి 2009 వరకు రామాయంపేట నియోజకవర్గంగా కొనసాగిందన్నారు. అదేవిధంగా మళ్లీ రామాయంపేట నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని జర్నలిస్టులు కోరారు. మళ్లీ రామాయంపేట ను నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని వారు కోరారు. కుర్మా బాలరాజు, ఎదగని అంజయ్య, కొమ్మట రామస్వామి, శాల నాగరాజు, కొమ్మట బాబు, బజార్ తిరుమల గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నకు నలువైపులా కష్టాలే..

● యూరియా కోసం పరుగులు ● పంట కోసం పరితపించిన రైతన్నకు కరెంటు కష్టాలు ● దిగుబడిపై ఆందోళన





**ప్రజాపక్షం/మెదక్ :** వ్యవసాయం అంటేనే పండుగలా భావించే రైతన్నకు ప్రస్తుతం అదే వ్యవసాయం భారంగా మారుతోంది. పంట వేసినప్పటి నుంచి చేతికొచ్చే వరకు అడుగడుగునా సమస్యలు వెంటాడుతున్నాయి. మెదక్‌జి ల్లా వ్యాప్తంగా ఒకవైపు మండుతున్న ఎండలు మరోవైపు యూరియా కోసం పడిగాపులు ఇంకోవైపు పంటలను పట్టిపీడిస్తున్న మొగి పురుగు, తెగుళ్ల బెడద రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. దీనికి తోడు వర్షాల అనిశ్చితి నేల కొన గా కరెంటు కష్టాలు అన్నదాతకు కలవర పెడుతున్నాయి.

### యూరియా కోసం పరుగులు..

### తెగుళ్లతో తిప్పలు

పంటలకు కీలకమైన సమయంలో యూరియా కోసం రై తులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. యూ రియా యాప్ బుకింగ్‌లు, ఎరువుల కొరతతో రైతులు గం టల తరబడి వేచి చూడాల్సి వస్తోందన్న ఆవేదన వ్యక్తమవుతోంది. మరోవైపు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు పెరగడంతో పెట్టుబడి భారం అధికమవుతోంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన యూ రియా యాప్ బుకింగ్ ల వల్ల రైతులకు తలనొప్పిగా మారాయి. దీంతోపాటు రోజురోజుకు పెరుగుతున్న ఎరువుల ధరలతో చుక్కలు చూస్తున్నారు. ఎరువుల ధరలతో పాటు హమాలి, రవాణా చార్జీల పేరుతో రైతన్న దగ్గర ముక్కు పిండి వసూలు చేస్తున్నారు.పంటలను మొగి పురుగు, ఇతర తెగుళ్లు ఆశించడంతో నివారణకు అదనపు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇంత పెట్టుబడి పెట్టినా దిగుబడి ఎలా ఉంటుందోనన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది.

### రైతన్నకు కరెంట్ కష్టాలు..

### దిగుబడిపై ఆందోళన

వర్షాకాలంలోనూ ఎండల తీవ్రత పంటలపై ప్రభావం చూపుతోంది. ఒకసారి వర్షం కురిసినా ఆ తర్వాత రోజుల తరబడి వర్షం లేకపోవడంతో పంటలకు తేమ అందక రైతులు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. వర్షాలు సమయానికి పడకపోతే ఒక సమస్య.. భారీ వర్షాలు ఒక్కసారిగా కురిస్తే మరో సమస్యగా మారుతోంది. దీనికితోడు వి ద్యుత్ సరఫరాలో అంతరాయాలు రైతుల కష్టాలను పెంచుతున్నాయి. రోజుకు 8 గంటల గంటలకు మాత్రమే వ్యవసాయ సాయానికి అందిస్తున్నారు. విద్యుత్ అంతరాయం చాలా ఉండటంతో పొలాలకు నీరు సరిపోవడం లేదని రైతుల ఆందోళన చెందుతున్నారు.వ్యవసాయంలో పెట్టుబడులు ఏటా పెరుగుతున్నా రైతు ఆదాయం మాత్రం అం దుకు అనుగుణంగా పెరగడం లేదు. విత్తనం నుంచి పంట విక్రయం వరకు అన్నదాతకు అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. ఎరువులు సకాలంలో అందేలా చూడడంతో పాటు తెగుళ్ల నివారణపై వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయిలో తక్షణ సలహాలు, సహాయం అందించాల్సిన ఉంది.

## 24 గంటల్లో బాలుడి కిడ్నాప్.. కేసును ఛేదించిన పోలీసులు

వేదాన్షన్‌ను తల్లిదండ్రులకు అప్పగించిన సిపి సాయిచైతన్య






**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా ప్రభుత్వ మాతా శిశు ఆస్పత్రి నుంచి శనివారం అపహరణకు గురైన మూడేళ్ల బాలుడు వేదాన్షన్ ను 24 గంటల్లో పోలీసులు పట్టుకున్నారు. కిడ్నాపర్లు సుజాత ఎల్లమ్మను నిజాంపేట్ గ్రామస్తులుగా గుర్తించామన్నారు. ఆదివారం కమీషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 24 గంటల్లో కిడ్నాప్ కేసును ఛేదించామన్నారు. చాక్లెట్ ఆశ చూపించి కిడ్నాప్ చేశారని, ఆస్పత్రి నుండి బాలుడిని అపహరించగా పోలీసు వ్యవస్థ రంగంలోకి దిగిందన్నారు. సంగారెడ్డి జిల్లాలోని దౌల్తాబాద్ ప్రాంతంలో కిడ్నాపర్లను పట్టుకోవటం జరిగిందని, బాలుడి ఆచూకీ గుర్తించి అతనిని సురక్షితంగా రక్షించామన్నారు. ఈ కేసును సీసీ ఫుటేజీ ఆధారంగా ఛేదించినట్లు తెలిపారు. చిన్నపిల్లలకు మనమే అవగాహన కల్పించాలని సూచించారు. నిందితులుగా మెదక్ జిల్లా నిజాంపేట్ గ్రామ ప్రస్తుతం మేడ్చల్‌లో నివాసముంటున్న ఎ వన్ కోతాడి సుజాత (30) భర్త యెల్లం ఎ2గా మెదక్ జిల్లా నిజాంపేట్ గ్రామానికి చెందిన కోతాడి యెల్లం (38) ప్రస్తుతం మేడ్చల్‌లో నివాసముంటున్న ఇద్దరిని గుర్తించి అదుపులోకి తీసుకోవటం జరిగిందని తెలిపారు. అపరిచిత వ్యక్తులు ఏ వస్తువులు ఇచ్చినా తీసుకోవద్దని పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు.

## ప్రపంచ దేశాలతో పోటీ పడాలంటే ప్రతీ ఇంటికి ఎలక్ట్రిక్ వాహనం

ఎంపి రఘునందన్‌రావు

**ప్రజాపక్షం/శివ్వంపేట :** ప్రపంచ దేశాలతో పోటీ పడాలంటే ప్రతీ ఇంటిఇ ఎలక్ట్రికల్ వాహనం వాడాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని శబాష్‌పల్లి గ్రామ శివారులో అయ్యవారి షాదుల్ల ఏర్పాటు చేసిన ఆర్జీఎన్ ఈవీ చార్జింగ్ స్టేషన్‌ను జిల్లా పార్టీ అధ్యక్షులు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, మండల అధ్యక్షులు పెద్దపులి రవితో కలసి ఆదివారం ఎంపీ ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రజలు తమ సొంత వాహనాలను వినియోగించుకోవడంతో పూర్తిగా ఇంధనంపై ఆధారపడాల్సి వస్తుందని, వివిధ దేశాల్లో ఉన్న యుద్ధ పరిస్థితుల దృష్ట్యా అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు అమాంతం పెరిగిపోతున్న విషయం గ్రహించిన ప్రధానమంత్రి నరేంద్రమోడి కొత్త ఆలోచనలతో సోలార్ విద్యుత్ వినియోగం వైపు మనల్ని మళ్లించారని ఆయన తెలిపారు. ప్రతి ఇంటింటికి సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుఓవడం కేంద్రం రూ. 70వేలు అందిస్తుందని తెలిపారు. మారుమూల ప్రాంతంలో ఈవీ చార్జింగ్‌కు ఇబ్బందులు కావొద్దనే ఉద్దేశ్యంతో ముందుకొచ్చిన శబాష్‌పల్లి అయ్యగారి షాదుల్లను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్టు అన్నారు.

## వెయ్యి రోజుల పాలనలో యువత కోసం అనేక చర్యలు

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ, సహస్ర ఫంక్షన్ హాల్‌లో సభ కార్యక్రమాన్ని పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం యువత కోసం ఉద్యోగాలు, స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, విద్య, క్రీడలు, పారిశ్రామిక అవకాశాలు వంటి రంగాల్లో పలు కార్యక్రమాలు చేపట్టిందని నాయకులు తెలిపారు. యువత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రధాన పథకాలు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ విద్యార్థులకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందించి చదువునైపుణ్యం, ఉద్యోగం దిశగా అవకాశాలు కల్పించే లక్ష్యం. పరిశ్రమలతో భాగస్వామ్యంతో ఉద్యోగ మార్కెట్ అవసరాలకనుగుణంగా కోర్సులు, శిక్షణనందించే విధానం.

**ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియ చేపట్టింది. 2024 డిఎస్‌సి ద్వారా 11062 ఉపాధ్యాయ పోస్టులకు నియామక ప్రక్రియ నిర్వహించింది. ప్రభుత్వం మొదటి సంవత్సరంలోనే 70,000లకు పైగా ఉద్యోగాలు భర్తీ చేసింది.

**యువతకు నైపుణ్య శిక్షణ :** ఐటీ, బిఎఫ్ఎస్ఐ పరిశ్రమలు వంటి అధిక డిమాండ్ ఉన్న రంగాల్లో ఉద్యోగానికి ఉపయోగపడే స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలకు ప్రాధాన్యం. ఐటిఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంట్రీస్‌గా అభివృద్ధి చేసే కార్యక్రమాలు కూడా యువతకు నూతన సాంకేతిక నైపుణ్యాలు అందించే దిశలో ఉన్నాయి. 2026–27 బడ్జెట్‌లో రాజీవ్ యువవికాసానికి 5800 కోట్లు కేటాయించటం జరిగింది. యువత తెలంగాణ భవిష్యత్తు విద్య, నైపుణ్యం, ఉద్యోగం, స్వయం ఉపాధి, క్రీడలు, నాయకత్వం ప్రతి రంగంలో యువతకు అవకాశాలు కల్పిస్తూ యువ తెలంగాణ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంది. యువతకు ఉద్యోగం మాత్రమే కాదు. ఉద్యోగం ఇచ్చే స్థాయికి ఎదిగే అవకాశాలను కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం. యువత కోసం యువ తెలంగాణ కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుంది.



**కాంగ్రెస్ ప్రభుత్వ యువత విధానం :** ఉద్యోగాలు,స్వయం ఉపాధి,నైపుణ్య శిక్షణ,పారిశ్రామిక అవకాశాలు,క్రీడలు,నాయకత్వ అభివృద్ధి అవసమర్నారు. నాయకులు పాల్గొన్నారు.

# యువత సమస్యలపై రాజీలేని పోరు

ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం




**ప్రజాపక్షం / నస్పూర్ :** యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని అఖిల భారత యువజన సమైక్య (ఎఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి లింగం రవి పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మూడో మహాసభల గోడపత్రికలను నస్పూర్ పట్టణంలోని నరసయ్య భవన్‌లో ఆవిష్కరించారు.రాష్ట్రంలో యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ఉపాధి, విద్య వంటి సమస్యలపై ఈ మహాసభల్లో విస్తృతంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. హక్కుల సాధన కోసం యువత ఐక్యంగా ఉద్యమించాలని, మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఎఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి లక్ష్మ ణ్, జిల్లా కోశాధికారి కొత్తపల్లి మహేష్, నాయకులు దొడ్డిపట్ల రవీందర్ చారి, సందీప్, సాలిగమా సంతోష్, గాజుల సంపత్ పాల్గొన్నారు.

## 12న జాతీయ లోక్ అదాలత్

రాజి మార్గమే రాజా మార్గం, జూనియర్ సివిల్ జడ్జ్ సుచరిత



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్ర కారం అ ల్లాదుర్గంలో ఈ నెల 12న ని ర్వహించే జాతీయ లోక్ అ దాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జూనియర్ తెలిపారు. అల్లాదుర్గం కొట్టులో పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె ఈ జాతీయలో ప్రధాని వి జయవంతం చే యాలని పిలుపునిచ్చారు. న్యాయస్థానాల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతూ సమయం ధనం వృధా చేసుకునేవారు ఒకరికొకరు సామరస్యంతో కక్షిదారులు సమస్యను పరిష్కరించు కోవాలని రాజీమార్గమే రాజ మార్గమన్నారు. ప్రభుత్వం తక్కువ ఖర్చుతో చట్టబద్ధమైన న్యాయం అందించడమే లక్ష్యంగా ఈ లోకదాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పలు రకాల కేసులు ఖర్చు లేకుండా పరిష్కరించుకోవడానికి కృషి చేయాలన్నారు. సిఐ రేణుక రెడ్డి శంకర్, కోర్టు సూపరిడెంట్ పద్మావతి సిబ్బంది ఉన్నారు.

## కాంగ్రెస్‌తోనే పేదల సొంతింటి కల సాధ్యం



**ప్రజాపక్షం/అల్లాదుర్గం :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇ ళ్ల పథకంలో భాగంగా అప్పాజీపల్లి గ్రామంలో కమ్మరి ప్రవీణ్ ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశం ఆదివారం గ్రామ సర్పంచ్ గందలి రవి, సీనియర్ నాయకులు సుభాష్ రావు దేశ్పాండే కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదల సొంతింటి కల కాంగ్రెస్తోనే సాధ్యమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకిషన్, బాలరాజు, శేఖర్ పటేల్, మర్క రా ములు, నాగయ్య, శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ చెట్టుకింద సాయిలు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

## క్రీడలు జీవితానికి క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను నేర్పిస్తాయి

సిపి సాయిచైతన్య



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** క్రీడల్లో ప్రాతినిధ్యం వహిస్తూ టోర్నమెంట్లలో అద్భుతమైన ప్రతిభ కనబర్చే క్రీడాకారులను ప్రత్యేకంగా గుర్తించి వారి ప్రతిభపై దినపత్రికల్లో కథనాలు ప్రచురించటంతో వారిని మరింత ప్రోత్సహించిన వారమవుతామని సీపీ సాయిచైతన్య అన్నారు. రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ నేతృత్వంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన అండర్ 16 బాలికల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, ప్రతిభ కనబర్చిన క్రీడాకారినులకు వ్యక్తిగత పురస్కారాలను అందజేసి సీపీ మాట్లాడారు. పిల్లలను క్రీడల వైపు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. క్రీడలతో సాధించేది ఏమి లేదని, విద్యపైనే దృష్టి పెట్టాలని కొంతమంది తల్లిదండ్రులు భావిస్తుంటారని, అయితే క్రీడలు జీవితాన్ని బో ధించే గొప్ప గురువులన్నారు. క్రీడా పోటీలలో ఓటమి ఎదురైనా నిరుత్సాహపడకుండా భవిష్యత్తులో తప్పకుండా విజయం సాధించాలనే లక్ష్యంతో ప్రణాళిక రూపొందించుకునే ఆలోచనా విధానం క్రీడలతో అలవడుతుందన్నారు.రాష్ట్ర, జిల్లా ఫుట్‌బాల్ సంఘం బాధ్యులను ప్రత్యేకంగా అభినందించారు.కార్యదర్శి జీపీ ఫాల్గుణ, కోశాధికారి గణపతి, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఫారూక్‌అలీ, ప్రధాన కార్యదర్శి జావిద్, ఉమెన్స్ కాలేజీ సొసైటీ జాయింట్ సెక్రటరీ పద్మనాజ్‌రెడ్డి, ట్రెజరర్ అబ్బన్న, కార్పొరేటర్ సుధీర్, కెజిఎఫ్ ఫౌండేషన్ నిర్వాహకులు మనోజ్‌కుమార్, డాక్టర్ విజయ్‌రాజ్ పాల్గొన్నారు.

# కుటీర పరిశ్రమలతో ఉపాధి చూపడం భేష్..

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/శివ్వంపేట :** కుటీర పరిశ్రమలతో ఉపాధి చూపించడం అభినందనీయమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. గుండ్లపల్లి గ్రామ సమీపంలో వట్టూరు శివారులో ఏర్పాటు చేసిన మణికంఠ ఎంటర్ ప్రైజెస్‌ను మాజీ సర్పంచ్ పెంజర్ల శ్రీనివాస్‌యాదవ్, హరీశ్‌యాదవ్, మహిపాల్‌రెడ్డి, బోళ్ల సదానందంతో కలసి ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ మారుమూల గ్రామాలలో కుటీర పరిశ్రమలను స్వయం ఉపాధి పొందుతూ తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలువడమే కాకుండా నలుగురి కుటుంబాలకు ఉపాది పోషణనిచ్చేందుకు ముందుకువచ్చిన మణికంఠ ఎంటర్‌ప్రైజెస్ నిర్వహకులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్టు ఆమె అన్నారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి, మాజీ ఎంపీపీ క ల్లూరి హరికృష్ణ, గ్రంథాలయ మాజీ చైర్మన్ చం ద్రాగౌడ్, జడ్పీకో ఆప్షన్ మాజీ సభ్యులు మ న్సూర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌ డ్, ఆత్మకమిటి మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, స ర్పంచ్ మమతన ర్సింహాయాదవ్, ఉప్పునూతల సత్యనారాయణ గౌడ్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## కరాటే మాస్టర్ నాగేష్‌కు ప్రతిష్ఠాత్మక పురస్కారం



**ప్రజాపక్షం / మెదక్ :** టీచర్స్ డే సందర్భంగా రేంజుకి షొటోకన్ కరాటే వ్యవస్థాపకులు,డైరెక్టర్ గ్రాండ్ మాస్టర్ నాగేష్ ప్రతిష్ఠాత్మక ఛత్రపతి శివాజీ మహారా జ్ అవార్డుతో సత్కరించారు. హైదరాబాద్‌లోని సరస్వతి పరిషత్ ఆడిటోరియ లో సెప్టెంబర్ 5న జరిగిన గ్లోబల్ ఎక్స్ లెన్స్ ఐకాన్ అవార్డు 2026లో అమ్మూర్ స్పోర్ట్స్ కల్చరల్ అవార్డ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. మార్షల్ ఆర్ట్స్, క్రీడా రంగంలో నాగేష్ చేసిన విశేష కృ షి, నాయక త్వం, యువ కరాటే సాధకులకు అందిస్తున్న మార్గదర్శకత్వానికి గు ర్తింపుగా ఈ అవార్డు లభించింది. ఈ సత్కారం రేంజుకి షొటోకన్ కరాటే కుటు ంబం, విద్యార్థులు, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులకు గర్వకారణంగా నిలిచిం ది. మాస్టర్ నాగేష్‌కు స్థానిక పట్టణ ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు.

"ప్రార్థనా చాబ్రియా ఇక ఆకాశంలో విమానాన్ని నడిపే పైలట్‌గా మాత్రమే కాదు.. వెండితెరపై నటిగా కూడా తన ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. ట్రైనర్ గ్రేడ్ పైలట్‌గా పనిచేసిన ప్రార్థనా చాబ్రియా ఇప్పుడు సినీ రంగంలోకి నటిగా అడుగు పెడుతున్నారు."

# రీల్



## 'చిరో'లో హీరోయిన్‌గా పైలట్ ప్రార్థన

ప్రార్థనా చాబ్రియా ఇక ఆకాశంలో విమానాన్ని నడిపే పైలట్‌గా మాత్రమే కాదు.. వెండితెరపై నటిగా కూడా తన ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. ట్రైనర్ గ్రేడ్ పైలట్‌గా పనిచేసిన ప్రార్థనా చాబ్రియా ఇప్పుడు సినీ రంగంలోకి నటిగా అడుగు పెడుతున్నారు. ఆమె నటిగా అరంగేట్రం చేస్తున్న 'చిరో' అనే తమిళ చిత్రం త్వరలో. ప్రేక్షకుల ముందుకు రానుంది.నటన పరంగా ఆది శక్తి అనే యాక్టింగ్ స్కూల్ నుంచి ప్రత్యేకంగా శిక్షణ పొందిన ప్రార్థనా చాబ్రియా.. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ఇప్పుడు వెండితెరపై తనదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతున్నారు. విమానాలను నడిపిన పైలట్‌గా నుంచి కెమెరా ముందు నటిగా మారిన ఆమె ప్రయాణం ఇప్పటికే సినీ వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రార్థనా చాబ్రియా నటనతో పాటు పోల్ డ్యాన్స్, బెల్లీ డ్యాన్స్‌లోనూ మంచి ప్రావీణ్యం కలిగి ఉన్నారు. దీంతో సంప్రదాయబద్ధమైన పాత్రలకు మాత్రమే కాకుండా విభిన్నమైన పాత్రలను పోషించే సామర్థ్యం ఆమెకు ఉందని తెలుస్తోంది. అలాగే సింధి, హిందీ, తమిళం, ఇంగ్లీష్ భాషల్లో అనర్గళంగా మాట్లాడగలిగే ప్రార్థనా .. భవిష్యత్తులో పాన్ ఇండియా, సౌత్ ప్రాజెక్టులతో పాటు తెలుగు చిత్ర పరిశ్రమలోకి కూడా అడుగు పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'చిరో' చిత్రం పండుగ రిలీజ్‌కు ధ్ధమవుతుండగా.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఏవియేషన్ రంగం నుంచి నటన వైపు ప్రార్థనా చాబ్రియా చేస్తున్న ఈ ప్రయాణం, ఈ ఏడాది సౌత్ ఇండస్ట్రీలో అరంగేట్రం చేస్తున్న కొత్త నటీనటుల్లో ప్రత్యేకంగా మారుతోంది.

## టీజర్ లాంచ్ ఈవెంట్‌లో దిల్‌రాజు



## 'తెల్లకాగితం' ఇన్నోసెంట్ లవ్‌స్టోరీ

అరుణాచల క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత కృష్ణ కొమ్మాలపాటి సమర్పణలో హర్ష్ రోషన్ ప్రస్తుతం చేస్తున్న చిత్రం 'తెల్ల కాగితం'. అక్టోబర్2న మూవీ రిలీజ్ అవుతుంది. 'కోర్ట్', 'బ్యాండ మేళం' వంటి చిత్రాలతో విజయం సాధించిన హర్ష్ రోషన్ హీరోగా నటిస్తున్నారు. నక్షత్ర హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. ఈ సినిమాతో రమేష్ బంట్రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. యూత్ ఫుల్ ఎమోషనల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి హైప్ క్రియేట్ అయింది. ఈ క్రమంలో మూవీకి సంబంధించిన టీజర్‌ను మేకర్స్ శనివారం రోజున రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత దిల్ రాజు, దర్శకుడు బాబీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇంకా భాను బోగవరపు, సినిమాటోగ్రాఫర్ కెవి.గుహన్, నటుడు అజయ్, నందు, రామ్ అబ్బరాజు, బెక్కెం వేణుగోపాల్, బివిఎస్.రవి, ఈటివి విన్ సాయికృష్ణ, హర్ష్ రోషన్, నక్షత్ర, శ్రావ్య, డైరెక్టర్ రమేష్ బంట్రెడ్డి సహా ఇతర చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ ''జీవితంలో తెలిసీ తెలియక అందరూ తప్పులు చేస్తుంటారనే విషయాన్నే ఈ సినిమాతో చె ప్పాలనుకున్నారు. తెల్లకాగితం మూవీ ఇన్నోసెంట్ లవ్ స్టోరి. కొత్త బంగారు లోకం తీసినప్పుడు నేనెగైతే ఫీలయ్యానన్నారు.

## అంతా రాములోరు చూస్కుంటారు టైటిల్ గ్లింప్స్ రిలీజ్



హీరో సంగీత్ శోభన్ నటిస్తున్న కొత్త సినిమా 'అంతా రాములోరు చూస్కుంటారు'. ఈ చిత్రంలో అనస్వర రాజన్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని శ్రీమతి శ్రావణి సమర్పణలో ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్, వి.జి.బి. ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ పై సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని, న్యూ యాస్పరెంట్ ప్రొడ్యూసర్ గిరిబాబు వల్లభనేని నిర్మిస్తున్నారు. ఎంటర్‌టైనింగ్ లవ్ స్టోరీతో టాలెంటెడ్ డైరెక్టర్ పల్నాటి సూర్యప్రతాప్ రూపొందిస్తున్నారు. లక్ష్మీ భూపాల్ రైటర్ గా వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్ లో 'అంతా రాములోరు చూస్కుంటారు' సినిమా టైటిల్ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ గిరిబాబు వల్లభనేని మాట్లాడుతూ ఎంటర్ టైన్ మెంట్ తో కూడిన లవ్ స్టోరీతో మా 'అంతా రాములోరు చూస్కుంటారు'ను నిర్మిస్తున్నాం. మా టైటిల్ లో ఉన్నట్లు అంతా రాములోరు చూసుకుంటారు అన్నారు.డైరెక్టర్ పల్నాటి సూర్యప్రతాప్ , ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని హీరోయిన్ అనస్వర రాజన్, హీరో సంగీత్ శోభన్ పాల్గొన్నారు.

## 10న వస్తున్న 'మండాడి'

తమిళ్ హీరో సూరి, టాలీవుడ్ యంగ్ హీరో సుహాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఆసక్తికరమైన చిత్రం ' మండాడి '. ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్‌పై మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. ఎల్రెడ్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమా ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తిస్తోంది. బోట్ రేసింగ్, యాక్షన్, ఎమోషన్స్, పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో 'మండాడి' ఒక ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా ఉండబోతుందనే అంచనాలు నెలకొన్నాయి. సెప్టెంబర్ 10 న ఈ సినిమా రిలీజ్ కానున్న నేపథ్యంలో తాజాగా శివ నిర్వాణ స్పెషల్ గెస్ట్ గా ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా హీరో సుహాస్ మాట్లాడుతూ దాకా వచ్చినందుకు చాలా హ్యాపీగా ఉంది. చిత్రయూనిట్ అందరి సపోర్ట్ వల్లనే సినిమా సక్సెస్ ఫుల్‌గా పూర్తి చేశాము. నటి మహిమా, రవీంద్ర విజయ్, సూరి నటన ఈ సినిమాకు మెయిన్ అసెట్స్. సెప్టెంబర్ 10న ఓ వినూత్న కంటెంట్ థియేటర్స్‌లో చూడటానికి సిద్ధంగా ఉండండి అన్నారు. యాక్టర్ సూరి మాట్లాడారు. భాస్కర్ భట్ల , యాక్టర్ రవీంద్ర విజయ్ హీరోయిన్ మహిమా నంబియార్, డైరెక్టర్ మతిమారన్ పుగళేంది,మైత్రి మూవీ మేకర్స్ నవీన్, డైరెక్టర్ శైలేష్ కొలను, డైరెక్టర్ శివ నిర్వాణ పాల్గొన్నారు.



## 'అల్లకల్లోలంగా' సాంగ్ లాంచ్

'గజ' కమర్షియల్ అంశాలతో పాటు సెల్యూట్ కొట్టేలా మంచి మెసెజ్, ఎమోషన్ కూడా ఉంటుంది.. 'అల్లకల్లోలంగా' సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో, నిర్మాత, దర్శకుడు సతీష్ జైచలంశెట్టి సునీల్ సమర్పణలో సతీష్ జై ఫిలమ్స్ బ్యానర్ మీద సతీష్ జై, ఫర్నాజ్ శెట్టి ప్రధాన పాత్రల్లో డా. మైత్రి శరణ్ నిర్మించిన చిత్రం 'గజ'. ఈ సినిమాకి సతీష్ జై దర్శకత్వం వహించారు. ఈ మూవీకి మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతాన్ని అందించారు. ఈ సినిమాని మైత్రి మూవీస్ తెలుగులో రిలీజ్ చేస్తోంది. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌కి ప్రముఖ దర్శకుడు సాయి రాజేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.



## తెలుగు సినిమా చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్





తెలుగు సినిమా చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్‌తో చంద్ర సిద్ధార్థ్ 'ఈ పాట కోరినవారు నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు': 18న విడుదల 'ఆ నలుగురు', 'మధుమాసం', 'అందరి బంధువయా', ఇదీ సంగతి 'ఆటగదరా శివా' తదితర చిత్రాలతో విలక్షణమైన దర్శకుడిగా తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకున్నారు చంద్ర సిద్ధార్థ్. ఆయన తాజాగా రూపొందించిన చిత్రం 'ఈ పాట కోరినవారు నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు'. దీనికి ఉప శీర్షిక 'ఎ ఫర్‌బిడెన్ రాగ ఫ్రమ్ ఎ ఫర్‌బిడెన్ సాగా'. ఫిల్మోత్సవ్ బ్యానర్‌పై ఆయనే సొంతగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రముఖ దర్శక రచయిత మదన్ అందించిన కథతో ఈ సినిమా రూపొందింది. హర్ష హీరోగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో అమైరా గోస్వామి, సుజనా రెడ్డి, ఇనాయా సుల్తానా, రవివర్మ, అశోక్ వర్ధన్, రేఖా నిరోషా తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సెప్టెంబర్ 18న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

'ఆ నలుగురు' చిత్రంతో మానవ సంబంధాలు, భావోద్వేగాలను బలంగా ఆవిష్కరించిన చంద్ర సిద్ధార్థ్, ఈసారి ఆధునిక థ్రిల్లర్ నేపథ్యంతో మరో భిన్నమైన చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నారు. ఇది మొట్ట మొదటి మిస్టరీ మ్యూజికల్ . సంగీతం, ధ్వని, మానవ మెదడు మధ్య ఉన్న సంబంధాన్ని కథలో కీలకంగా మలుస్తూ ఈ చిత్రం రూపొందింది. సౌండ్ థెరపీ, బ్రెయిన్ మ్యాపింగ్, జ్ఞాపకాలు, అపరాధ భావన వంటి అంశాలను మిస్టరీ కథనంతో మేళవించిన చిత్రమిది.ఈ సందర్భంగా దర్శక నిర్మాత చంద్ర సిద్ధార్థ్ మాట్లాడుతూ, ''భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్ ఇది.నా స్నేహితుడైన మదన్‌తో ఈ కథను సినిమా గా చేద్దామనుకున్నాము. ఇది మదన్ చనిపోయే ముందు చివరిగా ప్లాన్ చేసిన సినిమా. నేను అప్పట్లో మదన్ కథతోనే 'ఆ నలుగురు' సినిమా తీశాను. ఈ సినిమా కథ విషయానికి వస్తే, ప్రతి రోజూ రాత్రి సరిగ్గా పదిన్నర గంటలకు ఓ రేడియో స్టేషన్ నుంచి ఒకే పాట ప్రసారమవుతూ వుంటుంది. నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు ఈ పాటను కోరుతూ వుంటారు. అందుకే ఈ సినిమాకి 'నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు' అనే టైటిల్ పెట్టాను. ధ్వని, న్యూరోసైన్స్, జ్ఞాపకాలు, అపరాధ భావన, ప్రేమ వంటి అంశాలను మేళవిస్తూ రూపొందిన ఈ హైకాన్సెప్ట్ సైకలాజికల్ థ్రిల్లర్ ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని అందించడానికి ప్రయోగాత్మకంగా చేసిన ప్రయత్నం ఇది.ఈ సినిమాలో సంగీతానికి ఎంతో ప్రాధాన్యం వుంది. ఇందులో నాలుగు పాటలున్నాయి. జే రెక్స్ సంగీతాన్ని సమకూర్చారు. ఈనెల 18న ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం'' అన్నారు.హర్ష, అమైరా గోస్వామి, సుజనా రెడ్డి, ఇనాయా సుల్తానా, రవివర్మ అనిరుధ్ శ్రీవాస్తవ, అశోక్‌వర్ధన్, రేఖా నిరోషా, సన్నీ, గిరి తదితరులు నటించిన ఈ చిత్రానికి కథ: మదన్, సంగీతం: జే రెక్స్, పాటలు: చంద్ర సిద్ధార్థ్, మాటలు: పులగం చిన్నారాయణ, ఆర్ట్: అంజి కొయ్యల, సినిమాటోగ్రఫీ: సామ్ సుప్రీత్ , ఎడిటింగ్: బొబ్బిలి భానుప్రకాశ్, గిరిధర్, సహ నిర్మాతలు: అగస్త్య మంజు, సాగర్, మహి, సమర్పణ: వై.వి.సత్యనారాయణ రాజు, నిర్మాత – స్క్రీన్ ప్లే – దర్శకత్వం: చంద్ర సిద్ధార్థ్.



# లేబర్ కోడ్‌ల రద్దుకు కార్మికులు ఏకమై ప్రతిఘటించాలి



ప్రజాపక్షం/కరీంనగర్

కార్మికుల హక్కుల సాధనకు పోరాటాలే మార్గమని.. చరిత్ర అదే చెబుతుందని..ప్రస్తుతం అమలులో ఉన్న హక్కులు ఎన్నో పోరాటాలు.. ఎంతో మంది అమరుల త్యాగాల ఫలితంగానే సాధించుకున్నామని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ తెలిపారు. కార్మికులు సాధించుకున్న హక్కులను, చట్టాలను కాలరాసే పనిలో దేశంలోని పాలకులు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు కరీంనగర్‌లో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా భారీ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని అంబేద్కర్ స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ తెలంగాణ చౌక్ లోని సర్కస్ గ్రౌండ్ వరకు సాగింది. అనంతరం సర్కస్ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో వక్తులు ప్రసంగించారు. బహిరంగ సభకు ఎఐటియుసి నేత మహ్మద్ యూసుఫ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిధిగా అమర్‌జీత్ కౌర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎఐటియుసి అనేది కేవలం ఒక పేరు మాత్రమే కాదని, ఇది కేవలం జెండా మాత్రమే కాదని.. ఈ దేశ కార్మికుల చరిత్ర అని.. మన దేశ శ్రామికుల జీవితాలతో ముడిపడి ఉన్న జెండా అని.. కార్మిక ఉద్యమమే యావత్ ప్రపంచానికి మానవ హక్కుల పాఠాన్ని నేర్పిందని గుర్తుచేశారు. 14 గంటలు, 18 గంటలు, 20 గంటలు కష్టపడి పనిచేసినా కడుపునిండా తిండి దొరకని పరిస్థితి, భద్రత లేని స్థితి నుంచి 8 గంటల పని విధానం కోసం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్నామని అన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం మొట్టమొదట ఆ హక్కునే లాక్కుంటోందని, ప్రపంచవ్యాప్త కార్మికులు, మన దేశ కార్మికులు చేసిన శ్రమను, త్యాగాలను చెత్తబుట్టలో వేస్తోందని, సమ్మె చేసే హక్కును లాక్కోవడం, నిర్ణీత పని గంటలను రద్దు చేయడం, సామాజిక భద్రతను దూరం చేయడం, పని ప్రదేశంలో భద్రత కల్పించకపోవడం, వేతనాలు పడిపోతున్నా పట్టించుకోకపోవడం చేస్తోందని ఆరోపించారు. కార్మికుడు సృష్టించిన సంపదను అదానీ, అంబానీలకు, ప్రపంచ, దేశీయ కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసే మార్గంలో ఈ ప్రభుత్వం పయనిస్తోందని విమర్శించారు. కార్మిక చట్టాల స్థానంలో నూతనంగా నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టి కార్మికుల హక్కులను పూర్తిగా కాలరాసే పనిలో ఉన్నారని, వాటి రద్దు కోసం కార్మిక లోకం ఏకమై ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. సైమన్ కమిషన్, క్విట్ ఇండియా వంటి ఉద్యమాల్లోను ఏఐటీయూసి పాత్ర మరువ లేనిదని గుర్తు చేశారు. ప్రజలందరూ కుల మతాలకతీతంగా భారతీయులుగా దేశం కోసం, హక్కుల కోసం పోరాడుతున్నప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ ఏం చేసిందో.. ఆర్‌ఎస్‌ఎస్ అయిన నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలన్నారు. దేశంలో 70 శాతం జనాభా 35 ఏళ్లలోపు యువత అని,వారికి సరైన విద్య, ఉపాధి లేక యువత అల్లాడుతోతున్నారని, అందుకే జంతర్ మంతర్ వద్ద ఉద్యమాలు పుట్టుకొచ్చాయన్నారు.

### ప్రతి రంగంలో కార్మిక సంఘాలను బలోపేతం చేయాలి : కూనంనేని



సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, సృష్టి ఉన్నంతకాలం కమ్యూనిజం ఉంటుందని అన్నారు. ఎర్రజెండా ఉన్నంత కాలం ప్రజా, కార్మిక పోరాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. కమ్యూనిస్టులు ఎప్పుడూ పోరాటాల నుంచి వెనక్కి తగ్గరని, రాజకీయ పొత్తులు, రాజకీయ పరిణామాలు ఎలా ఉన్నప్పటికీ పొత్తులు పొత్తులే, పోరాటం పోరాటమే అని అన్నారు. కార్మికుల సమస్యలపై రాజీ లేకుండా పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీతో పాటు వైద్య, బ్యాంకింగ్, సేవారంగం తదితర అన్ని రంగాల్లో కార్మిక సంఘాలను బలోపేతం చేయాలని కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. తదుపరి మహాసభ నాటికి ప్రస్తుతం సంఘాలు లేని రంగాల్లో కూడా సంఘాలను ఏర్పాటు చేసి, వంద నుంచి నూట యాభై వరకు కొత్త కార్మిక సంఘాలను నిర్మించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు. ప్రతి సంఘంలో ఏఐటీయూసీ గొంతు వినిపించాలని, ప్రతి కార్మికుడి సమస్యపై ఏఐటీయూసీ ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు.

### కార్మిక హక్కుల సాధనకు రణభేరి మోగిస్తాం: చాడ

కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో, కార్మిక హక్కుల సాధనలో ఏఐటీయూసీ అగ్రగామిగా నిలిచిందని కొనియాడారు. కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దు చేసి, నరేంద్ర మోదీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లుగా మార్చడం దుర్మార్గమని మండిపడ్డారు. దీనివల్ల సమ్మె చేసే హక్కు, ప్రశ్నించే గొంతుక లేకుండా పోతున్నాయని, వెంటనే ఈ నాలుగు కోడ్లను రద్దు చేయకపోతే తాడోపేడో తేల్చుకునే సార్వత్రిక పోరాటాలకు కార్మిక సంఘాలు సిద్ధమవుతాయని హెచ్చరించారు.



అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్లు, హమాలీలు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస ఉద్యోగ భద్రత లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి జీవితాలతో ఆడుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యం, విద్యా రంగాల్లో కూడా ఔట్‌సోర్సింగ్ పెట్టి దోపిడీ చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో సుమారు 25 వేల మంది పేర్లతో బోగస్ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు జీతాలను స్వాహా చేస్తున్నాయని, పనిచేసే కార్మికులకు మాత్రం న్యాయమైన వేతనాలు అందడం లేదని ఆరోపించారు. ఈ దోపిడీపై ప్రభుత్వం కబోదిలా వ్యవహరిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అనభేరి ప్రభాకర్ రావు రక్తం చిందించిన కరీంనగర్ గడ్డపై నుంచే కార్మిక హక్కుల పరిరక్షణ కోసం రణభేరి మోగిస్తామని పిలుపునిచ్చారు.

### కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకం కావాలి : ఆర్. నారాయణమూర్తి



ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు ఆర్. నారాయణ మూర్తి మాట్లాడుతూ కరీంనగర్ పోరాటాలకు, విప్లవాలకు కేరాఫ్ అడ్రస్ అని, తెలంగాణ సాయుధ పోరాటంలో అనభేరి ప్రభాకరరావు, బద్దం ఎల్లారెడ్డి వంటి ఎందరో యోధులు ప్రాణ త్యాగం చేసిన నేల ఇదని కొనియాడారు. భూగర్భంలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న సింగరేణి కార్మికులను 'చీకటి సూర్యులు'గా అభివర్ణిస్తూ, దేశ నిర్మాణంలో కార్మికులదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, బీడీ, సిరిసిల్ల చేనేత, హమాలీ కార్మికులు సమాజానికి విశేష సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ దేశ సంపదను తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తుల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని, శ్రమకు తగిన వేతనం సాధించేందుకు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు కార్మికులంతా ఏకమై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కమ్యూనిస్ట్ పార్టీలన్నీ పూర్వం పిడికిలి బిగించినట్లు ఒక్క తాటిపై ఒకే కమ్యూనిస్ట్ పార్టీ ఉన్నట్లు ఇప్పుడు కూడా విడి విడి గా ఉన్న అన్ని కమ్యూనిస్ట్ పార్టీలు ఏకమై ఒకే పార్టీ గా ఉండ దానికి కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.

### కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం తప్పదు: బాలరాజు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేస్తామని ఏఐటీయూసీ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలరాజు స్పష్టం చేశారు. స్వాతంత్ర్యానికి పూర్వమే ఏర్పడిన ఏఐటీయూసీ అనేక ఉద్యమాల ద్వారా కార్మిక చట్టాలను సాధించిందని గుర్తుచేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చేందుకు యత్నిస్తుండగా, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాటికి నిబంధనలు (రూల్స్) రూపొందిస్తూ కార్మికుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు కేవలం రూ.3 వేల వేతనం ఇవ్వడం శోచనీయమని, ప్రజాప్రతినిధులు లక్షల్లో జీతాలు తీసుకుంటూ కార్మికుల శ్రమను గుర్తించకపోవడం దారుణమన్నారు. అంగన్‌వాడీ, ఆశా, వైద్య రంగాల్లోని కాంట్రాక్ట్ వర్కర్లు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మున్సిపల్, ఇతర కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు తగ్గించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. కాంట్రాక్ట్ వ్యవస్థ ద్వారా ధనవంతులను మరింత ధనవంతులుగా మారుస్తున్నారని మండిపడ్డారు. ఈ సమస్యలన్నింటిపై రాబోయే మహాసభల్లో కీలక తీర్మానాలు చేసి, కార్మిక వర్గానికి అండగా నిలబడి పెద్దఎత్తున ఉద్యమాలు నిర్మిస్తామని బాలరాజు హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న,ఏఐటియూసీ రాష్ట్ర నాయకులు ప్రేం పావని, కరుణ, దేవేందర్ రెడ్డి, నారటి ప్రసాద్ ఇమ్రాన్, సునీల్, దాసు, ప్రజాసంఘాల నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## దాడులు

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యాలపై ప్రతీకార దాడులు చేసింది. గురువారంనాడు దక్షిణ ఇరాన్‌లో ఒక వివాహ వేడుకపై అమెరికా చేసిన దాడిలో నలుగురు మరణించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తామని, దీనిపై తమకు సందేహాలున్నాయని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్ అన్నారు. అంతకుముందు మంగళవారం సిరిక్‌లో ఒక వివాహ వేడుకలో యుద్ధ శకలాలు పడ్డాయి. దీనిని ఇరాన్ యుద్ధనేరంగా ప్రకటించిందని మానవతావాద సంస్థ రెడ్ క్రెసెంట్ సొసైటీ పేర్కొంది. ఇరాన్ జలాల్లో లంగరు వేసి ఉన్న చమురు నౌకల పై దాడులను ఆ దేశ విదేశీమంత్రిత్వశాఖ తీవ్రం గా ఖండించింది. అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం గా అమెరికా దాడులు చేసిందని విమర్శించింది.

### యుద్ధం కాదు..సైనిక ఘర్షణ: ట్రంప్

శనివారం ఇరాన్ చేసిన దాడులపై ట్రంప్ ఎలాంటి వ్యాఖ్యా చేయలేదు. కానీ ఇరాన్‌తో జరుగుతున్నది యుద్ధం కాదని పునరుద్ఘాటించారు. ''ఇది యుద్ధం కాదు,నేను దీనిని సైనిక ఘర్షణగా పిలుస్తాను, ఇది మాకు చాలా చిన్న విషయం, పెద్ద విషయం కాదు'' అని తేలికగా కొట్టిపారేశారు. సైనిక ఘర్షణలు అడపాదడపా జరుగుతూనే ఉన్నాయన్నారు. ఒక విదేశంపై యుద్ధం చేయాలంటే అమెరికా కాంగ్రెస్ చట్టసభలు తీర్మా నం ద్వారా దేశాధ్యక్షుడికి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అందుకే ఆయన దీనిని సైనిక ఘర్షణగా పిలుస్తున్నారు. కాగా, ''అమెరికా నౌకలపై దాడులు చేస్తే ఇరాన్ చమురు ట్యాంకర్లను ముంచేస్తాం,ఇది చాలా సులభం'' అని అమెరికా యుద్ధ మంత్రి పీట్ హెగ్సెత్ ప్రకటించిన తర్వాత ఇరాన్ ప్రతీకార దాడులు చేసి సవాలు విసిరింది. శనివారం తమ ట్యాంకర్‌పై అమెరికా జరిపిన దాడిలో ఎవరూ గాయపడలేదని ఇరాన్ ప్రభుత్వ మీడియా సంస్థ 'ఐరిబ్' తెలియజేసింది. ఒమన్ తీరంలో రెండు చమురు ట్యాంకర్లపై అమెరికా జరిపిన దాడి నుండి తప్పించుకుని సిబ్బంది లైఫ్ బోట్లలో ఒడ్డుకు చేరుకున్నారని ప్రకటించింది. అనధికార మార్గాలలో ప్రయాణం చేస్తున్న మూడు నౌకలపై ఇరాన్ సైన్యాలు దాడులు చేసినట్లు ఐరిబ్ ప్రకటించింది. దక్షిణంవైపు అక్రమ మార్గంలో నౌకలు ప్రయాణం చేస్తే దాడులు తప్పవని ఐఆర్‌జిసి హెచ్చరించింది. పశ్చిమాసియాలో ఈ ఏడాది ఫిబ్రవరినెలాఖరున యుద్ధం మొదలైన తర్వాత హోర్ముజ్ జలసంధిని ఇరాన్ స్వాధీనం చేసుకుంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com